# బియాండ్ కాఫీ

మరో 9 కథలు

మహమ్మద్ ఖదీర్‌బాబు




# బియాండ్ కాఫీ

మరో 9 కథలు

మహమ్మద్ ఖదీర్‌బాబు

Kavali
Prachuranalu

2013



**Beyond Coffee**
and other stories
- by **Mohammed Khadeer Babu**

Copyright: with writer

Published: July 2013
**Kavali Prachuranalu**
1-13-6, Old town, Kavali - 524201.

Cover Design & Lay out: **Mallesh Sampangi**
+91 9705346103

Printed at:
**Kala jyothi** Process Pvt Ltd, Hyderabad.

Price: ₹ **135**

For Copies:
Visalandhara, **Navodaya**,
Prajasakthi and all leading book stores

For eBook:
www.**kinige.**com

కృతజ్ఞతలు

**ముక్తవరం పార్థసారథి** గారికి
**ఎ. గాంధీ** గారికి

# నా మాట

పెద్దగేం లేదు.

ఈ మధ్య నేనేమీ రాయలేదు. అంటే 'గెట్ పబ్లిష్డ్' తర్వాత ఏమీ రాయడానికి తోచలేదు. 'న్యూ బాంబే టైలర్స్' పుస్తకం వేశాక ఊరికే ఉన్నాను ఏం రాయాలా అని. అదీగాక రాయడంలో కొంత హింస ఉంది. ఎంత ఇష్టమైనది రాయాలన్నా, రాయడం ఎంత ఇష్టంగా ఉన్నా ఆ హింసను పడాలి. అదొకటి. రెండోది. రాస్తే వేయడానికి పత్రికలు ఎక్కువ లేవు. ఎలాగోలా వేయడానికి కాదు. సరిగ్గా వేయడానికి. రాశాక మనమే వాటిని పుస్తకం వేసుకోవాలి. మనమే అచ్చు వేయించి, ఆటోలో వేసుకొని, షాపుకు తీసుకెళ్లి వగైరా.. వగైరా...

అందుకే రాయడం గురించి ఆలోచించకుండా కూచున్నాను. అయితే ఈ మధ్య ఏవో బాధ్యతలు మారి అనివార్యంగా పుస్తకాల మధ్య ఉండాల్సి వస్తోంది. దాంతో మళ్లీ నా ప్రపంచంలో నేను పడ్డట్టయ్యింది.

ఎంతమంది మహానుభావులు. ఎన్ని మంచి పుస్తకాలు.

రాస్తే బాగుండు కదా అనిపించింది. కూచుని రాశాను. ఏకబికిన రాశాను. రాశాక

చాలా సంతోషం అనిపించింది. రాయడంలో ఎన్ని తలనొప్పులు ఉన్నా ఈ సంతోషం వేరెందులోనూ దొరకదనిపించింది. మహారాజుకు వాళ్లూ వీళ్లూ కిరీటం పెడతారు. మన రాతే మనకు కిరీటం.

వీటన్నింటినీ ఒకటనుకొని రాశాను. ఒకలా అనుకొని– అలా వచ్చి– రాశాను. ఇవి అక్కడొకటి అప్పుడొకటి అచ్చవుతూ పాఠకులకు తెలియడం నాకు ఇష్టం లేదు. ఒకచోట ఒకసారిగా వీటిని చదవాలి. అప్పుడు అంచనాకొస్తాయి. అందుకనే నేరుగా పుస్తకం.

లోకంలో ఎవరు దేన్నయినా కథగా రాయవచ్చు. కాని దాన్ని ఏ మేరకు సాహిత్యం చేశారనేది మీరు శ్రద్ధగా చూస్తారు. ఆ సంగతి నాకు తెలుసు.

ఇంకేంటి? కలుద్దాం.

జూన్ 10, 2013.

# కలైడోస్కోప్

ఓ హెన్రీ, మంటోలాంటి వాళ్లు ఏ విషయాన్నయినా కథగా రాయవచ్చునంటారు. ఒకనాడు హోటల్లో మెనూ కార్డు చదువుతూ 'దీని గురించి కథ చెబుతాను' అన్నాట్ట ఓ హెన్రీ. అదే మనకు తెలిసిన springtime a la carte. ఆలిండియా రేడియోలో ఓ అమ్మాయిని చూసి తక్షణమే 'ఆంఖే' రాసిచ్చాడు మంటో. తన సీనియర్ల కన్నా అడుగు ముందుకేసి 'ఒకటేం, పది కథలు రాస్తాన'న్నాడు ఖదీర్.

'దేని గురించైనా' అనే మాట ఈ కథలకు బాగా నప్పుతుంది. ఎందుకంటే, యివి దేని గురించో నిక్కచ్చిగా చెప్పడం కష్టమే. నమ్మేవాళ్లు ఇదంతా 'ఆత్మగ్లాని' కదా అనవచ్చు. మరొకరు Sartre చెప్పినట్టు Hell అనబడే self service cafeteria లో Exit కోసం వెదుక్కుంటున్న మనుషుల గురించి అనీ అనుకోవచ్చు. ఇంతకూ వీళ్లెవరు? కనుచూపు మేర విస్తరించి ఉన్న ఒక నిలువుటద్దాన్ని ఊహించుకోండి. అందులో ఎవరు కనిపిస్తారో వాళ్లే వీళ్లు– People in the Abyss. ఈ గోలంతా ఎందుకనుకుంటే Beyond Coffee చదవండి. Beyond your expectations, Sunsetలో ఉన్న జనం అక్కడ మోనేస్ సన్‌రైజ్ సిప్ చేస్తూ కనిపిస్తారు. నియంత్రించుకోలేని కోరికలు గుర్రమెక్కిస్తే థైలాండ్‌లో కబేళాను కూడా దర్శించవచ్చు (దీన్ని వర్ణించడం డాంటేకు కూడా మాటలకు మించిన విషయం. ఖదీర్ సాహసం చేశాడే!). పదిళ్లలోనూ ఒకవైపు

కాలి మసిబారిన కోరికల కమురువాసన. ఒకవైపు మానని గాయాల రసి. అంతలోనే రంగురాళ్లలా మెరిసే దుఃఖం. Singing in the pain.

రచయితకు 'ఎకానమీ ఆఫ్ వర్డ్స్ అండ్ థాట్' ఉండాలన్నారు చలంగారు. ఆ సలహాను తు.చ.తప్పకుండా పాటించాడీ రచయిత. వాక్యంలో కర్త, కర్మ, క్రియలుండాల్సిన అవసరముందా అని ప్రశ్నించుకుని ఒకటి రెండుంటే చాలనుకున్నాడు. కొన్నిసార్లు ఒకే ఒక పదం తర్వాత ఫుల్‌స్టాప్ పెట్టి మహా పొదుపరి రచయితగా రికార్డు సాధించాడు. చాలా కథల్లో మనుషులకు పేర్లే లేవు (వాళ్లు మనుషులా లేక గాల్లో ఎగురుతున్న ప్రేతాత్మలా?). కథాస్థలం ఎక్కడో చెప్పలేదు గనక అది మీ ఇల్లైనా కావచ్చు. ఏ సద్విమర్శకుడైనా వీటిని తలా తోకా లేని కథలంటే మనం అభ్యంతరం చెప్పనక్కర్లేదు. తలా తోకా తెగి గిలగిలా కొట్టుకుంటున్న మొండాలు వీళ్లు.

అప్పుడప్పుడు మనకు కేవలం రెండు మూడు లైన్స్‌లో గీసిన గాంధీ బొమ్మ కనిపిస్తుంటుంది. డ్రాయింగ్ గురించి కనీస పరిజ్ఞానం లేని నా వంటి వాళ్లు యింత సులభమా అని కూడా అనుకుంటారు. మీకు తెలిసిన ఆర్టిస్టునడగండి. అలా వెయ్యటం ఎంత 'సులభమో' వివరిస్తాడు. 'మీ చిత్రాల్లో ఆకారాలు స్పష్టంగా కనిపించవెందుకు?' అని అడిగితే 'నేను చెప్పదలచుకున్న దానికి ఎంత రూపం అవసరమో అంత వరకే

చిత్రిస్తాను. పోట్రెయిట్స్ వెయ్యటం నా పని కాదు' అని పుల్లవిరుపుగా సమాధాన మిచ్చాడట మరో చిత్రకారుడు. బియాండ్ కాఫీ కథల్లో స్పష్టత లేదంటే రచయిత ఇలాగే ఆలోచించి ఉండాలి మరి.

ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? ఎంత చెప్పాలి? అన్నవి ప్రతి కథకుణ్ణీ నిత్యం వేధించే ప్రశ్నలే.

అమెరికన్ రచయిత విలియం ఫాక్నర్ ప్రారంభ దశలో తనకు గురుతుల్యుడైన షెర్వుడ్ ఆండర్సన్‌తో తను రాయాలనుకున్న కథల గురించి తరుచుగా చర్చించేవాడట. 'ఆ అబ్బాయి చెప్పింది నాకు సరిగా అర్థం కాలేదుగాని అతడు 'Black house of pain'లోకి ప్రవేశించటానికి ప్రయత్నిస్తున్నాడని మాత్రం తెలిసింది అని తరువాత నెమరేసు కున్నాడు ఆండర్సన్. ఈ కథలు చదివింతర్వాత ఖదీర్ గురించి కూడా ఇలాంటి అభిప్రాయమే కలిగింది.

> "I have done my best- I don't know with what success- to write straightforward stories. I do not dare state they are simple: there is not anywhere on earth a single page or single word that is, since each thing implies the universe, whose most obvious trait is complexity.... The art of writing is mysterious; The opinions we hold are ephemeral. My stories try to be entertaining or moving but not persuasive"

ఈ మాటలన్న పెద్దాయన పేరు హోర్హె లూయిస్ బోర్హెస్. ఖదీర్‌తో సహా ఏ రచయితా కుప్పుసామయ్యర్ మేడ్ డిఫికల్ట్‌లాగ రాయాలనుకోడు. కాని కొన్ని కథలు లోపలికి యింకటానికి కొంత సమయం పడుతుంది.

నాకర్థమైనంత వరకూ యివి ఫేబుల్స్. అంటే నీతి కథలు. పంచతంత్రమైనా, ఈసప్ కథలైనా మానవ స్వభావాలను, మంచి చెడులను allegoricalగా చెప్పినవే. విలువలన్నీ వయ్యక్తికమూ సాపేక్షమూ అనుకుంటున్న ఈ రోజులకు యివి మోడ్రన్ ఫేబుల్స్. క్లుప్తతను మూల లక్షణంగా పాటించిన ఫేబుల్స్.

'బియాండ్ కాఫీ'లోకి ప్రవేశించడానికి వారగా తలుపు తీయటమే నా పని. అంతేగాని ముందుమాటలతో పాఠకుల ముందరికాళ్లకు బంధం వెయ్యటం మాత్రం కాదు.

– ముక్తవరం పార్థసారథి

# ఖదీర్‌బాబు కథలు

ఖదీర్‌బాబు కథల్ని చదవడానికి కష్టపడక్కర్లేదు. చదవడం మొదలుపెడితే చాలు కథే మిమ్మల్ని కడకంటా లాక్కుపోతుంది. ఇక్కడ పది కథలున్నాయి. పది కథల్లోనూ రచయిత పది రకాలుగా కనిపిస్తాడు. సైకో ఎనలిస్టుగా, సైకో థెరపిస్టుగా, రియలిస్టు పెయింటర్‌గా, ఇంప్రెషనిస్టుగా, కాఫీ టేబుల్ దగ్గర కథ చెప్పే స్నేహితునిగా, పాఠకుల చేతికి చిక్కి విలవిల్లాడే బాధిత రచయితగా, మానవ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న అన్వేషిగా– ఇలా రకరకాలుగా కనిపిస్తాడు.

ధనిక వర్గాల్లో తీరుబడి మరీ ఎక్కువై తమకు తామే శాపాలుగా మారిన పాత్రలను ఆనాడెప్పుడో చెకోవ్ చిత్రించాడు. తీరుబడికి స్త్రీత్వం తోడయితే ఆ శాపం రెట్టింపై అది ఆ పాత్రనే కాకుండా ఇతరులను కూడా ఎలా పీడిస్తుందో ఖదీర్‌బాబు పసికట్టాడు.

ఈ తరం చెడిపోయిందనీ ఈ తరానికి కష్టం సుఖం తెలియవనీ చేసే ఆరోపణలను ఖదీర్‌బాబు ఆమోదించడనిపిస్తుంది. కనీసం రెండు కథల్లో పెద్దవాళ్లు జీవితంలో ఒత్తిడిని తట్టుకోలేక తబ్బిబ్బవుతుంటే, ఇంకా పూర్తిగా జీవితంలోకి అడుగుపెట్టని

కుర్రాళ్లు సమస్య మూలాన్ని అర్థం చేసుకొని ఎంతో పరిణితితో పెద్దవాళ్ల ఒత్తిడిని తొలగించగలుగుతారు. అది చూసి మనం ముచ్చటపడక తప్పదు.

ధనిక కుటుంబంలో ఉన్నా స్త్రీ చేయని తప్పులకు కూడా ఎలా శిక్ష అనుభవిస్తుందో ఎంతటి విపత్కర పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వస్తుందో తెలియజేస్తాడు రచయిత. ఒక కథలో మంత్రాలు వేసి తంత్రాలు చేసి తాయెత్తులు కట్టే బాపతు తతంగాలతో కాలం గడిపే మనిషి మీద మనకు ప్రేమ, సానుభూతి ఉప్పొంగుతాయి. అదే ఆశ్చర్యం. మన రేషనల్ మైండ్ అటువంటి అభిమానానికి అడ్డు చెప్పదు.

మూస కథలు రాయడం ఖదీర్‌బాబుకి రాదు. ఈ కథల్లో మీకు ఏమైనా దొరకొచ్చుగాని డల్ మూమెంట్స్ మాత్రం మచ్చుకైనా దొరకవు. తినబోతూ రుచి అడగటమెందుకు, నా మాటలు వదిలేసి పక్కనున్న కథాస్రవంతిలో ఈదులాడండి.

– ఎ.గాంధీ

సంపాదకుడు, పీకాక్ క్లాసిక్స్

i thank

my friend
**A.Md.Imtiaz** gaaru
Deputy Commissioner (CT)
Nellore.



# కథలు


ఆస్తి • 17

ఘటన • 31

టాక్ టైమ్ • 43

వహీద్ • 57

మచ్చ • 67

ఏకాభిప్రాయం... • 75

పట్టాయ... • 85

అపస్మారకం • 111

ఇంకో వైపు • 123

బియాండ్ కాఫీ • 131

అస్తి

ఆ ఇల్లు చూడగానే గతుక్కుమన్నాడు.

గురువుకు ఎప్పుడో తప్ప గంట కొట్టదు. ఆ సంగతి శిష్యుడికి తెలుసు.

'ఏం హుజూర్?' అన్నాడు.

'చూడాలి యజమాన్' అన్నాడు హుజూర్.

కొందరికి దేవుడు వేరే ఏమీ ఇవ్వకపోయినా మంచి ఒడ్డూ పొడుగూ ఛాయా ఇస్తాడు. మరి అవే వాళ్లకి రక్ష. హుజూర్ ఆరడగులకు తక్కువ కాకుండా ఉంటాడు. పెద్ద ఛాతీ. గట్టి భుజాలు. తడిగా ఉండే కళ్లు. మెరిసే ముక్కు. చుబుకాన్ని కప్పేసి కంఠం దాకా దిగిన నల్లటి గడ్డం. గట్టిగా ముప్పయ్ ఉండవు. కాని పెద్దరికంలో తేడా ఏమీ రానివ్వడు. బిగువు సడలనివ్వడు. ఒకటి మాట్లాడే చోట ఒకటే. ఆరు మాట్లాడాల్సిన చోట పన్నెండు. చేతులు ముందుకు సాచి కదిలిస్తూ మాట్లాడతాడు. వేళ్లకు రకరకాల ఉంగరాలు. రాళ్లవి. వెండివి. రాగివి. బొటనవేళ్లకు కూడా తప్పవు. మంత్రగాడంటే ఆ మాత్రం హడావుడి ఉండాలి.

'అడగనా హుజూర్' అన్నాడు శిష్యుడు.

'ఒక్క నిమిషం యజమాన్' అన్నాడు హుజూర్.

సరిగ్గా నిలబడి తనను తాను చూసుకున్నాడు. పాలనురగ లాంటి తెల్లటి జుబ్బా. కింద అంతకు తక్కువ కాని పైజామా. చప్పుడు వినిపించేలా చేసే షోలాపూర్ చెప్పులు. చేతిలో పాతకాలం నాటి లెదర్ బ్యాగ్. అందులో తావీజులు, నల్లదారాలు, ఎర్ర దారాలు, ఆకుపచ్చటివస్త్రం కట్టిన టెంకాయలు, నిమ్మకాయలు, తెల్లకాగితాలు, రాగి రేకులు, బాల్‌పాయింట్ పెన్ను... ఒక ఆల్బమ్... సినిమా యాక్టర్లతో దిగినది.

'అడుగుతాను హుజూర్'

'నువ్వాగరారే'

బ్యాగ్ జిప్పు తీసి కొత్తగా పెరపెరలాడుతున్న ఆకుపచ్చ వస్త్రాన్ని తీసి వీపుకు తోక దిగేలా తలకు చుట్టుకున్నాడు. రెండు చేతులతో రెండువైపులా చెవుల మీదకు సర్దుకున్నాడు. స్థిరపడ్డాడు. ఇప్పుడు హుజూర్ అచ్చు దేవుడి బంటు. హుజూర్ ఏది చెప్తే అది దేవుడు వినక తప్పదు. హుజూర్ ఏది ప్రార్థిస్తే దేవుడు అది ఆలకించకా తప్పదు. ఇక హుజూర్ పాదం పెట్టిన చోట శాకినీలు డాకినీలు ఏం ఉంటాయి?

'ఇప్పుడు పో' అన్నాడు.

శిష్యుడు గార్డ్ రూమ్ దగ్గరకు వెళ్లి చేయి ఆడించి హుజూర్ వైపు చూపించాడు.

'ఏంటి?'

'మా గురువుగారిని మీ అమ్మగారు రమ్మనమని చెప్పారు. వచ్చాం. అమ్మగారికి చెప్పు'

గార్డ్‌కి సదభిప్రాయం కలగలేదు. ఆ ఇంటికి ఎవరూ దాదాపుగా ఆటోలో రారు. ఇల్లాంటి వాళ్లు తప్ప.

గార్డ్ ఇంటర్‌కమ్ నొక్కి ఏదో మాట్లాడాడు. తర్వాత ఫోన్ పెట్టేసి గేట్ తెరిచాడు.

పూర్తిగా టేకుతో చేసిన మందమైన గేటు అది. పలకల మీద సూక్ష్మమైన నగిషీ ఉంది. అంచులకు తెల్లగా పట్టీ ఉందిగాని అది వెండిది అని చెప్తే తప్ప ఎవరికీ తెలియదు.

శిష్యుణ్ణి గార్డురూమ్‌లోనే కూచోపెట్టి లోపలకి అడుగుపెడితే గేట్ నుంచి మెయిన్ డోర్ వరకూ చిన్న వంకరతో వేసిన దారి. అంచుల్లో తెల్లగా మిలమిల్లాడుతున్న అన్‌పాలిష్డ్ పెబల్స్. ఇరువైపులా తడిసి సేద తీరుతూ పచ్చగా మెరిసిపోతున్న లాన్. ఎడమవైపు చిన్న వాటర్‌బాడి. దాని అంచుల్లో తుప్పల్లా సోకు చేసిన మొక్కలు. నీళ్లల్లో మెరుస్తున్న ఎర్రటి నల్లటి చేపలు. జారుతున్న నీళ్లు. మడుగులో స్తబ్దుగా తామర ఆకులు.

హుజూర్ ఆగిపోయాడు.

ముందుకు వెళ్లడానికి లేదు. వెనక్కి వెళ్లడానికీ లేదు.

కుడివైపు లాన్‌లో నల్లటి కేన్‌బెడ్ మీద ఒక కుక్క తీరిగ్గా కూచుని హుజూర్ వైపే తీరిగ్గా చూస్తూ ఉంది. అది ఏమీ అనట్లేదు. కాని హుజూర్ గుండెలు దడదడలాడి పోయాయి. ఆ కుక్క ఏనుగంత ఉంది. వేగంగా కదలడానికి వీల్లేనంత పెద్దదిగా ఉంది. అది కరవక్కర్లేదు. దగ్గరగా వచ్చి గట్టిగా మొరిగితే చచ్చిపోతారు.

గార్డ్‌కి ఇది అలవాటులా ఉంది వెనుకనే వచ్చి- ఏయ్... ఫెబీ... చుప్.. చుప్-

అని తోడుగా మెయిన్ డోర్ వరకూ వచ్చి డోర్ తెరిచి లివింగ్ రూమ్‌లో కూచోపెట్టాడు.

అంతవరకూ ధైర్యంగా వచ్చాడుగాని హుజూర్ కాళ్లూచేతులు ఎందుకనో చల్లగా అయిపోయాయి. వీళ్లకు ఏం కావాలో. తాను ఏం చేయాలో.

తాను పని చేసే పెద్ద దర్గాకి ఇలాంటి శ్రీమంతులు చాలామంది వస్తుంటారు. ఫాతెహాలు... నిద్రలు... మొక్కులు... పొట్టేళ్లని జుబాహ్ చేసి అన్నదానాలు... వాళ్లకు తృప్తి ఉండదు. ఇళ్లకు వచ్చి అంత్రాలూ మంత్రాలూ చేసి వెళతారా అని అడుగుతారు. దర్గాలో మెరికల్లాంటి ముజావర్లు, మంత్రగాళ్లు ఉన్నారు. కాని చూపు హుజూర్ మీదే పడుతుంది. తెల్లగా వర్చస్సుతో వెలిగిపోతున్న హుజూర్‌లాంటి వాడే ఇలాంటి వాటికి యోగ్యుడని అందరూ భావిస్తారు. సాధారణంగా అన్నిచోట్లా ఇలాగే జరుగు తుంటుంది. హుజూర్‌నే అడుగుతారు చార్జీలు ఇస్తాం రండి... వచ్చాక మీరడిగింది ఇస్తాం రండి.

చెన్నై. బెంగుళూరు. హైద్రాబాద్.

ప్రతిచోటుకూ శిష్యుణ్ణి తీసుకొనే బయలుదేరుతాడు.

శిష్యుడికి ఏదో తెలుసని కాదు. మాటసాయానికి అంతే.

హుజూర్ సౌకర్యంగా కూచోడానికి మొహమాటపడుతున్నాడు. సోఫా చాలా మెత్తగా ఉంది. నున్నగా ఉంది. కింద ఫ్లోరింగ్. దానిని ఇంటి యజమాని స్వయంగా ఇటలీకి వెళ్లి సెలెక్ట్ చేసి ఆర్డర్ ఇచ్చి తెప్పించి చేయించాడు. అది చాలా తెల్లగా ఉంది. పాదానికి మురికి ఉంటే అందులో కనిపిస్తుంది.

పైన షాండ్లియర్‌లోని క్రిస్టల్స్ చాలా నాణ్యమైనవి.

వాటి మీద ఈగ వాల్లేదు. వాలి నిలువలేదు. క్రిస్టల్స్ వాటికవే నల్లబడలేవు. అందువల్ల రేటు ఎక్కువ అన్నాడు డీలర్. డెబ్బయి అయిదు లక్షలు! యజమాని ఒక నిమిషం ఆలోచించాడమో. ఆ తర్వాత చెక్కు రాసి అదే ఉండాలని చెప్పి వచ్చాడు. ఇక లివింగ్ రూమ్ కోసమే అన్నట్టు ఒక పాలరాయి విగ్రహం– స్త్రీది– బట్టలు ఉండీ లేనట్టుగా ఉంది. దానిని లండన్ నుంచి వేలం పాడి తెప్పించాడు. రేటు బయట పడలేదు.

లివింగ్ రూమ్ అంతా చక్కటి సువాసన.

హుజూర్ భుజాల కింద రాసుకున్న జన్నతుల్ ఫిర్‌దౌస్‌ను వాసన చూసుకుని సిగ్గుపడ్డాడు. అన్ని లోపాలకు విగ్రహమే జవాబు. నిటారుగా కూచున్నాడు.

పనిమనిషి వచ్చి కాఫీ ఇచ్చింది. ఆమె ఎంత శుభ్రంగా ఉందంటే హుజూర్ భార్య అచ్చు అలాగే ఉంటుంది.

'చీరలు ఇస్తే వద్దనకుండా తీసుకురండి' అని చెప్పింది హైద్రాబాద్‌కు బయలు దేరేటప్పుడు.

కాని హుజూర్‌కు చీరల మీదా కానుకల మీదా దృష్టి ఉండదు. ఇలాంటి చోటికి వస్తే ఎంతలేదన్నా రెండు గుప్పిళ్లు కొడతాడు ఖాయంగా. గుప్పిట అంటే అతడి భాషలో ఐదువేలు. ఎప్పుడో తప్ప మూడు నాలుగు గుప్పిళ్లు తగలవు. ఒకసారి చెన్నైలో ఐదు గుప్పిళ్లు దక్కాయి. ఆ ఇంటి యజమాని పనిమనిషిని మరిగి ఆస్తంతా ఆమెకు ఇచ్చే కార్యక్రమంలో ఉన్నాడు. ఇల్లాలు దర్గాకు వచ్చి పనిలో పనిగా హుజూర్‌ని పిలిపించింది చెన్నైకి. సంగతి చెప్పి ముక్కు చీదింది.

ఆమె ఏడుపులో అర్థం ఉంది.

ఇలాంటివాటి విరుగుడు హుజూర్‌కు చిటికెలో పని. ఒక బతికి ఉన్న పిల్లి మీసాలు దొరకాలి. ఒక బతికి ఉన్న ఎలుక మీసాలు కూడా. పిల్లి మీసాల మీద మగవాడి పేరు ఉచ్ఛరించి- ఎలుక మీసాల మీద ఆడదాని పేరు ఉచ్ఛరించి- అంతకు మించి చెప్పకూడదు. సరే, మొత్తం మీద ఇరవై ఒక్క రోజుల్లో వాళ్లిద్దరి మనసులు విరిచేస్తాను అని సవాలు చేశాడు హుజూర్. అలాగే జరిగింది. అప్పుడు ఆమె హుజూర్‌కు ఐదు పిడికిళ్లు సమర్పించుకుంది.

అలాగని హుజూర్ అన్నీ ఒప్పుకోడు.

ఒకసారి చెన్నైలో ఒక మ్యూజిక్ డైరెక్టర్ పిలిపించి ఇంకో మ్యూజిక్ డైరెక్టర్ మీద చేతబడి చేయించాలని చెప్పాడు. చేతబడి చేయించడమంటే కశ్మలానికి వికృతరూపం ఇచ్చి ప్రాణం పోయడం. అది ఎదుటివాణ్ణే కాదు మంత్రగాణ్ణి కూడా తినేస్తుంది.

నేను చేయను అని చెప్పి వచ్చేశాడు హుజూర్.

ఇది కొంచెం నయం. ఇంకోసారి ఇంకా దారుణం.

ఆ రాత్రి పొద్దుపోయి ఇంటికి వచ్చి నిద్రపోయాడు. అర్ధరాత్రి తలుపు తట్టారు. తెరిచి చూస్తే ఇంటి బయట కొత్త ఖరీదైన బండి. చెన్నై నుంచి వచ్చిందట. ఇప్పటి కిప్పుడు చెన్నైకి తీసుకెళ్లి తెల్లారే హైద్రాబాద్ ఫ్లయిట్ ఎక్కిస్తారట. అక్కడ అర్జెంట్ పని ఉందట. వద్దు వద్దన్నా విన్లేదు. ఎత్తుకెళ్లారు. హైద్రాబాద్ చేరేసరికి అక్కడ ఒక హీరో పరిస్థితి బాగలేదు. తాగి తాగి ఉబ్బిపోయి ఉన్నాడు.

హుజూర్‌ని చూసి- ఫలానా హీరోయిన్ ఫలానా హీరోని మరిగింది- అది నాక్కావాలి- వశీకరణం చెయ్యి- అని ఐదు లక్షల సూట్‌కేస్ టీపాయ్ మీద పెట్టాడు. ఆ హీరోయిన్ ఇప్పటికిప్పుడు కావాలట. తీసుకొని గదిలోకి పోవాలట.

హుజూర్‌కు ఇలాంటిది కొంచెం సాధ్యం కాదు.

'అలా జరగడం కష్టం' అని మర్యాదగా చెప్పి చూశాడు.

హీరో విన్లేదు. హుజూర్‌ని గదిలో పెట్టి తాళం వేశాడు. అప్పుడు దేవుడా ... హుజూర్ ఎవరితో మొరపెట్టుకున్నాడో చెప్పడం కష్టం. పైప్రాణాలు పైనే పోయాయి. హీరోకి మూడోరోజు మత్తు దిగితే నాలుగోరోజుకు బయటపడి ఊరు చేరుకున్నాడు.

హుజూర్‌కు గట్టిగా ఐదారు పనులు వచ్చు.

పిల్లలు కీడు చేసి ఏడుస్తారు– తాయత్తు కడతాడు. పని చేస్తుంది. ఇంట్లో శాంతి లేదు. చాలా సులభం. పెరట్లోనో వాకిలిలోనో పచ్చటి చెట్టు చూసి ఆయతు రాసిన కాగితం కడతాడు. నలభై రోజులు. సర్దుకుంటుంది. వ్యాపారం మట్టిగొట్టుకుని పోయింది. మంత్రం వేసిన టెంకాయని ద్వారబంధనానికి చుట్టబెడతాడు. కోలుకుంటుంది. అనారోగ్యం. నట్టింట్లో నిలబడి గట్టిగట్టిగా ప్రార్థనలు చేసి దువా చదివి ఇంట్లో నాలుగు మూలలకూ నాలుగు నిమ్మకాయలు దొర్లించాడంటే ఆ ఇంటి వాళ్లకి ఎంత ధైర్యం. ఇక అయినవాళ్లు ఎవర్నో తగులుకొని కాకుండా పోతున్నారు. సరే. ఏవో తిప్పలు.

అంతకు మించి రావు. ఆ సంగతి చెప్పడానికి లేదు. వీళ్లకు ఏం కావాలో.

పనిమనిషి వచ్చి 'అమ్మగారొస్తున్నారు' అంది.

హుజూర్ మళ్లీ నిటారు అయ్యాడు. కళ్లల్లో దైవత్వం తెచ్చుకోవడానికి చూశాడు. ముక్కు తుడుచుకున్నాడు.

అమ్మగారు వచ్చింది. హుజూర్ అదిరిపోయాడు. ఈమె ఎవరో. ఖరీదైన చీర. ఖరీదైన జాకెట్. చేతులకు వజ్రాల గాజులు. మెడలో బంగారు హారం. జబ్బల మీద జాకెట్ కొస నుంచి నడిమివేలి కొస దాకా బంగారువర్ణం. హూర్ పరీలు ఇలాగే ఉంటారని చిన్నప్పుడు విన్నాడు.

'ఎవరు?' అంది.

హుజూర్ లేచి నిలబడి నీళ్లు నమిలాడు.

'ఎవడ్రా నువ్వు?' గుడ్లు ఉరిమింది.

హుజూర్ నీళ్లు నీళ్లు అయిపోయాడు.

పనిమనిషి బతికించింది.

'పెద్దమ్మగారు రమ్మన్నారంట'

'ఎందుకు?'

హుజూర్ ధైర్యం తెచ్చుకుని అందుకున్నాడు. ఇలాంటప్పుడు వెంటనే ఎలాంటి సమాధానం చెప్పాలో తెలుసు. గుట్టు విప్పకూడదు.

‘చందా కోసం అమ్మా. దర్గాకి ఉర్సు. మీలాంటి యజమానులు చేయి అంది స్తారనీ’... అంతెత్తు మనిషి ఆ మాట అంటూ వినయంతో ఒంగిపోయాడు.

‘అందుకేనా?’ గద్దించింది.

‘అందుకే అమ్మా. మీలాంటివాళ్లు చల్లగా ఉండాలి. పది కాలాలపాటు మాలాంటి వాళ్లని దయ తలవాలి. అందుకే మా దువా. ఉర్సు చందనం తీసుకొచ్చి గడపకు పూస్తాను తల్లీ’... ఇంకా ఒంగాడు.

‘ఊ... ఇలాంటివేవైనా ఉంటే దర్గాల దగ్గరే చూసుకోవాలి. ఇంటికొచ్చేస్తే ఎలా? ఏం... అమ్మగారికి తెలియదా? నేను చెప్పానని చెప్పు’

పనిమనిషి తల ఊపింది.

‘శేకర్ ఎక్కడ?’

‘బండి తీసుకొని బయటికెళ్లారమ్మా’

‘ఏ బండి?’

‘చిన్నబండేనమ్మా’

‘పనుంటే పెద్దబండి తీసుకెళ్లమని చెప్పాను కదా’

పనిమనిషి ఏం మాట్లాడలేదు.

‘సరే. బాబు నిద్రపోతున్నాడు చూడు’

తలూపింది.

ఆమె వెళుతూ వెళుతూ హుజూర్‌ని చూసింది. హుజూర్ ఆమెను చూశాడు. ఆమె పిచ్చి పిచ్చి వేషాలు వేయకు చంపేస్తాను అని హెచ్చరించినట్టుగా హుజూర్‌కు అనిపించింది.

‘ఎవరు యజమాన్ ఈ తల్లి’ వెళ్లాక అడిగాడు.

‘ఇంటి కోడలు’ పనిమనిషి చెప్పింది.

హుజూర్‌కు మళ్లీ గంట కొట్టింది. అసలు ఇక్కడకు వచ్చినప్పటి నుంచి గంట కొడుతూనే ఉంది. ఇంటి మీద ఛాయ సరిగ్గా లేదు. తొందరగా ముగించుకొని బయట పడాలి.

కాసేపటికి పెద్దావిడ వచ్చింది. పలకరింపుగా నవ్వింది. నమస్కారాలంటే నమస్కారాలయ్యాయి.

‘ఏమనుకోవద్దండీ... మా కోడలు వెళ్లేదాకా ఆగాను’ అంది.

ఎదురుగా కూచుంది. ఆమె దర్గాకు వచ్చినప్పటికంటే ఇప్పుడు ఇంకాస్త నలిగి

పోయినట్టుగా ఉంది. కళ్ల కింద నలుపు పెరిగింది. ముఖంలో ఆందోళన కనిపిస్తూ ఉంది. కాని ఒంటి మీద మెరుపు మాత్రం తగ్గలేదు. బంగారంరంగు బార్డర్ ఉన్న మెత్తటి చీర. మెడలో హారం. రెండు చేతులకూ ఉన్న రెండు ఉంగరాలు ఆమె చేతులు కదిలించినప్పుడల్లా చక్‌చక్‌మని మెరుస్తున్నాయి.

హుజూర్ చూస్తూ ఉన్నాడు.

పనిమనిషి అలాగే నిలుచుని ఉంది.

'శేకర్ లేడు కదా' సందేహంగా అడిగింది.

'లేడమ్మా'

'ఇప్పుడల్లా రాడుకదా'

'రాకపోవచ్చమ్మా'

పెద్దావిడ కాసేపు ఆలోచించి 'స్వామీ... ఇక్కడ వద్దు. గార్డెన్‌లో కూచుందాం' అంది.

ఇంటిని కట్టి చుట్టూ స్థలం వదిలారు. అలా అనడం కంటే చాలా పెద్దఇల్లు కట్టాక కూడా చాలా పెద్దస్థలం మిగిలి ఉంది. కొంతలాన్. కొంత గార్డెన్. ఒక మూల సర్వెంట్ క్వార్టర్స్. సోకు చెట్లు. నీడనిచ్చే చెట్లు. పూల చెట్లు. క్రీపర్స్. వెనుక బాదం చెట్టు కింద గార్డెన్ సెట్ సిద్ధంగా ఉంది. తీసుకెళ్లి కూచోబెట్టింది. పనిమనిషి తోడు వచ్చింది.

'కాఫీ తీసుకురా. బాబును రమ్మను' అంది.

హుజూర్‌కు కేసు అర్థమైంది. పసివాడికి కీడు. బహుశా మొండి కీడు అయి ఉండాలి. దానికి విరుగుడు కోసం పిలిపించారు. కొన్నిసార్లు పిల్లలు ఏం చేసినా నిమ్మళించరు. ప్రాణాలు తీసే జబ్బు లేకపోతే చాలు. లేపి కూచోబెడతాడు.

హుజూర్ ధైర్యంగా కూచున్నాడు.

– మీకు ఫలానా కంపెనీ పెయింట్స్ తెలుసా? అని ఆమె అడిగింది.

హుజూర్ ఆ కంపెనీ పేరు విని ఉన్నాడు.

'ఆ కంపెనీ మాదే' అందామె.

– మీరు ఫలానా గ్లాస్ కంపెనీ పేరు విన్నారా? ఆమె మళ్లీ అడిగింది.

హుజూర్ దాని పేరు విన్లేదు.

'అదీ మాదే. మేము తయారు చేసే గ్లాస్ ఖరీదు ఎక్కువ. ఇక్కడ కనపడవు. విదేశాల్లో వాడతారు' అంది.

'హైద్రాబాద్ చెన్నై బెంగుళూరు నోయిడాల్లో మాకు చాలా ఆస్తులున్నాయి. చాలా.

మావారు నిమిషానికి కొన్ని లక్షలు సంపాదిస్తారు. ఇంట్లో ఉండేది తక్కువ. సంపాదించడమంటే ఆయనకు పిచ్చి. ఎప్పుడో తప్ప ఇంట్లో ఉండరు. ప్రస్తుతం నార్వేలో ఉన్నారు' అంది.

హుజూర్ వేగంగా ఆలోచించాడు. మనసు మారింది. ఇది చిల్లరమల్లర రెండు పిడికిళ్ల పార్టీ కాదు. ఛూమంత్రం వేసి ఐదారు పిడికిళ్లు లాగాలి. ఇంటి పనులు కొన్ని పెండింగ్ ఉన్నాయి. ఈ దెబ్బతో ముగించాలి.

కాఫీ వచ్చింది. ఈసారి కప్పు ఇందాకటిలా లేదు. పెద్దావిడతో సమానంగా అదే కప్పులో ఇచ్చారు. అంతటి పలుచటి నాజూకైన కప్పు హుజూర్ జన్మలో చూడలేదు.

'బాబుకు చెప్పావా?'

'స్నానం చేస్తున్నారు'

పనిమనిషి వెళ్లిపోయింది. ఆమె కాఫీ తాగడం మాని హటాత్తుగా ఏడ్వడం మొదలు పెట్టింది. హుజూర్ కంగారు పడ్డాడు.

'స్వామీ... మీరే ఎలాగైనా కాపాడాలి. ఇప్పటికి తిరగని గుడిలేదు. మొక్కని దర్గా లేదు. ఏం ఫలితం లేకపోయింది. మీ దర్గా చాలా పవర్‌ఫుల్ అని చాలామంది చెప్పారు. కనుక వచ్చాను. మీరు కలిశారు. మీలాంటి వాళ్లే మాలాంటి వాళ్లను ఆదుకోవాలి. మీరు లేకుంటే మేమేమైపోవాలి' అంది.

హుజూర్ నిటారుగా కూచున్నాడు. ముక్కు మెరిసింది.

'అమ్మా... ఏం బాధపడకండి. నేను వచ్చాను కదా' అన్నాడు.

'అదే నా ధైర్యం కూడా' అందామె.

'బాబుని పిలిపించండి. నేను చూస్తాను' అన్నాడు హుజూర్.

మరికాసేపటికి బాబు వచ్చాడు. హుజూర్ నోరెళ్లబెట్టాడు. బాబంటే చిన్నబాబు కాదు. పెద్దబాబు. ఆమె కుమారుడు. గుర్రం నడిపే జాకీలాగా ఉన్నాడు. షార్ట్స్. టీ షర్ట్. అతి పలుచగా ఉన్నాడు. గడ్డం గీసుకోలేదు. తలస్నానం చేసి తడి జుట్టు మీదే తల దువ్వుకున్నాడు. పెదాలు నల్లగా ఉన్నాయి. కళ్ల కింద చాలా నల్లగా ఉంది. మారిన మనుషుల్లో ఉండే వినయంలాంటిది అతడిలో వుంది. రావడం రావడమే హుజూర్ కాళ్లకు నమస్కరించాడు. హుజూర్ కంగారు పడి లేవనెత్తడానికి భుజాలు పట్టుకున్నాడు. అవి భుజాలు కావు. విరగడానికి సిద్ధంగా ఉన్న పూచిక పుల్లలు. వదిలేశాడు. నలభై అయిదు కేజీలైనా ఉంటాడా?

'కూచో' అందామె.

కూచున్నాడు.

తల్లినీ, హుజూర్‌ని మార్చి మార్చి చూసి– జంకుగా– 'శేకర్ లేదు కదా' అన్నాడు.

'ఆ... లేదులే' ఆమె నిరసనగా ఉంది.

ఆ వెంటనే మళ్లీ ఏడ్వడం మొదలుపెట్టింది. బాబు అది చూడలేనన్నట్టుగా తల ఒంచుకున్నాడు. ఆమె నిజంగానే గిలగిల్లాడుతూ ఉంది.

'చూశారా స్వామీ మా ప్రారబ్దం. ఒక్కగానొక్క కొడుకు. అల్లారుముద్దుగా పెంచాం. లేనిదేమిటి? కావాలంటే దొరకన్ది ఏమిటి? కోరింది ఇచ్చాం. ఆడించినట్టు ఆడాం. వాడే లోకంగా బతికాం. పిల్లలన్నాక ఏవో అలవాట్లు ఉంటాయి. మావాడు బంగారం అనుకున్నా వాళ్లూ వీళ్లూ కలిసి ముంచుతారు. పాడలవాట్లు. వాటికి ఇలా అయిపోయాడు. మా బంగారుతండ్రి నాశనమై పోయాడు....'

హుజూర్‌కి గంట గణాగణా మోగింది.

ఏదో ప్రాణాంతకమైన వ్యాధి. వీణ్ణి దేవుడు కూడా కాపాడలేడు.

ఆమె హుజూర్ వైపు చూసింది. బాబుని నఖశిఖపర్యంతం గమనిస్తున్న హుజూర్ కళ్లను చూసి కంగారుపడింది.

'అయ్యో... అలాంటిదేమీ లేదు స్వామీ. చాలా ఆరోగ్యంగా ఉన్నాడు. కాకపోతే కోలుకోవడానికి ఇంకాస్త టైమ్ పడుతుంది. అంతే'

కుమారుడు జోక్యం చేసుకున్నాడు.

'మమ్మీ. స్వామిని కన్‌ఫ్యూజ్ చేయకు. ఉన్నది ఉన్నట్టు చెప్పు' అన్నాడు.

ఆమె ఊరికే ఉంది.

అతడే అందుకున్నాడు.

'స్వామీ... మీతో దాపరికం ఏముంది. డ్రగ్స్. చాలా కాలం నుంచి అలవాటు ఉంది. ఫన్... ఫన్... అనుకుంటూ దాన్లో కూరుకుపోయాను. పెళ్లయితే మారతానని వీళ్లు బలవంతంగా పెళ్లి చేశారు. కాపురం సాగిందికాని అలవాటు మానలేదు. ఒక కొడుకు పుట్టేంత వరకూ బాగానే ఉంది. అయితే ఇప్పుడే'... గొంతు పూడుకు పోయింది.

కుర్చీచేతుల మీద బలహీనంగా చేతులు బిగించాడు.

ఒక మగవాడు ఇలా రిక్తహస్తాలతో నిలబడే క్షణాలు పగవాడికి కూడా వద్దు.

ఆమె ఏడుస్తూనే ఉంది.

బాబు కళ్లల్లో నుంచి నీళ్లు రాలి ఒడిలో పడ్డాయి. తల ఎత్తి, హుజూర్ వైపు దుఃఖంతో చూసి, కళ్లు తుడుచుకున్నాడు.

'వీడింక పనికి రాడు స్వామీ. దానికి పనికి రాడు. శాశ్వతంగా పనికి రాడు' చెప్పి, ఆమె మళ్లీ ఏడవడం మొదలుపెట్టింది.

'పెద్ద పెద్ద డాక్టర్లకు చూపించాం. ముంబై తీసుకెళ్లాం. అమెరికాకు కూడా పంపాలనుకున్నాం. లాభం లేదు. ఎవరుమాత్రం చేయగలిగింది ఏముంది? అంతా అయిపోయింది. ఏం చేసినా లాభం లేదట. మందులతో సర్జరీలతో కుదరదట. సహజమైన శక్తంతా పోయింది. వీడు అలవాటు మొత్తంగా మానలేదు. ఒకవేళ మానినా ఎన్ని జన్మలకో... అదేమైనా జరగొచ్చేమోనని... అది కూడా చిన్న ఆశ... అంతే'....

హుజూర్ చాలా నిశ్శబ్దం అయిపోయాడు.

కొడుకును చూడటం లేదు.

తల్లినే చూస్తూ ఉన్నాడు.

పనిమనిషి ఒక పాలిథిన్ కవర్ తెచ్చి అక్కడున్న టీపాయ్ మీద పెట్టి వెళ్లిపోయింది. దాని నిండా నోట్లు కనపడుతున్నాయి.

'తీసుకోండి స్వామి. మీకెంత కావాలో తీసుకోండి. ఏ మంత్రం వేస్తారో వేయండి. ఏ తంత్రం కడతారో కట్టండి. నా తండ్రి మళ్లీ మామూలు వాడవ్వాలి. నా బాబు మళ్లీ మామూలు మగాడై రాజాలాగా బతకాలి. నా బంగారం జీవితాంతం ఏ ఆడదాని ముందూ తల దించుకోకుండా బతికే వరం నాకు ప్రసాదించాలి. అందుకు మీరు ఏం చేయమన్నా సరే. ఎంత ఖర్చయినా సరే'....

హుజూర్ లేచి నిలబడ్డాడు.

వాళ్లు కూడా లేవబోయారు. వద్దని వారించి అటూ ఇటూ పచార్లు చేశాడు.

ఈ మధ్య హీరోతో అయిన అనుభవం గుర్తుకొచ్చింది. ఇలాంటివి వెంటనే నో అని చెప్పకూడదు. హీరో గదిలో పెట్టి తాళం వేశాడు. వీళ్లు కుక్కను వదిలినా ఆశ్చర్యం లేదు. ఆ కుక్క గుర్తుకొచ్చింది. అది కుక్క కాదు. చిన్నసైజు అపార్ట్‌మెంట్. అలాగే నిలబడి, తల ఎత్తి, ఇంటి వైపు చూశాడు. గతుక్కుమన్నాడు. ఛాయ సరిగ్గా లేదు. నీడ ఆడుతోంది పైన. తొందరగా ముగించుకొని తొందరగా బయటపడాలి.

'అమ్మా. ఇది కొంచెం జటిలం. మంత్రశాస్త్రం తిరగేసి చెప్తాను'

వాళ్లిద్దరూ పూర్తిగా నిరాశపడి చూశారు.

'అంత నిరాశపడాల్సిన పని లేదు. ఏడు పొరల కింద దాగిన దెయ్యాన్ని కూడా వదలగొట్టినవాణ్ణి. నా మాట నమ్మండి. మాట చెప్తే పని అయిపోయేలా ఉండటం నా పద్ధతి. మిమ్మల్ని ఆశ పెట్టడం మంచిది కాదు. శాస్త్రం తిరగేశానంటే దారి కనపడు తుంది. ఒక రోజు ముందూ వెనుకా అయినా ఎన్నిరోజుల్లో పని జరుగుతుందో

చెప్పానంటే పొల్లుపోకుండా అన్ని రోజుల్లో మీకు ఫలితం చూపెడతాను. నాదీ సవాల్'

దగ్గరగా వచ్చి మళ్లీ కూర్చుని బాబు భుజం మీద ఓదార్పుగా చేయి వేశాడు.

'బాబూ. దవా దువా అంటాం మేము. అంటే మందూ పడాలి... దేవుడూ కరుణించాలి. కొండని ఇసుకలా చేసేవాడూ పుల్లను పర్వతంగా మార్చేవాడు అంతా ఆ పైవాడే. వాడు తలుచుకుంటే ఎంత. మీలాంటి బాబుగార్లు గంటకొొకదాన్ని తెచ్చుకొని నిమిషానికి ఒకదాని పొగరు అణచగలరు. నాకు తెలుసు. మనకు మంచిరోజులు వస్తాయి. మీరు ధైర్యంగా ఉండండి'

ఆ మాట అన్నాక హుజూర్ గుండెల్లో ఎందుకనో దుఃఖం పొంగుకు వచ్చింది.

ఆ కొద్దిపాటి మాటకే బాబు ప్రాణం వచ్చినవాడిలా వెలుగుతున్నాడు.

తల్లి సంశయంగా చూస్తూ ఉంది ఏదో చెప్పాలి అన్నట్టుగా.

'చెప్పండమ్మా... ఏం పర్లేదు చెప్పండి'

'మీరు ఇంకో పని కూడా చేయాలి స్వామి'

'ఏం పని?'

తటపటాయించింది. బాబు లేచి, ఇది వినలేను అన్నట్టుగా కదిలి, నేను వెళుతున్నాను అని చెప్పి అక్కణ్ణుంచి వెళ్లిపోయాడు. అది చూసి మళ్లీ ఆమె ఏడ్చింది.

'మీరు ఆ ముండ పొగరు అణచాలి' అంది.

హుజూర్‌కు అర్థమైంది.

'ఎవర్ది?' అన్నాడు.

'ఇంకెవర్ది. నా కోడలిది. ఇలాంటివి మీకు కాక ఇంకెవరికి చెప్పుకుంటాం. మీకు చెప్పుకుంటే దేవుడితో చెప్పుకున్నట్టే. చూశారుగా ఆ టెక్కు ఆ నిక్కు. నా కొడుకు చేతగాని వాడయ్యాడని ఒకణ్ణి తగులుకుంది. వాడితోనే కులుకుతోంది. అయ్యో... దేవుడా నా కళ్ల ముందే... నా కొడుకు కళ్ల ముందే.... ఎవరొచ్చి ఏం చేస్తారో చూస్తాను అన్నట్టు తిరుగుతోంది... ఎవరొచ్చి ఏం చేయగలరు? ఏదైనా అంటే నా కొడుకు సంగతి ఊరంతా పోస్టర్లు వేస్తానంటోంది. ఏదో ఒక చానల్‌లో లైవ్‌లో కూర్చుంటానంటోంది. ఇది కాకుండా నా మనవడున్నాడు. మా వారసుడు. వాణ్ణి తీసుకొని వెళ్లిపోతానంటోంది. తను ఏమైనా చేయగలదు. మా చేతులే కట్టేసి ఉన్నాయి. ఖర్మ. దేవుడా... ఇదంతా ఏమిటయ్యా'... నెత్తి బాదుకుంది.

హుజూర్ చలించలేదు. చూస్తూ ఉన్నాడు.

ఆమె పంతంగా అంది.

'మీరు నా కొడిక్కి మగతనం తేకపోయినా పర్వాలేదు. వాళ్లను మాత్రం విడ గొట్టాలి. నా కోడలితో సంబంధం పెట్టుకున్నవాడు నెత్తురు కక్కుకొని చావాలి'

హుజూర్ లేచి ఆమె శాంతించేంత వరకూ మళ్లీ పచార్లు చేశాడు.

ఆమె శాంతించినా మధ్య మధ్య బెక్కుతూనే ఉంది.

హుజూర్ వచ్చి కూచుని– 'అమ్మా. ఈ పని నేను చేయలేను' అన్నాడు.

ఆమె తల ఎత్తి చూసింది.

'ఏం?'

'ఏం అంటే మీ కోడలి నెత్తి మీద సర్పం ఆడుతోంది. మీ బాబు మంచివాడయ్యి మళ్లీ మూలిక తగిలిస్తేనే ఆ సర్పం పడగ దించుతుంది. అందాక నడుమ ఎవరు వెళ్లినా కాటేస్తుంది. ఇది తథ్యం' అన్నాడు.

ఆమె దడుచుకుంది.

హుజూర్ లేచి, తెరిచే అవసరమే రాని తన బ్యాగ్ తీసుకొని నిలబడ్డాడు.

'అమ్మా. ఫోన్ చేస్తాను. ఏ సంగతీ చెబుతాను. మీరు చెప్పిన వెంటనే రెక్కలు కట్టుకొని వాలిపోతాను. నేను అడుగు పెట్టిన ఇల్లు ఇది. నా పాదం వృథాపోదు. ఇక అంతా శుభమే. నా మాట నమ్మండి' అన్నాడు.

పెద్దావిడ చీకూ చింతా అంతా పోయినట్టుగా తెరిపినపడి నవ్వింది.

'మీరు నవ్వారు. అంతే చాలు. సలామ్' వెను తిరిగాడు.

'స్వామీ'

తిరిగాడు.

'ఖర్చులకు... మీకు కావలసింది తీసుకెళ్లండి'... పాలిథిన్ కవర్ చూపించింది.

హుజూర్ తల అడ్డం ఆడించాడు.

'పని జరగకుండా పైకం ముట్టుకోకూడదని ఆన. మంత్రం పని చెయ్యదు. మీ పని చేశాక ఎంత కావాలంటే అంత తీసుకుంటాను' అన్నాడు.

ఇంటి ముందుకు వచ్చి లాన్ నుంచి మెయిన్ గేట్ వైపు నడుస్తున్నాడు. లాన్‌లో కేన్‌బెడ్ మీద కుక్క అలాగే కూచుని అలాగే చూస్తూ ఉంది. హుజూర్‌కు తెలుసు. మళ్లీ జన్మలో ఈ ఇంటికి రాడు. వీళ్లకి కనపడడు. వీళ్ల ఫోన్ ఎత్తడు.

గార్డ్‌రూమ్‌లో ఉన్న శిష్యుణ్ణి తీసుకొని బయటకు వస్తూ ఆగి, గార్డ్‌ని అడిగాడు.

'శేకర్ అంటే ఎవరు యజమాన్?'

'ఏయ్. శేకర్‌గారు అను. ఆయన ఈ ఇంటి డ్రైవరు'

హుజూర్ తల పంకించి, ముందుకు నడుస్తూ, బ్యాగ్ శిష్యుడికి అందించాడు.

'ఏం హుజూర్?' అన్నాడు శిష్యుడు.

'బేకార్‌రా' అన్నాడు హుజూర్.

రోడ్డు మీద ఆగి, ఆ ఇంటి వైపు చూసి గతుక్కుమన్నాడు. నీడ ఆడుతోంది. శిష్యుడు గమనించాడు.

'ఏం హుజూర్?'

'ఒక చావు తప్పదురా'

మళ్లీ ఆ ఇంటివైపే చూస్తూ అన్నాడు.

'ఇప్పుడు ఉన్నది ఉన్నట్టు నడిస్తే సరే. ఏ ఇటుక ఎటు కదిలినా ఒక చావు తప్పదు. ఏమో ఎటు కదలకపోయినా చావు తప్పదేమో. నయం నడుమ మనం పోలేదు. ఆ సర్పం ఎలాంటిదంటే అది నిన్నూ నన్నూ కూడా వదలదు. నాలాంటి వాడు అడ్డం వచ్చి మంత్రం గింత్రం చేస్తున్నాడని తెలిసిందనుకో. చంపేస్తారు. లక్షలెందుకు... పదివేలు చాలదా... నన్నేసేయడానికి... పెద్దోళ్లు' అన్నాడు.

శిష్యుడు గురువుతో పాటు నడుస్తున్నాడు.

ఎందుకో వెనక్కు తిరిగి చూశాడు.

కొంచెం నిరాశపడ్డాడు.

'ఇంత ఆస్తున్నోళ్లు. ఒక మూడు నాలుగు పిడికిళ్లయినా లాగతావనుకున్నాను'...

హుజూర్ నవ్వాడు.

'నీ మొహం ఆస్తి. ఈ ఇంటిగల్లోళ్లు ఈ ఇంటి అబ్బాయికి ఇవ్వాల్సిన ఆస్తిని ఇవ్వ లేదు. ఇచ్చిన ఆస్తిని వాడు నిలబెట్టుకోలేదు. పైగా బికారిలా మారి మన ముందు జోలె చాస్తున్నాడు. ఇలాంటి వాళ్ల సొమ్ము తిన్నామంటే ఇంకేం లేదు. పెళ్లానికి పనికి రాకుండా పోతాం. పదా' అన్నాడు.

ఆ తర్వాత– 'అరటి పండు తింటావా?' అన్నాడు బ్యాగ్ అందుకొని జిప్ తెరుస్తూ.

గురుశిష్యులు ఆ ఫలాలు తింటూ రోడ్డుకు ఒకవైపుగా జరిగి ఆటో కోసం నిలబడ్డారు.

మే 8, 2013

# ఘటన

హాస్పిటల్‌కు చేరుకొని, ఆమె లోపలికి అడుగుపెట్టే సమయానికి, ఆ కుర్రాడు రిసెప్షన్ దగ్గర నిలబడి ఏదో హడావుడిగా మాట్లాడుతూ ఉన్నాడు.

చూసింది.

విసవిసా నడుచుకుంటూ వెళ్లి 'నువ్వేనా?' అని అడిగింది.

ఆ కుర్రాడు అవును అన్నట్టు తల ఊపి– ఆ మాట నోటితో చెప్పే లోపు– ఫాట్... ఫాట్... ఫాట్.... చెంప మీద మూడు దెబ్బలు పడ్డాయి.

ఆ కుర్రాడు తబ్బిబ్బయ్యి అదిరిపోయి 'మామ్... మామ్... మామ్' అన్నాడు చేతులు అడ్డు పెట్టుకుంటూ.

'చూసుకొని నడపలేవురా బాస్టర్డ్'... ఇంగ్లిష్‌లో తిట్టింది.

'నా తప్పేమీ లేదండీ' అన్నాడతను ఇంగ్లిష్‌లో.

ఆమె ఎగిసెగిసి పడుతోంది. కోపంగా దౌర్జన్యంగా ఉంది. కౌంటర్‌లో ఉన్న ఇద్దరు ఉద్యోగులూ అది గమనించి సర్ది చెప్పాలా వద్దా అన్నట్టు జంకుగా చూస్తూ ఉన్నారు. కుర్చీలన్నీ ఎత్తేసి– పేషెంట్ల అటెండర్లందరినీ తరిమేశాక కూడా– ఏదో ఒకటి చేసి ఖాళీ నేల మీద ముడుచుకుని పడుకొని ఉన్న ఒకరిద్దరు ఈమె దాడికి లేచి, నిద్రకళ్లతో

చూసి, మళ్లీ మోచేతుల మీద తలలు పెట్టుకొని కళ్లు మూసుకున్నారు.

పగటి పూట అయితే అక్కడ ఎందరు ఎంత పెద్దగా అరిచినా ఎవరికీ వినపడదు. అంత రద్దీ.

ఇప్పుడు అర్ధరాత్రి. ఆ మాటకొస్తే అర్ధరాత్రి కూడా దాటి చాలా సేపయ్యింది. బయట ఏ అలికిడీ లేదు. లోపల రీసౌండ్.

'ఎక్కడా?' అంది కుర్రాడి వైపు చూస్తూ.

'ఎమర్జెన్సీ' అన్నాడు.

శివంగిలా తల అటూ ఇటూ తిప్పి చూసింది. ఎమర్జన్సీ మార్క్ ఉన్న స్వింగ్‌డోర్‌ను తెరుస్తూ, నడకలోనే చెప్పులను జార విడుస్తూ, లోపలకు వెళ్లింది. అక్కడ ఖాళీ బెడ్ ఉంది. పక్కన ఇద్దరు ముసలివాళ్లు నిలుచుని ఉన్నారు. ఒక ముసలతను ఈమె రాకకై ఎదురు చూస్తున్నట్టుగా ఉండి, ఈమె రావడంతోటే హడలిపోయాడు.

'ఉన్నారా... యూ డ్రంకన్ బాస్టర్డ్స్.... ఏం ఫ్యామిలీరా మీది... ఎన్నిసార్లిలా... ఎందుకురా నన్నిలా హింసిస్తారు... ఏం పాపం చేశాను.... నన్ను వదిలిపెట్టు మొర్రో అంటే వినడు బాస్టర్డ్'....

ఆ ముసలతను చాలా వర్రీగా పక్కనున్న ముసలతని వైపు సాయానికి చూశాడు.

ఆ ముసలతను ఆమె అంత తీవ్రంగా ఉంటుందని ఊహించలేదులాగుంది హడలి పోయి చూస్తున్నాడు.

'ఎక్కడా?' మళ్లీ గర్జించింది.

'సి.. సిటి స్కాన్‌కు తీసుకెళ్లారు... ఇప్పుడే' ముసలతను గొణిగాడు.

ఆమె ఎందుకనో హటాత్తుగా– ఒక్కసారిగా– బెడ్ కొసన కూలబడి బిగ్గరగా దుఃఖంగా గస పెట్టింది. ఎమర్జన్సీలో ఉన్న డ్యూటీ డాక్టర్ అది గమనించి ఆమెవైపు కాకుండా ఇబ్బందిగా ఇతర బెడ్స్ వైపు చూస్తూ ఉన్నాడు. ఏడెనిమిది బెడ్స్. అన్నింటి మీదా పాలిథిన్ కర్టెన్స్ చాటున ముక్కులకూ మూతులకూ ట్యూబులు పెట్టుకొని.

'చు.. చూడమ్మా... భయం లేదనుకుంటాను... ఇందాకటి దాకా'...

'మాట్లాడొద్దు మీరు'.... ధడేలున లేచింది.

ముసలతను నోరు కట్టేసి పక్కనున్న ముసలతని మీద దాదాపుగా పడబోయాడు.

విసురుగా బయటకు వచ్చింది. ఆమెతో పాటు ఆ ఇద్దరు ముసలాళ్లు కూడా బయడకు వచ్చారు. ఆ కుర్రాడు ఇంకా అక్కడే నిలబడి ఉన్నాడు. మొత్తం నలుగురూ చదరంగంలోని బంట్ల వలె ఒకరికొకరు దూరాన్ని పాటిస్తూ నిలబడి ఉన్నారు.

కుర్రాడే ధైర్యం చేశాడు.

'బాగా తాగేసినట్టున్నారు మామ్. సడన్‌గా రోడ్డు మీదకొచ్చేశారు. అప్పటికీ చాలా గట్టిగా బ్రేక్ వేశాను. అంతలోనే'....

'ఇంతదాకా ఏ బార్ చచ్చింది?'...

'బార్ ఎప్పుడో కట్టేశారట మామ్. పార్కింగ్ లాట్‌లో పెట్టుకొని తాగారట. బహుశా డ్రైవ్ చేయలేక ఆటోలో వద్దామని రోడ్డు మీదకొచ్చినట్టున్నారు...'

'గట్టిగా గుద్దాల్సింది'...

కుర్రాడు గందరగోళంగా చూశాడు.

'ఆ టైమ్‌లో నీకేం పని?'

కుర్రాడు అయోమయంగా చూసి–

'ఇది బాగుంది' అన్నాడు.

ఆమె అటూ ఇటూ అంగలు వేసింది.

'కుడిచేతి మీద పడ్డారు మామ్. చేయి విరిగిపోయింది. మైల్డ్‌గా హెడ్ ఇంజురీ. హాస్పిటల్‌కు తెచ్చేదాకా నాతో మాట్లాడారు. వారి అన్నగారికి ఆయనే ఫోన్ చేసి రమ్మన్నారు. మొదట మీతో చెప్పొద్దన్నారు. చాలాసేపు డైలమాలో ఉండి మళ్లీ చెప్పమన్నారు'....

ఆమె టక్కున అంగలు ఆపింది.

సర్రున వెనక్కు తిరిగి టకాటకా ఆ ముసలతని దగ్గరికి వెళ్లి చూపుడువేలాడించింది.

'సీ... మిస్టర్ కేశవరావ్. నేను వెళుతున్నా. ఇంక వీడు నాకొద్దు. చస్తే సరేసరి. బతికి నా దగ్గరికొచ్చాడా కాళ్లు విరగ్గొడతాను. మీ తమ్ముణ్ణి మీరే తీసుకెళ్లండి. మీలాగే హోమ్‌లో పెట్టుకోండి. నేను పడలేను. ఐ యామ్ అట్టర్లీ ఫెడప్. గుడ్ బై'.... పెద్దగా అరిచి, టకాటకా బయటకు వెళ్లిపోయింది.

రిసెప్షన్‌లో తుఫాన్ వెలిసినట్టయ్యింది.

కాని– ఆ ముసలతను తుఫానులోనే ఉన్నట్టుగా కళవళపడిపోయాడు. ఎర్రగా, నెత్తురు పైకి తేలినట్టుగా ఉన్న అతడి ముఖం దుఃఖంతో కంగారుతో ఇంకా ఎర్రబడింది. పక్కనున్న ముసలతను ఈ వయసులో ఇంకా ఏమిటి ఈ తలనొప్పి అన్నట్టు చూస్తూ ఉన్నాడు.

కుర్రాడు బయటకు పరిగెత్తాడు ఆమెను అందుకోవడానికి.

బయటంతా గాలి.

అలాంటి వేళ– అంత గాఢమైన రాత్రిపూట మాత్రమే వీచే– చల్లగాలి.

నిజానికి సజ్జనులు దుర్జనులు కూడా తమ తమ ఆలోచనలు కట్టిపెట్టి ప్రశాంతంగా నిద్ర పోవాల్సిన వేళ అది. నిశీధి తన పనులేవో చక్కబెట్టుకోవాల్సిన సమయం. కాని ఒకోసారి ఆ సమయమే కొందరికి ప్రాణాంతక గడియ.

కుర్రాడు ఇంకా ముందుకొచ్చి చూశాడు.

మెయిన్ బ్లాక్‌కీ కాంపౌండ్ వాల్‌కీ మధ్య చాలా ఖాళీ స్థలం ఉంది. పార్కింగ్ కోసం వదలాల్సినంత వదిలి మిగిలిన చోటంతా లాన్ పెంచుతూ ఉన్నారు. మధ్యలో అక్కడక్కడా పుట్టగొడుగుల్లా మిల్క్‌ల్యాంప్స్ వెలుగుతూ ఉన్నాయి. వాటి వెలుతురు నెమ్మదిగా ఉంది.

కుర్రాడు నిలబడి అటూ ఇటూ చూశాడు.

కనిపించింది.

కాంపౌండ్ వాల్‌కు ఇవతలే నిలబడి మాతం ఆడుతున్నట్టు అంగలు వేస్తూ ఉంది.

బరువుగా ఉన్న మనిషి– ప్రతి కదలికలోనూ పరిణితి కనిపిస్తున్న మనిషి– భర్తకు యాక్సిడెంట్ అయ్యిందని తెలిశాక కూడా హడావుడిగా కాకుండా నాలుగైదు నిమిషాల్లో శుభ్రంగా తయారై వచ్చిన మనిషి– తేలిక రంగు చీర. అదే రంగు బ్లౌజ్. గ్లాస్ బ్యాంగిల్స్. కంఠానికి రెండించుల దిగువన సన్నటి డైమండ్ లాకెట్. తెల్లటి ఛాయ. యాభై ఉంటాయా?

కుర్రాడు ఎదురుగా నిలుచున్నాడు.

పెనుగులాడుతున్నట్టుగా చూసింది.

'ఆటోల్లేవ్... డ్రైవ్... చేయను... ఈ టైమ్‌లో డ్రైవర్... ఇందాకే కష్టమైంది'.... ముక్కలు ముక్కలుగా చెప్పింది.

'ఎక్కడ ఉంటారు?'

'స్ప్రింగ్ వ్యాలీ...'

'నేను డ్రాప్ చెయ్యనా?'

ఇష్టం లేనట్టుగా కనిపించింది.

'నేనేమీ ఫేవర్ చేయడం లేదు... మిమ్మల్ని వదిలిపెట్టి ఇంటికి వెళతాను'

'ఎక్కడ ఉంటావ్?'

'నా సంగతి వదిలిపెట్టండి'

కారు వైపు పరిగెత్తాడు.

ఆమె మళ్లీ అంగలు మొదలుపెట్టింది. వేళ్లల్లో వేళ్లు గుచ్చుతూ... విడుదల చేస్తూ... పిడికిళ్లు చుడుతూ.

కారు వచ్చింది.

వెనుక సీట్‌లో ఎక్కి కూచుంది.

కుర్రాడు చాలా భయభక్తులతో ఉన్నాడు. ఏసి ఆన్ చేశాడు. ఫ్రంట్ మిర్రర్‌లో గమనిస్తూ డ్రైవ్ చేస్తూ ఉన్నాడు.

ఆమె సీట్‌లో ఫర్మ్‌గా కూచుని ఉంది. వెనక్కు ఆనలేదు. ముందుకు కదలట్లేదు. బయటకు చూడటం లేదు. సంబంధం లేనట్టుగా ఉంది. కన్నులు ఇంతింత ఉన్నాయి. ఎర్రగా పేలిపోయేలా ఉన్నాయి. కుర్రాడు గమనిస్తూ ఉన్నాడు. ఆమె అలాగే ఉంది– వెనుకకు ఆనుకోకుండా. కుర్రాడు మరికాసేపు గమనించాడు. ధైర్యం చేశాడు.

'మామ్... ప్లీజ్... రిలాక్స్'...

మాట్లాడలేదు.

'మామ్... ప్లీజ్'....

పట్టించుకోలేదు.

'మామ్'...

'షటప్'....

'మామ్'...

'ఐ హేట్ మ్యాన్'.... అరిచింది.

కుర్రాడు ప్రిపేర్డ్‌గా ఉన్నాడు.

ఆమె మూలిగినట్టుగా చేసి తట్టుకోలేనట్టుగా సీటు మీద పిచ్చిగా బాదింది.

'మామ్ ప్లీజ్'....

'నాకు అసహ్యంరా' అరిచింది.

'నాకు అసహ్యం.... పారిపోయే వెధవలంటే అసహ్యం. మోయలేని భుజాలున్న వాళ్లంటే అసహ్యం. తట్టుకోలేర్రా కొంచెం కూడా? భరించలేర్రా కాస్తయినా? ఒక వెంచర్ ఫ్లాప్. అయిపోతుందా? ఒక యాంబిషన్ డెస్ట్రాయ్డ్. సో వాట్? సక్సెస్ రాదు. అయితే? ఎవడూ పట్టించుకోడు... ప్రేమించరు... లెక్కచేయరు... జబ్బు చేస్తుంది... అయితే? కొంప మునిగిపోతుందా? నిలబడలేవా నువ్వు? పోరాడవా? ఎదిరించవా?'....

మళ్లీ బాదింది.

కుర్రాడు జాగ్రత్తగా గమనిస్తున్నాడు.

'స్ట్రగుల్ ఇట్‌సెల్ఫ్ ఈజ్ ఏ జాయ్ మ్యాన్. అండ్ వియ్ ఆర్ మెంట్ ఫర్ ఇట్. సర్టన్లీ వియ్ ఆర్ మెంట్ ఫర్ ఇట్'.....

రొప్పుతూ ఉంది. కనుగుడ్లు ఇంకాస్త పెద్దవయ్యాయి. పెదాలు కొసదాకా సాగాయి.

ఆగి ఆగి అంది.

'ఇలాంటివాళ్లు... ఇలాంటి బాస్టర్డ్స్.... దె వీకెన్ దెమ్‌జెల్వ్స్. దె వీకెన్ అదర్స్. దె వీకెన్ ది బ్లడీ హోల్ ప్లానెట్'....

కుర్రాడు నడుపుతూ ఉన్నాడు.

ఆమె ముఖం మీద వేళ్లు తిప్పుకుంది. బరువుగా ఉన్న వక్షం మీద బలహీనంగా పవిట సరి చేసుకుంది. ఓడిపోతున్నట్టుగా కొనప్రాణంతో ఉన్నట్టుగా ఉంది.

'లాభం లేదు. వీడు నన్ను చంపేస్తాడు. చాలా హార్డ్‌గా ట్రై చేస్తున్నాను బతకడానికి. కాని వీడిలాగే బిహేవ్ చేస్తే....' అరచేతి కండని పళ్ల మధ్య పెట్టుకొని గట్టిగా కొరుక్కుంది.

కుర్రాడు చల్లగా అయిపోయాడు. కాని కిక్కురుమనకుండా ఉన్నాడు. కొంచెం కూడా శబ్దం చేయకుండా.

మెల్లగా ఏసి ఆఫ్ చేసి విండోస్ తేలిగ్గా ప్రెస్ చేశాడు.

లోపలికి గాలి దూరింది. అదే గాలి.

ఇలాంటి వేళ, ఇలాంటి గాఢమైన రాత్రిపూట మాత్రమే వీచే చల్లగాలి.

కారు రామానాయుడు డౌన్ దిగి గచ్చిబౌలీ అందుకుంది. కుర్రాడు ఫ్రంట్ మిర్రర్‌లో నుంచి చూస్తూ ఉన్నాడు. ఆమె అలాగే కూచుని ఉంది. కొంచెం కూడా మార్పు లేకుండా. సూది మొనంత కూడా.

'ఎవరి పిల్లాడివి?'

'విసిగారి అబ్బాయినండీ'

ఎగాదిగా చూసింది. నిజానికి మొదటిసారి చూసింది.

డీప్ మెరూన్ టీషర్ట్. లైట్ కలర్ ట్రౌజర్స్. పలుచగా ఉన్నాడు.

'ఏ యూనివర్సిటీ?'

చెప్పాడు.

కారు చౌరస్తా దాటింది. దూరంగా బయోడైవర్సిటీ పైలాన్ చీకట్లో మునిగిపోయి అలా వెనక్కు జారిపోయింది.

'ఎంతసేపూ'

'వచ్చేశాం'

'తొందరగా...'

కుర్రాడు సర్దుకొని మళ్లీ ఫ్రంట్ మిర్రర్‌లో నుంచి జాగ్రత్తగా గమనించాడు. ఆమె అలాగే కూచుని ఉంది. పట్టుదలగా. వీపు ఆనకుండా. ఇల్లు చేరే తొందరలో ఉంది. తొందరగా ఇల్లు చేరి?

కుర్రాడు గట్టిగా స్టీరింగ్ పట్టుకున్నాడు.

చీకటి వెలితిగా ఉంది. దారులు బోసిగా ఉన్నాయి. అపార్ట్‌మెంట్లు. కళాకాంతీ లేని డ్యూప్లేలు. బయట కార్లు పార్క్ చేసి లైట్లన్నీ ఆఫ్ చేసుకొని నల్లగా ముసుగేసుకున్న భవంతులు.

'ఇదే'... ఒకచోట ఆపింది.

కుర్రాడు ఆపుతున్నాడో లేదో  డోర్ తెరుచుకుని దిగింది.

దిగి, వెనక్కి కూడా చూడకుండా బ్యాగులోని తాళాలను వేగంగా వెతుక్కుంటూ లోపలికి పోయింది.

కుర్రాడు చూస్తున్నాడు.

చట చట చట....

తాళం రావడం లేదు....

చూస్తున్నాడు.

చట చట చట....

వేళ్లల్లో కుదురు లేదు.

గమనిస్తున్నాడు. దేనికో తొందరపడుతున్నట్టుగా ఉంది. దేనికి?

చట చట చట...

కుర్రాడు చటుక్కున కదిలి, హారన్ మీద దబ్బున బాది, డోర్ తీసుకొని దిగాడు.

అప్పటికే అతడి సంగతి మర్చిపోయింది. హారన్ సౌండ్‌కు ఉలిక్కిపడింది.

'వాట్?'

'మీరిలా చేయకుండా ఉండాల్సింది'

‘ఎలా?’

‘మీ హజ్బెండ్‌ని వదిలి రాకుండా ఉండాల్సింది’

ఎలా చూసిందంటే నమిలి మింగేయలేదు అంతే.

‘గెట్‌లాస్ట్’...

చట చట చట...

కుర్రాడు రెండడుగులు ముందుకేశాడు.

‘నాకేం సంబంధం మామ్? తొక్కేసి పోకుండా హాస్పిటల్‌కు తెచ్చాను. మీరు వైఫ్’

‘గెట్‌లాస్ట్’

‘అది కాదు మామ్’

‘వెళ్లా బాస్టర్డ్’...

కుర్రాడు ఎదురు తిరిగాడు.

‘మర్యాదగా మాట్లాడలేరా మీరు? మనుషులకు విలువివ్వరా? నా సంగతి సరే. మీ హజ్బెండ్‌కు కూడా విలువివ్వరా?’ పెద్దగా అరిచాడు.

ఆమె కుర్రాణ్ణే చూసి ధన్ ధన్ ధన్ అడుగులు ముందుకేసింది.

‘వాడు నా మేనత్త కొడుకు. చిన్నప్పటి నుంచి ఫ్రెండ్. నా క్లాస్‌మేట్. లవర్. నాకు పట్టిన దరిద్రం’

‘సరే... సపోర్ట్ చేయరా మీరు? మారొచ్చుగా మనుషులు. కనీసం అలా అని నమ్మలేరా మీరు?’

ఆమెకు ఆ కుర్రాణ్ణి చంపేయాలనిపించింది.

కాని నిస్సహాయంగా రొప్పుతూ గసపెడుతూ చూసింది.

‘వెళ్లా ఇక్కణ్ణుంచి... ప్లీజ్’...

కుర్రాడు ఆగాడు.

‘సరే. ఏమైనా ఇది మీ పర్సనల్ ఇష్యూ. కాని చాలా అలసిపోయాను. భోజనం కూడా చేయలేదు. మల్టీప్లెక్స్ నుంచి వెళుతూ దీన్లో ఇరుక్కున్నాను. కొంచెం నీళ్లు ఇవ్వండి. కాఫీ ఇస్తే సంతోషం. వెళ్లిపోతాను’

ఆమె కుర్రాణ్ణే చూసింది. ఈ ఒకటి రెండు గంటలకే నలిగినట్టుగా కనిపిస్తున్నాడు. తల ఊపింది.

ఈసారి ఇబ్బంది లేకుండా తాళం వచ్చింది. పెద్ద ఇల్లు. లైటు వేస్తే తప్ప దాని ఐశ్వర్యం తెలీలేదు. ఆమె  ఏం మాట్లాడకుండా ఫ్రిజ్‌లో నుంచి బాటిల్ అందించి కిచెన్‌లోకి వెళ్లింది. కుర్రాడు దిక్కులు చూశాడు.  ఆమెకు ఒక కూతురు ఉన్నట్టు ఆ కూతురు ఈ దేశంలో లేనట్టు గోడ మీద ఆనవాలు కనిపించింది.

కుర్రాడు సోఫాలో కూచున్నాడు.

కిచెన్‌లో కదలికలు కనిపిస్తున్నాయి. ఉండి ఉండి ఆమె గొంతు గురగుర లాడుతోంది.

బయటకు వచ్చింది.

కాఫీ ఇచ్చి, తొందరగా కానిచ్చిపో అన్నట్టు ఎదురుగా నిలబడింది.

కుర్రాడు ఆమెనే చూస్తూ గుక్కా గుక్కా తాగుతున్నాడు.

ఆమె అతణ్ణే చూస్తూ ఉంది.

ఇది ఆ కుర్రాడి జీవితంలో ఉత్పాత సమయం. దానిని దాటి ఆమెను స్థిమిత పరచడానికి పెనుగులాడుతూ ఉన్నాడు.

మూడు నాలుగు గుక్కల తర్వాత ఏమైతే అదవుతుందని అన్నాడు.

'మామ్... ప్లీజ్... ఒక్కసారి నా మాట వినండి. ఇప్పుడు మీ అవసరం అక్కడ ఉంది. ఎంతలేదన్నా ఆరేడు రోజులు మీ హజ్బెండ్ హాస్పిటల్లో ఉండాలి. ఆ ముసలాయన వల్ల అవదు. మీ హజ్బెండ్‌కొచ్చిన ప్రమాదం ఏమీ లేదు. కాని మీ సంగతే నాకు వర్రీగా ఉంది. నేను ఇంటికెళ్లి నిద్రపోలేను... మీరు కూల్ అయ్యేంత వరకు'....

కుర్రాడు దయగా ఆమెవైపే చూశాడు. ఆమె కుర్రాడి వైపే చూసింది. ఒక మనిషి ఇంకో మనిషిని ఎప్పుడు తాకుతాడో.

ఎందుకనో ఆమెకు ఒక్కసారిగా గుండెలు బాదుకొని ఏడ్వాలనిపించింది. కుమిలి కుమిలి ఏడ్వాలనిపించింది. మనసులో ఉన్నదంతా దిగిపోయేదాక పొర్లిపొర్లి ఏడ్వాలనిపించింది. కుప్పగా కూలిపోయి... ముక్కలుగా తెగిపోయి...

'మ్మ్'.... మూలిగింది.

కుర్రాడు చటుక్కున ఆమె దగ్గరికొచ్చి పట్టుకున్నాడు. పెనుగులాడుతూ ఉంది. వైద్యుడు రోగిని పట్టుకున్నట్టు పట్టుక్నునాడు. పెనుగులాడుతూ ఉంది. పురుషుడు స్త్రీని పట్టుకున్నట్టు.

ఆ తర్వాత వాళ్లు ఇంటి నుంచి బయట పడటానికి మరికొంత సమయం పట్టింది.

ఆమె ఒక బాస్కెట్‌లో హాస్పిటల్‌కు అవసరమయ్యే వస్తువులన్నీ పెట్టుకొని, తలుపు లాక్ చేసుకొని, మెల్లగా వచ్చి, ఫ్రంట్‌డోర్ తెరుచుకుని కారు ఎక్కింది.

కుర్రాడు స్టార్ట్ చేశాడు.

కారు కదిలింది.

తేలిగ్గా విండోస్ దించాడు. గాలి వీస్తూ ఉంది.

అదేగాలి. మరి కాసేపులో ప్రభాతం వస్తుందనగా వీచే చల్లగాలి.

ఆమె ప్రశాంతంగా కూచుంది. వెనక్కు వాలి. సీట్‌లో విశ్రాంతిగా చేరగిలపడి. గాలి లోపలకు దూరి చక్కర్లు కొడుతూ ఉంది. ఆమె ఆ చల్లగాలిని హాయిగా ఆస్వాదిస్తూ ఉంది. అప్పుడప్పుడు రెప్పలు మూస్తూ ఆ రెప్పలకు ఆ గాలిని పులుముకుంటూ. పూర్తిగా నెమ్మదించిన ప్రవాహంలా ఉంది.

హాస్పిటల్ వచ్చింది.

దిగింది.

కుర్రాడు చూశాడు.

'బై మామ్'

'మళ్లీ నాకు కనిపించకూడదు'

కుర్రాడు వెళ్లిపోయాడు.

ఆమె మెల్లగా అడుగులు వేస్తూ రిసెప్షన్‌లోకి వచ్చింది. ముసలాళ్లు అక్కడే ఉన్నారు. ఆ ముసలాయన తగాదాకు శక్తి లేనట్టుగా జంకుగా చూశాడు.

'చు..చూడమ్మా... ఏవో జరుగుతుంటాయి'....

'ఊ..ఊ.. ఇంకా ఎందుకున్నారు. మీరెళ్లండి. నేను చూసుకుంటాను'

ముసలాయన మహాభాగ్యం అన్నట్టు చూశాడు. ఉత్సాహం వచ్చింది.

'ప్రమాదం ఏమీ లేదటలే. ఐసియు ఏమీ అక్కర్లేదన్నారు. ఎమర్జెన్సీలోనే ఉంచారు'

లోపలికి వెళ్లింది. నొప్పితో కొంచెం కొంచెం మూలుగుతూ ఉన్నాడు.

పక్కన కుర్చీలో కూచుంది.

ఆమె రాక అతడికి అర్థమైంది.

'బుజ్జీ' అన్నాడు.

పలకలేదు.

‘బుజ్జిదానా’

మాట్లాడలేదు.

‘సేయ్... బుజ్జమ్మా...’

‘బుజ్జిముండా’...

‘ఇంక నోర్మూయ్’

కసిరింది

ఆ తర్వాత దగ్గరగా జరిగి, ఫ్లూయిడ్స్ ఎక్కిస్తున్న చేతిని, జాగ్రత్తగా పట్టుకొని కూచుంది.

మార్చి 12, 2013

# టాక్ టైమ్

దూరంగా ఆమె రావటాన్ని చూసి, బంకులో ఉన్న కుర్రాడు, తన ఎదురుగా ఉన్న నాలుగైదు సెల్‌ఫోన్లలో ఒక దానిని తీసుకొని టకటకా ఏదో నొక్కాడు.

ఆమె– ఎండకి నుదురు మీద చేయి అడ్డు పెట్టుకొని వస్తుండడాన్ని చూస్తూ– మళ్లీ సెల్ వైపు చూస్తూ ఉండే సరికే బీప్ వచ్చింది.

ఆమె కూడా వచ్చింది.

'చేసేశానక్కా' అన్నాడు.

'ఓ' అని ఆమె నవ్వింది.

చేతిలో ఉన్న డబ్బు అతడికి ఇస్తే చక్కున చిల్లర తీసి ఇచ్చాడు.

'టూ ట్వంటీ టూయేగా'

'అవునక్కా'

ఆమె తలాడించి అక్కణ్ణుంచి కదిలింది. ఆ కుర్రాడు ఆమెనే చూస్తూ ఉన్నాడు. మళ్లీ వారం దాకా ఆమె ఆ బంకు వైపు రాదు. కాని ఆ చుట్టుపక్కల ఉన్న ఇంకో రెండు మూడు రీచార్జ్ సెంటర్లకు వెళుతుంది ఈలోపు. ఒకేచోట అన్నిసార్లు రీచార్జ్ చేయడం ఆమెకు నచ్చదు. ఆమె మిగిలిన చోట్ల ఆ పని చేస్తుందని ఆ కుర్రాడికి తెలుసు.

ఆమె– అక్కడకు రెండు మూడు ఫర్లాంగుల దూరంలో ఉన్న ఆమె ఫ్లాట్‌కు చేరి– డోర్ ముందు మడత పడి ఉన్న మేట్‌ను సరి చేసి– డోర్ తీసి లోపలికి వెళ్లి ఫ్యాన్ వేసింది. టివి చూడాలనుకుంది. కాని చూడాలనిపించలేదు. ఆకలిగా ఉంది. కాని తినాలనిపించలేదు. చీర వదిలి నైటి వేసుకోవాలనిపించింది. కాని వేసుకోవాలని పించలేదు.

ఫ్రిజ్ దాకా వెళ్లి డోర్ తెరిచి బాటిల్ తీసి తాగకుండా మళ్లీ పెట్టేసింది.

కర్టెన్లు నీట్‌గా ఉన్నాయి. ఫ్లోర్ నీట్‌గా ఉంది. దుప్పట్లు చాలా. కేన్ సెట్ ఆమెకు నచ్చిందో లేదో చెప్పలేముగాని దానిని కూడా ఆమె చాలా నీట్‌గానే ఉంచుతుంది. ఎక్కువ మందం లేని లైట్ బ్లూ కలర్ కుషన్స్ వాటిలో.

టైమ్ చూసుకుంది. బయట బాగా ఎండ ఉందని కాకి ఒకటి అరచి అరచి చెప్తూ ఉంది. పెళ్లయినప్పటి నుంచి ఇలా ఒకే కాకి తన వెంటపడి ఈ సంగతి చెప్తూ ఉందా అని అనిపించింది. ఎందుకంటే– పెళ్లయ్యాక ఆమెకు అలాంటి కాకుల శబ్దాలు తప్ప వేరేవి వినే చోటులో ఉండే భాగ్యం దక్కలేదు.

ఆమె భర్తకు అదేదో ఉద్యోగం. దాని లక్షణం ఏమిటంటే ఊరికి దూరంగా వాళ్ల సంస్థ తాలూకు టౌన్ షిప్ ఉంటుంది. అందులో ఉండాలి నివాసం. ఒకేలాంటి బిల్డింగులు. ఒకేలాంటి బయటి గోడలు. ఒకే లాంటి పార్కింగ్. ఒకేలాంటి కాకి. ఏ బ్రాంచ్‌కు ట్రాన్స్‌ఫర్ అయినా అంతే.

కావ్... కావ్....

భర్త వచ్చే టైమ్ అది. తనకూ కాకికీ ఇద్దరికీ తెలుసు.

బెల్ మోగింది. భర్త వచ్చాడు. సాధారణంగా ఇంటికీ ఆఫీసుకూ కిలోమీటరు దూరమే ఉంటుంది అతడికి. కారు ఉంది. తీసేం లాభం? ఆక్టివా ఉంది. అదీ దండగే. నడిచి వెళ్లి నడిచి వస్తాడు. మళ్లీ నడిచి వెళ్తాడు. సాయంత్రం ఫ్రెండ్స్‌తో బయటకు పోతాడు. కాని పది లోపల ఇల్లు చేరడానికి లోపం రానివ్వడు. ఆమెతో కలిసి తినడానికి తప్పకుండా ప్రయత్నిస్తాడు.

'నువ్వు తిన్నావా?'

'మీరు రాందే'

'కాని మరి'

ఆమె డైనింగ్ టేబుల్ మీదకు అన్నీ తెచ్చి పెట్టింది శుభ్రమైన పాత్రల్లో. పాలకూర పప్పు చేసింది. కొంచెం బఠానీ కూరా. పాలుబోసి చేసిన బీరకాయ కూర– రాత్రిదే– కాని ఈ మధ్యాహ్నానికే పాడవదు కదా... ఇంక ఆవకాయ... పొడులు... చల్ల మిరప కాయలు.... పెరుగు....

'నువ్వు తిను'

'ఆకలిగా లేదు. మీరెళ్లాక...'

'ఈ మధ్య ఇలాగే అంటున్నావు నువ్వు'

నవ్వింది.

'అసలు తింటున్నావా లేదా'

‘అయ్యో.. మీరేమిటండీ... తినకుండానేనా ఇలా ఒళ్లు చేశాను’

చూశాడు. పరిపూర్ణంగా ఉంది.

‘ఊ...’ అన్నాడు.

‘ఊ...’ అంది.

‘ఇంకేమిటి సంగతులు’

‘ఏముంటాయండీ’

‘టీవీ అన్నా పెట్టుకో’

‘సరే’...

ఫోం చేసి ఒక పది నిమిషాలు కునుకేసే టైమైతే ఉంటుందతనికి. పెళ్లయిన కొత్తల్లో పదిహేను ఇరవై నిమిషాల వరకూ స్వతంత్రంగా ఆ టైము తీసుకునేవాడు. అప్పుడు ఆమె కూడా అతని పక్కన ఉండేది. కాళ్లు పట్టేది. అతడు నిద్ర పోకుండా మెలకువగానే ఉండి వెళ్లేవాడు.

ఇప్పుడు అదేమీ లేదు. పై ఆఫీసర్ అయ్యాడు కదా. వెళ్లాలి.

‘తలుపేసుకో’

‘సరే’

వెళ్లిపోయాడన్నట్టుగా కాకి కావ్‌కావ్‌మంది.

ఆమె తలుపు వేసింది. చీర విప్పి మంచం మీద వేసి కాసేపు అటూ ఇటూ నడిచింది. అలాగే ఉందామా అనుకొని, ఆగి, నైటీ తొడుక్కుంది. సెల్ అందుకుంది. హాల్ తలుపు వేసి బెడ్‌రూమ్‌లోకి వచ్చి దిండు మీద తల పెట్టి వెల్లికిలా పడుకుంది. సెల్ నొక్కింది. చెవి దగ్గర పెట్టుకుంది. మోగుతోంది. ఎడమ పాదం బొటనవేలిని కుడిపాదం బొటనవేలితో నొక్కుతోంది. ఎత్తలేదు. ఒక్క నిమిషం కూడా వ్యవధి ఇవ్వకుండా మళ్లీ చేసింది. మోగుతోంది. ఎత్తలేదు. అర నిమిషం కూడా వ్యవధి ఇవ్వకుండా మళ్లీ చేసింది. మోగుతోంది. ఎత్తలేదు. పావు నిమిషం కూడా వ్యవధి ఇవ్వకుండా మళ్లీ చేసింది. మోగుతోంది. ఎత్తాడు.

‘రాక్షసీ’... బొబ్బరించాడు.

‘ఎందుకు చేస్తున్నావే లం....’

‘మీరు గుర్తొచ్చారు’

‘ఎందుకు పీక్కుతింటున్నావే నన్నూ’

‘మీరు గుర్తొచ్చారంతే’

'నిన్నూ... లం....'

హటాత్తుగా ఏడ్వడం మొదలుపెట్టింది.

'మీరు లేకుండా నేను బతకలేను... అయినా ఏం అడిగాను మిమ్మల్ని... కాస్త మాట్లాడండీ'

'నన్ను వదిలిపెట్టవే రాక్షసీ'...

'అయ్యో... నేనేమన్నానని ఇప్పుడు... నేనేమన్నాననీ....' ఏడుస్తోంది.

'నిన్ను చంపేస్తా'

'చంపేయండీ. చచ్చిపోతా. మీ చేతుల్లోనే చచ్చిపోతా. వద్దన్నానా. మాట్లాడండీ నాతో. అప్పుడు మాట్లాడారే. ఆ మాటలు. అవి కాకపోతే ఏదో ఒకటి. మాట్లాడండీ'...

అవతల- వలలో చిక్కిన క్రూరజంతువు పూర్తిగా బెదిరిపోయినట్టు- గస పెడుతున్నాడు.

'నన్ను వదిలిపెట్టవే. నీకు దండం పెడతాను....' ఏడుస్తున్నాడు.

మౌనంగా ఉంది.

కట్ చేశాడు.

సరిగ్గా పావు సెకన్ కూడా వ్యవధి ఇవ్వకుండానే మళ్లీ చేసింది. మోగుతోంది. మోగుతోంది. మోగుతోంది.

హటాత్తుగా ఆమె అందుక్కూడా సిద్ధంగా ఉన్నట్టుగా టక్కున చెవి దగ్గరి నుంచి సెల్ పక్కకు తీసింది. లేకుంటే చప్పుడుకి కొంచెం ఇబ్బంది అయ్యేది. అవతలి వైపు ఏదో బలమైన వస్తువుతో ఆ సెల్‌ను బాదినట్టున్నాడతడు. సెల్ పిండి పిండి అయి ఉండాలి. ఆ సిమ్ ఇంక పనికి రాదు.

సెల్‌ని కింద పెదవి మీద పదే పదే తడుతూ ఆలోచిస్తూ ఉండి పోయింది.

కావ్ కావ్... కావ్ కావ్...

అయ్యిందా వాడి పని అన్నట్టు కాకి అరుస్తూ ఉంది.

రెండు నిమిషాలు. తర్వాత మళ్లీ చేసింది. స్విచ్‌డాఫ్ వస్తోంది. కాని తను ఊరికే ఉండదు. ఒకవేళ సిమ్ పనికి వచ్చి అతడు ఇంకో సెల్‌లో దానిని వేస్తే? మెసేజ్ బాక్స్‌లోకి వెళ్లి మెసేజ్ టైప్ చేసింది.

'ఐ వాంట్ టు డై. వితవుట్ యు ఐ కాంట్ లివ్. ఇఫ్ యు డోంట్ టాక్ టు మి... ఐ విల్ కమిట్ సూసైడ్'....

ఆ మెసేజ్ సెండ్ కొట్టాక ఆమెకు కొంచెం ఆకలి అయ్యింది. కొంచెం ఏమి బాగానే

ఆకలయ్యింది. వెళ్లి ప్లేట్‌లో అన్నీ పెట్టుకొని టివి ఆన్ చేసి చూస్తూ తింది. సింక్‌లో ప్లేట్ పడేశాక నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకొని సెల్ అందుకుంది. ఈ టైమ్‌లో.... సరే... ఏ టైమ్‌లో మాట్లాడింది కనుక. నంబర్ ప్రెస్ చేసింది. మోగుతోంది. మోగుతోంది. మోగుతోంది.

'అమ్మా'

'ఎంత సేపే?'

'ఏం... ఆగలేవా?'

'భోం చేశావా?'

'ఊ'

'క్లాసుల్లేవా?'

'ఎగ్గొట్టా'

'ఏం?'

'చెప్తే నీకేం  అర్థమవుతుందే?'

'గూబ పగులుద్ది'

'సరే... ఉంటా'

'ఏమైనా మాట్లాడవే'

'ఫ్రెండ్స్ ఉన్నారు.... సాయంత్రం బయటకెళ్లాలి... ఇంకా పన్లున్నాయ్'

'మాట్లాడవే దొంగమొకందానా'

'ఇంక పెట్టెయమ్మా'

'జాగ్రత్తే చిట్టితల్లీ'

పెట్టేసింది.

మధ్యాహ్నం మూడు నుంచి ఐదు వరకూ అంటే అదో నరకం లాంటి సమయం. చదువు పూర్తయ్యాక– పెళ్లికి ముందు– రెండేళ్లు పడి ఉంది ఇంట్లో. అప్పుడు కూడా ఇలాగే మూడు నుంచి ఐదు వరకూ నరకం. ఏం తోయదు.

'ఏమిటే నీ ఆపసోపాలు... ఏదైనా పుస్తకం చదువుకో' అనేది అమ్మ.

'మా రోజుల్లో ఇవన్నీ ఎరగం. అసలు వేళెక్కడిదనీ. మీ నాన్నా  మీ పెదనాన్నా మీ చిన్నాన్నా పదీ పన్నెండు మంది పిల్లలు... మీ నానమ్మ తాతయ్యా... గోల. పొయ్యి మీద ఎక్కే దబర దిగే దబర. అన్నాలు తిని చేతులు కడుక్కుంటామా మళ్లీ సాయంత్రం

వంటకి పనులు. ఈలోపు చిమ్ముకోవడం కళ్లాపి చల్లుకోవడం పిల్లలకు స్నానాలు బట్టలు ఆరేసుకోవడం... అందరు బంధువులూ ఒకే ఊళ్లో ఉండటమాయె. ఎంత దూరమని? నాలుగడుగులు. ఎవరో ఒకరు వస్తారు. ఏదో ఒక రామాయణం ఎత్తుతారు. పలాన పెళ్లప్పుడు పలానామె చేసిన రాద్ధాంతం గుర్తుకు తెచ్చి అప్పుడెంత మనసు కష్టపెట్టుకున్నామో చెప్తారు. లేకుంటే నవ్వుకుంటారు. చేయవలసిన పెళ్లిళ్లు... దాచవలసిన డబ్బు... పొలం పనులు.... కట్టెలదొడ్డ గొడవ... గొడ్ల సంగతి సరేసరి.... మీరు కొంచెం పెద్దయ్యారు పర్లేదనుకుంటే మీ బాబాయి పిల్లలు... కేర్ కేర్ మని ఒకటే గోల. కాని పిల్లలుంటే అదో కళలే'....

అప్పటికే వెళ్లి మంచం మీద బోర్ల పడుకొని... మందంగా... ఏం తోచక....

టివి స్టాండ్ కింద పేపర్లు పెట్టడం ఆమెకు నచ్చదు. డబ్బునైనా నిర్లక్ష్యంగా పడేస్తుందిగాని పేపర్లు మాత్రం జాగ్రత్తగా పెడుతుంది. ఆదివారం పత్రికలూ... వీక్లీలూ....

ఫ్యాను వేసుకొని ఒక్కోటి తీసి తిరగేస్తూ కూచుంది. తిరగేస్తూ... తిరగేస్తూ... ఒక చోట ఆగింది. పక్కనే ఉన్న ఫోన్ అందుకుని అక్కడ ఉన్న నంబర్‌ని చూస్తూ జాగ్రత్తగా డయల్ చేసింది. మోగుతోంది. మోగుతోంది. మోగుతోంది.

'కావ్ కావ్.. కావ్ కావ్' కాకి మొత్తుకుంటూ ఉంది.

'హలో'

గొంతును ఎంతో వినయంగా మార్చింది.

'సార్... నమస్తే సార్'

'ఎవరమ్మా'

'సార్.. పేపర్‌లో మీ ఫొటో చూశాను సార్... నంబర్ ఉంటే'...

'ఓ'

'సార్... మీతో మాట్లాడొచ్చా సార్. ఒక్క నిమిషమే'

'అయ్యో.. దాన్దేముందమ్మా'

'సార్... మీతో మాట్లాడుతూ ఉంటే చాలా సంతోషంగా ఉంది సార్. ఇది కలా నిజమా తెలియకుండా ఉంది సార్'

'ఎక్కణ్ణుంచి?'

చెప్పింది.

'పేరు?'

చెప్పింది.

'మీ గొంతు బాగుందమ్మా'

'అయ్యో. నిజమా సార్'

'నిజమమ్మా'

'థ్యాంక్యూ సార్. చాలా థ్యాంక్యూ సార్'

'ఏం చేస్తుంటారు?'

'హౌస్‌వైఫ్‌ని సార్. ఇద్దరు పిల్లలు. అమ్మాయి ఫస్ట్ ఇయర్ ఇంజనీరింగ్. అబ్బాయి ఫస్ట్ ఇంటర్'

'ఓ'

'సార్. మీతో అప్పుడప్పుడు మాట్లాడొచ్చా సార్'

'దాన్దేముందమ్మా'

'భోజనం అయ్యిందా సార్?'

'లేదు. పనిలో పడి'

'అయ్యో. మీరు మా ఊళ్లో ఉంటే ఎంత బాగుండు సార్. నేనే పెట్టుండేదాన్ని కదా'

'ఆ'

'మీలాంటి వాళ్లకు నాలుగు ముద్దలు పెట్టే భాగ్యం కంటే ఏం కావాలి సార్'

'ఆ'

'నిజం చెప్తున్నాను సార్. మీరు ఫోటోలో చాలా బాగున్నారు సార్'

'ఊ'

'నా దురదృష్టం మండిపోను. మీరు మా ఊళ్లోనే ఉంటే ఒళ్లో కూచోబెట్టుకునే నాలుగు ముద్దలు తినిపిద్దును కదా సార్'

అటువైపు గొంతు నెమ్మదించింది. ఆమె గొంతు కూడా నెమ్మదించింది.

కావ్ కావ్... కావ్ కావ్....

నేల మీద సోఫాకు వీపు ఆనించి కాళ్లు చాపుకొని మాట్లాడుతూ ఉంది. ఎడమకాలి బొటనవేలిని కుడికాలి బొటనవేలు నొక్కుతూ ఉంది. మరికాసేపటికి ఆమె గొంతు ఇంకా నెమ్మదించింది. అటువైపు తెలీదు. ఆమె ముఖం ఎర్రబడింది. బొటనవేలి మీద బొటనవేలు.

ఫోన్ కట్టయ్యింది.

లేచింది.

స్నానం చేయాలనిపించింది. కాని వాకింగ్ చేస్తే మళ్లీ స్నానం చేయాలి. చుడీదార్ కట్టుకుంది. డోర్‌ను లాక్ చేసి మెట్లు దిగుతూ ఉంటే దూరం నుంచి కొడుకు వస్తూ కనిపించాడు. ఆగింది. తాళం తీసుకున్నాడు.

'ఏదైనా తిను'

'ఊ'

'బట్టలు మార్చుకో ముందు'

'ఊ'

వీడు ఊలు కొట్టడం తప్ప ఏదైనా మాట్లాడి చాలా కాలం అవుతోంది. ఉదయం ఐదింటికి లేచి వెళతాడు. కాలేజీ. మళ్లీ కోచింగు. వచ్చాక చదువు. ఫేస్‌బుక్. మొబైల్. ఫోన్లు.

'అమ్మా. అన్నం'

'అమ్మా. బట్టలు'

'అమ్మా. డబ్బులు'

ఈ మూడు మాటలు మాట్లాడతాడు. వాడి గది వాడికి ఉంది. ల్యాప్‌టాప్. నెట్. ఎప్పుడైనా వెళ్లాలంటే కొట్టి వెళ్లాలి. పిల్లలకు సంబంధించి తనకు ఇలాంటి దశ ఒకటి వస్తుందని ఆమె ఎప్పుడూ ఊహించలేదు. చిన్నప్పుడు పిల్లలిద్దరూ తనను క్షణం కూడా వదిలి ఉండేవాళ్లు కాదు. ఒళ్లో ఒకరు భుజాల మీద ఒకరు. వంటగదిలో ఉంటే వంటగదిలో. స్నానం చేస్తుంటే తలుపు బయట. కదలనిస్తేనా. ప్రతిదీ అడగడమే. ప్రతిదానికీ సాయం పొందడమే. ప్రతిదీ చెప్పడమే. అప్పుడు అన్నీ ఆమెకు అర్థమయ్యేవి. అప్పుడు అన్నీ ఆమెకు తెలిసేవి. ఇప్పుడు ఏమడిగినా నీకు తెలీదులే అంటున్నారు ఇద్దరూ.

నడక మొదలెట్టింది.

రోడ్డు మీదకు వెళ్లక్కర్లేదు.

టౌన్ షిప్‌లోనే ఇంటర్నల్‌గా ఒక రౌండ్ వేస్తే మూడు కిలోమీటర్లు.

నడుస్తూ ఉంది. కాకి ఎటుపోయిందో పోయింది. ఎన్ బ్లాక్ ఆమె ఎదురుపడింది. రోజూ వాళ్లిద్దరూ వాకింగ్‌లో కలుస్తారు. ఏం మాట్లాడుకోరు. పక్కపక్కన నడుస్తారు. ఆమె గురించి ఈమెకు ఈమె గురించి ఆమెకు కొత్తగా మాట్లాడుకోవడానికి ఏం లేదు.

‘వంట ఏం చేశారు?’

‘ఇవాళ ఎండ కొంచెం తక్కువ’

అంతకు మించి లేదు.

వాకింగ్ ముగించుకొని వస్తుంటే వాడు స్నానం చేసి బట్టలు మార్చుకొని ఎక్కడికో వెళుతున్నాడు. తాళం ఇచ్చాడు.

‘ఎక్కడికి రా?’

‘వస్తాలే’

వెళ్లిపోయాడు. పూర్తిగా చీకటి పడిపోయింది. ఆమె ఇంట్లోకి వెళ్లి షవర్ బాత్ చేసింది చాలా సేపు. స్నానం చేశాక మెడ మీద, బుగ్గలకు పౌడర్ అద్దుకుంది. చలువ చేసిన బట్టలు తొడుక్కుంది. తల దువ్వుకుంది. పువ్వులు పెట్టుకుంది. శుభ్రంగా తాజాగా తయారయ్యింది.

ఫోన్ తీసుకుంది. ఇందాకటి నంబర్. జాగ్రత్తగా ప్రెస్ చేసింది. మోగుతోంది. మోగుతోంది. మోగుతోంది.

‘ఏంటి?’

‘ఊరికే చేశాను సార్. గుర్తొచ్చారనీ. ఆఫీసులోనే ఉన్నారా... ఇంటికి వెళ్లి పోయారా?’

‘అలా చేయొద్దు ఎప్పుడు పడితే అప్పుడు’

‘సారీ సార్... మిమ్మల్ని డిస్టర్బ్ చేయను సార్’

పెట్టేశాడు.

టీ పెట్టుకొని తాగాలనిపించి వంటగదిలోకి వెళ్లింది. మోడ్రన్ కిచెన్. చిమ్నీ. నాలుగు బర్నర్ల స్టౌ. ఉడ్ వర్క్ చేసిన కప్‌బోర్డుల్లో ఏం కావాలంటే అది. చిన్నప్పుడు వాళ్ల అమ్మ ఇలాంటి వంట గది ఎప్పుడూ చూళ్లేదు. ఊదుడు గొట్టంతో ఉఫ్ ఉఫ్ అని ఊదుతూ చీటికి మాటికి దినుసుల కోసం వెతుక్కుంటూ ఉండేది. ఒకోసారి ఉండేవి. ఒకోసారి లేక.

‘ఎందుకుమా నాన్న అన్నీ తెచ్చి పడేయడు’

‘అన్నీ ఉండటం కూడా శిక్షేనే’

అమ్మకు చిన్ని చిన్న ఆశలు ఉండేవి. గులాబీ మొగ్గల బంగారు గాజులు. ఆమె వాటి కోసం దాదాపు పదేళ్లు ఎదురు చూసింది. చిన్ని కోరికతో. నిజానికి దాని కోసమే బతికిందో ఏమో. ఇవాళ తన దగ్గర డబ్బుంది. బ్యాంక్ బ్యాలెన్స్ ఉంది. కాని ఆసక్తి

ఉంటే కదా.

టీ అయిపోయింది.

వీడు రాడు.

ఆయన రావడానికి టైమ్ ఉంది.

మూడు బెడ్రూమ్‌ల ఫ్లాట్. పెద్ద హాల్. రెండు బాల్కనీలు. ఒక కారు పట్టేంత కారిడార్. మొక్కలు. బట్టలు. డబ్బులు. సరుకులు. ఫోన్లు. కంప్యూటర్లు. ఒక్కతే మనిషి.

ఫోన్ తీసింది. ఇందాకటి నంబరే. జాగ్రత్తగా ప్రెస్ చేసింది. మోగుతోంది. మోగుతోంది. మోగుతోంది.

'యూ... స్టుపిడ్ చేయొద్దన్నానా?'

'సారీ సార్. గుర్తుకొస్తున్నారు. ఇల్లు చేరుకున్నారా? ఏదైనా మాట్లాడండి సార్'

అవతల వైపు ఒకటి రెండు నిమిషాలు సైలెంట్ అయిపోయాడు.

'ఇప్పుడే స్నానం చేశాను సార్. ఎంత బాగుందో. మీరే గుర్తొచ్చారు. అయ్యో... మా ఊళ్లో ఉంటే నేనే వీపు రుద్ది స్నానం చేయిద్దును కదా...' నిలబడే మాట్లాడుతూ ఉంది. బొటనవేలి మీద బొటనవేలు.

'యూ... ఇడియట్ ఇంకొక్కసారి చేశావంటే పోలీసులకు పట్టిస్తాను'

సడన్‌గా ఏడుపు మొదలెట్టింది.

'ప్లీజ్ సార్... అంత పని చేయకండి సార్. నేను మీరు లేకుండా బతకలేను. మిమ్మల్ని అస్సలు డిస్టర్బ్ చేయను. మీరు ఎప్పుడు చెప్తే అప్పుడే చేస్తాను. రోజుకు ఒక్కసారి. సరేనా? సారీ సర్. వెరీ వెరీ సారీ. బై సర్. గుడ్‌నైట్'

'ఊఁ'

పెట్టేసింది.

టివిలో ఏదో ప్రోగ్రామ్ వస్తోంది. యాంకర్ ఏదో చాలా వాగుతోంది. కాని ఒక్కమాటా తనకు సంబంధం లేదు. చూడలేక కాసేపు అవస్థ పడింది. ఇంట్లో మాట్లాడ్డానికి మనిషి ఉంటే బాగుండు అని ఒకసారి పనిపిల్లను తెచ్చి పెట్టుకుంది. కాని దానిని ఇరుగూ పొరుగూ నుంచి కాపాడ్డానికి చచ్చే చావు వచ్చింది. ఆ పిల్లకు కూడా కాలు కుదురుగా ఉండేది కాదు. వయసొచ్చిన పిల్ల. ఇంట్లో ఎంతసేపని ఉంటుంది? పోతానంది. పో అని పంపించేసింది.

వాడొచ్చాడు. ఫోన్ మాట్లాడుకుంటూ తన గదిలోకి వెళ్లిపోయాడు.

మరి కాసేపటికి ఆయన.

'ఏంటి అప్పుడే?'

'అలసటగా ఉంది'

'రెండ్రోజులు లీవ్ పెట్టమంటే వినరు గదా'

'ఎలా పెడ్తాం. ఆఫీసులా అవి. మొసళ్ల మడుగులు. ఏమరుపాటుగా ఉంటే అయిపోతాం. ప్రమోషన్లు రానక్కర్లేదా? అందరూ ఒళ్లు హూనం చేసుకుంటున్నారు కెరీర్ కోసం. మనమంటే మన అమ్మానాన్నలు ఏమిచ్చారో అది తీసుకున్నాం. ఇప్పుడు పిల్లలే వాళ్లకు ఏం కావాలో ఫోర్స్ చేస్తున్నారు. రేపు దాని పెళ్లి. అదెంతవుందో. వీడు అది కావాలి ఇది కావాలని ఏమడుగుతాడో. మంచి సినిమా చూసి ఎంతకాలం అవుతుందో చెప్పు'

'తిరుగుతూనే ఉన్నారు కదండీ'

'ఏం తిరుగుతున్నాను? కాసేపు ఫ్రెండ్స్‌తో మందు. అది కూడా చేయకపోతే బతకను. లిమిట్స్ దాటడం చూశావా ఎప్పుడైనా?'

'భోజనం పెట్టేదా?'

'నువ్వా'

'ముందు మీరు తినండి'

'వద్దు. స్నానం చేసి పడుకుంటాను. కాసింత మజ్జిగ ఇవ్వు చాలు'

'సరే'

స్నానం చేసి, ఏసి ఆన్ చేసుకున్నాడు. మజ్జిగ ఇచ్చింది. తాగాడు.

'గుడ్ నైట్'

పడుకున్నాడు.

ఆమె అతణ్ణే చూసి డోర్ ముందరకు వేసి హాల్లోకి వచ్చింది.

ఆయన గదిలో నుంచి చడీ చప్పుడు లేదు. వాడి గదిలో నుంచి కూడా. ఎప్పుడు వచ్చి తింటాడో. ఇప్పటికే ఏదైనా తినేసి వచ్చాడో.

కూచుని కాసేపు ఆలోచించింది. భర్తకు ఇంక ఒకటి రెండు ట్రాన్స్‌ఫర్లు మిగిలాయి. అవి కూడా ఇలాగే. ఫ్లాట్ కాకపోతే ఈసారి డ్యూప్లే. లేదంటే బంగ్లా. ఇలాగే ఊరికి దూరంగా టౌన్‌షిప్. ఈ మధ్య హైద్రాబాద్‌లో విల్లా ఒకటి తీసుకుందామని అనుకున్నాడు. రిటైర్ అయ్యాక ఉండటానికి. ఇలాగే. ఊరికి దూరంగా. ప్రశాంతంగా. గేటెడ్ కమ్యూనిటీ అట. సెక్యూరిటీ. ప్రైవసీ. అనుమతి లేకుండా ఎవరింటికీ ఎవరూ రారు. ఎవరిటికీ ఎవరూ పోరు. తన మరణం ఎలా ఉండబోతోందో ఊహించింది. ఇలాంటి

ఇళ్లలోనే ప్రశాంతంగా ఎవరి అంతరాయం లేకుండా.

టైమ్ చూసింది.

తొమ్మిదిన్నర.

ఈ మధ్య నిద్ర ఎగిరిపోయింది. ఎప్పటికి పట్టాలి. ఎప్పుడు నిద్రపోవాలి.

ఫోన్ అందుకుంది. ఇందాకటి నంబరే. జాగ్రత్తగా ప్రెస్ చేసింది. మోగుతోంది. మోగుతోంది. మోగుతోంది. ఎత్తలా. ఒక్క నిమిషం వ్యవధి ఇచ్చి మళ్లీ చేసింది. మోగుతోంది. మోగుతోంది. మోగుతోంది. ఎత్తలా. అర నిమిషం వ్యవధి ఇచ్చి మళ్లీ చేసింది. మోగుతోంది. మోగుతోంది. మోగుతోంది. ఎత్తలా. పావు నిమిషం వ్యవధి ఇచ్చి...

'ఎందుకు చేస్తున్నావే?' దిక్కులు పిక్కటిల్లాయి.

పిల్లి కంటే మెత్తగా, కుక్క కంటే వినయంగా, ఎలుక కంటే బెదురుపాటుగా మాట్లాడింది.

'సారీ సార్. గుర్తుకొస్తుంటే చేశాను సార్. డిస్టర్బ్ చేశానా సార్. డిన్నర్ అయ్యిందా? అయ్యో... మీరు మా ఊళ్లోనే ఉండి ఉంటే మీకు అన్నం పెట్టి, సేవ చేసి, మీ కాళ్లు నొక్కి... మీరు కబుర్లు చెబుతుంటే చాలా బాగుంటుంది సార్. కాసేపు కబుర్లు చెప్దామనే తప్ప నాకు వేరే ఉద్దేశం'..... బొటనవేలి మీద బొటనవేలు నొక్కుతూ ఉండగా...

అవతలి వైపు టపాకాయ పేలినట్టయ్యింది.

ఆమె చాలా అలెర్ట్‌గా చెవి దగ్గరి నుంచి ఫోన్ తీసేసింది.

ఇంక ఆ ఫోన్ పనికి రాదు. విసిరి కొట్టాడు. సిమ్– చెప్పలేము.

ఆమెకు ఆకలేసింది. కొంచెం తిన్నంత పని చేసింది. ఇలాంటి టైములో మరీ నిద్ర పట్టకపోతే వాడొచ్చు అని డాక్టర్ టాబ్లెట్ రాసిచ్చింది. అది వేసుకుంటే నిద్ర వస్తుంది. కాని– దానిని దాదాపు రోజూ వాడుతోంది.

లేచి టాబ్లెట్ వేసుకుంది.

అరగంట గడిచింది.

ఇంట్లో దీపాలన్నీ ఆరిపోయాయి.

వాడి బెడ్‌రూమ్. ఆయన బెడ్‌రూమ్. తన బెడ్‌రూమ్.

చాలాసేపు మంచం మీద దొర్లింది. సరే, ఏమో చెప్పలేము కదా అని– ఇందాకటి నంబర్‌కే జాగ్రత్తగా ట్రై చేసింది. మోగలా. స్విచ్‌డాఫ్ వస్తోంది.

ఎందుకు వదలడం? ఎస్ఎంఎస్ పెట్టింది.

'ఇఫ్ యు డోన్ట్ టాక్ టు మి ఐ విల్ కమిట్ సూసైడ్'

సెండ్ నొక్కింది. నిద్ర పోయింది.

ఉదయం చెప్పక్కర్లేదు. క్రమశిక్షణ కలిగిన సైనికుల్లా ముగ్గురూ పని చేస్తారు. ఆమె టిఫిన్ చేస్తుంది. వాళ్లిద్దరూ తినేస్తారు. వాడు కాలేజ్కి. అతడు ఆఫీసుకు. మరి కాసేపటి తర్వాత ఆమె కూడా తయారవుతుంది. నిన్నటి ఫోన్ కొన్ని రోజుల పాటు వాడదు. తనకు ఇంకో నంబర్ ఉంది.

అది తీసుకొని ఆక్టివా వేసుకొని బజారుకు వెళ్తుంది.

దూరంగా ఈమెను చూసిన కుర్రాడు చకచకా సెల్ నొక్కి రీచార్జ్ చేస్తాడు.

ఇంటికి తిరిగి వచ్చి– ఇంటి ముందు బోర్లా పడి ఉన్న చెప్పుల జతను సరి చేసి– డోర్ తెరుచుకొని లోపలికి పోతుంది. గడియ పెడుతుంది. పేపర్లు, వీక్లీలు తెచ్చుకొని హాల్లో తీరికగా కూలబడుతుంది.

ఆమె వాటిని శ్రద్ధగా తిరగేస్తుంటుంది.

అప్పటికే ప్రత్యక్షమైన కాకి దూరంగా కావ్ కావ్మంటూ ఎవరో గొంతు తెగ్గోసినట్టుగా మొత్తుకుంటూనే ఉంటుంది.

మార్చి 30, 2013

# వహీద్

'ఏమిట్రా?' అంది తల్లి వాణ్ణి చూసి.

అప్పుడే ఆమె స్నానం చేసి, చీర కట్టుకొని, కొత్తగాజులు వేసుకుంటూ ఉంది. టైలర్ ఇచ్చిన కొత్తరవిక సరిపోయిందా లేదా చూసుకుంటూ ఉంది. చెప్పులు కొత్తవి కావు. పర్లేదు. మెడలో ఒక నగ ఉంది. సరిపోతుంది. పెళ్లికి వెళ్లాలంటే అంతకు మించి ఏం కావాలి.

'ఊరేగింపుకు వెళ్లలేదా?' అడిగింది.

వాడు ఊరికే కూచున్నాడు.

'పద' చెప్పులు వేసుకుంటూ తాళం అందుకుంది.

'నేన్రాను' అన్నాడు.

ఆమె విచిత్రపోయింది.

'అంటే?'

'నేన్రాను. నాకు క్యారేజీ తీసుకొనిరా. ఇంట్లోనే ఉంటా' అన్నాడు.

ఆమె ఏమీ మాట్లాడలేదు. నేరుగా వచ్చి చెవి మెలిపెట్టి వీపు మీద దబీమని ఒక్కటేసింది.

'పద' అంది.

వాడు నసుగుతూ సణుగుతూ ఉహ్వా ఉహ్వాలు కొడుతూ తల్లి వెంట నడిచాడు.

పెళ్లికూతురి ఇల్లు పెద్ద దూరంలో లేదు. ఫర్లాంగు అవతల. చిన్న సందు. ఇప్పటికే సైకిళ్ల మీద, మోపెడ్‌ల మీద, ఒకటి రెండు స్కూటర్ల మీద వచ్చినవాళ్లతో– అవి వారగా నిలబెట్టడం వల్ల– ఇరుకైపోయి ఉంది. ఇంటి ముందు పాలజాటీలు బిగించి

కట్టిన షామియానా ఉంది. రేకు కుర్చీల్లో చాలామంది కూచుని ఉన్నారు.

తల్లి చొరవగా పెళ్లి ఇంట్లోకి వెళ్లింది.

వాడు కూడా చూద్దామని దూరాడు.

ఇల్లంతా పెయింట్ వాసనగా ఉంది. గోడలకు తెల్లరంగు, తలుపులకు పచ్చరంగు వేసి ఉన్నారు. కిటికీలకు పచ్చరంగుతో ఆగక మీద పింక్ కలర్ పూలను తీగలతో ఆకులతో పాటుగా గీశారు. ప్రతి గడపకూ అక్కర లేకున్నా కొత్త కర్టెన్లు వేలాడగట్టారు. ఒక గదిలో పెళ్లికూతురు ఉంది. తల్లి ఆ గది గుమ్మం దగ్గరకు వెళ్లి హుషారుగా నిలుచుంది. లోపలంతా చాలామంది ఆడవాళ్లు చాపల మీద కూచుని ఉన్నారు. నవ్వుతూ మాటలు చెప్పుకుంటూ ఉన్నారు. మధ్యలో ఎర్రటి బట్టల్లో, ఎర్రటి ఘూంగట్ కప్పుకొని, పెళ్లికూతురు తల దించుకొని ఉంది– జంషీద్ ఆపా.

వాడికి గుండె పట్టేసినట్టయ్యింది.

'చూడ్రా... ఆపాను చూడు... ఏదమ్మా... మా అమ్మాయిని చూపించండి' అని పరిహాసం పోయింది తల్లి.

అందరూ ఆమెతో పాటుగా నవ్వి, ఒక పడుచుపిల్ల ఘూంఘట్ తొలగించి, చుబుకం కింద చేయి ఆనించి మెల్లగా తల ఎత్తి చూపించింది.

వాడికి మళ్లీ గుండె పట్టేసినట్టయ్యింది.

జంషీద్ ఆపా ఏడుస్తూ ఉంది.

'హయ్యో... పిచ్చిపిల్లా... ఎందుకమ్మా ఏడుస్తావూ'... తల్లి అంది.

'అత్తారింటికే కదమ్మా వెళుతున్నావు. అయినా ఈ కాలం ఆడపిల్లలు ఎవరైనా ఏడుస్తున్నారా నీలాగా? పూసలు మెళ్లో పడగానే పద పదా అని లగెత్తుతున్నారు' అని నవ్వింది.

అందరూ నవ్వారు.

'అయినా ఆ వచ్చేవాడే నవ్విస్తాళ్లే నిన్ను'...

వాడికి అక్కడ ఉండబుద్ధి కాలేదు. బయటికొచ్చి నిలబడ్డాడు. వాడి ఈడువాడే– పెళ్లికూతురి తమ్ముడు– ప్యాంటూ షర్టూ ఒకే రంగు బట్టతో కుట్టిన డ్రస్సు వేసుకొని, కొత్త బూట్లు తొడుక్కుని, సాధారణంగా పెళ్లిళ్ల దగ్గర తయారయ్యే ఐసు బండిని నిరుత్సాహపరచకుండా ఐసు నాకుతూ నిలబడి ఉన్నాడు.

'రేయ్... వహీద్... కావాలా?' అన్నాడు వాణ్ణి చూసి.

'వద్దు' అన్నట్టు తల ఆడించాడు.

'డబ్బులున్నాయిరా' అన్నాడు జేబు మీద గల్‌గల్ శబ్దం చేస్తూ.

'వద్దు' అన్నట్టు మళ్లీ తల ఆడించాడు.

ఈ లోపల బాజాలు వినిపించాయి.

'అద్దుగో' అన్నాడు పెళ్లికూతురి తమ్ముడు దూరంగా వేలు చూపిస్తూ.

వీధిలో దూరంగా మొదట బాజాలు... ఆ వెనుక కొత్తపంచెల్లో తెల్లచొక్కాల్లో ఉన్న నలుగురైదుగురు పెద్ద మనుషులు... ఆ వెనుక కేరింతలు కొడుతున్న ఐదారు మంది కుర్రవాళ్లు... వాళ్ల వెనుక గుర్రం... దాని మీద నిండుగా పూలు కప్పుకొని ఉన్న పెళ్లికొడుకు... పైనుంచి పడిపోకుండా సపోర్టుగా అటొకరు ఇటొకరు... వెనుక మరో ఇరవై ముప్పయి మంది... బారాత్.

వాడు ఆగలేదు. పెళ్లికూతురి ఇంటి ముందు ఒక్క క్షణం కూడా నిలవకుండా పరిగెత్తుకుంటూ బారాత్‌కు ఎదురు వెళ్లి పెళ్లికొడుకు పక్కకు చేరాడు.

'ఊ...ఊ... దూరం... గుర్రం తొక్కుతుంది' నెట్టేశారు.

పక్కనే నడుస్తూ ఉన్నాడు.

పెళ్లికొడుకును చూడాలి.

కనిపించడం లేదు.

భుజాల మీద నిండుగా వేళ్లాడుతూ మల్లెపూల సెహెరా... మధ్య మధ్య గులాబీలు పొదిగి... పొడవు చేతుల తెల్లచొక్కా... బటన్లు పెట్టి... మణికట్టు మీద వాచీ... గోల్డ్ కలర్‌ది... వేలికి మెరుస్తున్న ఉంగరం... ఆకుపచ్చ రాయితో... తెల్ల బెల్‌బాటమ్ ప్యాంట్... సన్నపోగుల డిజైను ఉంది... కింద రికాబును అదిమి పెట్టిన బూటు కాలు... హీల్ చాలా ఎక్కువ ... నల్లటి మెరుపు...

పెళ్లికొడుకును దించి, సెహెరాలో కళ్లు కనిపించవు గనుక, ఇటొకరు అటొకరు పట్టుకొని నడిపిస్తూ పెళ్లికూతురి ఇంటి ఎదురుగా బల్లలు వేసి తయారు చేసిన మంటపంలోకి తీసుకెళ్లి గద్దె మీద కూచోబెట్టారు.

ఖాజీ వచ్చాడు. సాక్షి సంతకం పెట్టడానికి మేనమామ కూడా వచ్చాడు.

చూస్తూ ఉన్నాడు.

భుజం మీద చేయి పడింది.

'వస్తావంట్రా'

'ఎక్కడికి?'

'రా... నా పక్కన కూచో' అని– తండ్రి కర్చీఫ్ తీసి తల మీద వేసుకుంటూ–

మరో సాక్షిగా సంతకం పెట్టడానికి బల్ల ఎక్కాడు. వాడూ ఎక్కాడు. పెళ్లికూతురి తమ్ముడు అప్పటికే అక్కడ బాసింమెట్టు వేసుకొని ఉన్నాడు.

ఆ వేళ పెళ్లికొడుకు మహారాజు. అందరూ పెళ్లికొడుకు వైపే చూస్తూ ఉన్నారు. వాళ్లూ వీళ్లూ వచ్చి సెహెరాను చెవి దగ్గర కొంచెం తప్పించి చనువుగా ఏదో చెప్తూ ఉన్నారు. దగ్గరి స్నేహితుడిలా ఉన్న ఒక వ్యక్తి పక్కన కూచుని మఖ్‌మల్ గుడ్డతో చేసిన విసనకర్ర తీసుకొని జపాజపా విసురు తున్నాడు గాలి తగలడానికి. పెళ్లికొడుకు చేతిలో తురాయి ఉంది. మధ్యలో ఆపిల్ పెట్టి చుట్టూ పూలు గుచ్చి చేసిన తురాయి. నిఖా అయిపోతే ఆపిల్ తినేయొచ్చు.

'ఊ' అన్నాడు ఖాజీ.

పెళ్లికూతురి మేనమామ పెళ్లికొడుకు ఎదురుగ్గా కూచుని, సెహెరాకు ఉన్న పూల దారాలను మెల్లమెల్లగా తెంపి, ఒక్కమాటున సెహెరాను రెండు భాగాలుగా చేసి, వాటిని ఇరుభుజాల వైపూ వెనక్కు వేసి పెళ్లికొడుకు ముఖాన్ని వెలుగులోకి తెచ్చాడు.

'సుబహానల్లా'

దిష్టి తగలకుండా ఖాజీ పెద్దగానే అన్నాడు.

పెళ్లికొడుకు మెరిసిపోతూ ఉన్నాడు. చెమట పట్టి ఉన్నా విసుక్కోకుండా నవ్వుతూ ఉన్నాడు. నల్లటి కనుబొమలు... మీసం... నున్నటి గడ్డం... గోధుమ వర్ణం కను పాపలు...

పెళ్లికొడుకు వైపే చాలాసేపు చూసి తల కిందకు దించేశాడు.

నిఖా మొదలయ్యింది.

వాడు లేచి, తండ్రి గమనిస్తూ ఉన్నా పట్టించుకోకుండా బల్ల దిగి, షామియానాకు దూరంగా వచ్చేశాడు. జేబులు తడుముకున్నాడు. డబ్బులు ఏమీ లేవు. ఊరొదిలి ఎక్కడికైనా పారిపోతే? కాని అన్నం ఎవరు పెడతారు? బట్టలు ఎవరు ఇస్తారు? ఒకవేళ దొరికిపోయి ఇంటికి చేరితే తల్లి ఊరుకుంటుందా? భయం వేసింది.

మొన్న పెళ్లికూతురి తమ్ముణ్ణి అడిగాడు– 'పెళ్లయ్యాక జంషీద్ ఆపా ఇక్కడే ఉంటుందా? వెళ్లిపోతుందా?'...

'ఉంటుందనుకుంటా. పెళ్లయ్యాక ఒకటి రెండు రోజులు పెళ్లికొడుకుతో పాటు వెళ్లొచ్చి యింకిక్కడే ఉండి పోతుందని చెప్పింది మా అమ్మ నేనేడుస్తుంటే'....

'అలాగైతే పర్లేదు' ధైర్యం తెచ్చుకున్నాడు.

కాని, రోజులు మళ్లీ మునపటిలా ఉండబోవట్లేదని వాడికి మెల్లమెల్లగా అర్థమ వుతూ ఉంది. ఇక మీదట తాను అలిగితే బుజ్జగించేదెవరు?

'వహీద్... ఎక్కడ్రా... చచ్చినోడా' అని పిలుస్తుంది తల్లి.

ఇంట్లో పనులన్నీ తనే చేయాలి. పెరట్లో మునగచెట్టు ఉంది. దాని చాకిరీ అంతా తనే చెయ్యాలి. కాయలు మార్కెట్లో ఇవ్వాలి. కోళ్లు ఉన్నాయి. గుడ్లు వాళ్లింటికీ వీళ్లింటికీ ఇచ్చి రావాలి. ఆ తర్వాత డబ్బు వసూలు చేయాలి. కిరిసినాయలు అమ్ముతారు. కావలిసినవాళ్లు వస్తే చిట్టీలో కరెక్టుగా వొంచి కరెక్టుగా పోయాలి. చెల్లాయ్ బుజ్జిది. ఆడుకుందామంటే ఇవే పనులు. పోనీ ఎప్పుడైనా పావలా అడిగితే ఇస్తుందా. అస్సలు. ముద్దు చేస్తుందా? అస్సలు. ఇంక చూసీ చూసీ అలిగేవాడు. అన్నం తిననంటే తినడే. కంచం ముందు పడేసి వీపు మీద బాదినా వినడే. కొట్టు చంపు... తిననంటే తినడు. ఇదంతా తండ్రికి చెప్పాలంటే తల్లికి భయం. అందుకని–

'జంషీద్... ఈ చచ్చినోడి సంగతి చూడు తల్లీ' అనేది.

అప్పుడు జంషీద్ ఆపా, ఎంత మెత్తగా ఉంటుందని, 'వహీద్', ఎంత ప్రేమగా పలకరిస్తుందనీ. లేతబులుగు రంగు పావడా... బులుగు రంగు ఓణి... పొడవు జడ... చేతులకు మట్టి గాజులు... పొడవైన వేళ్లు... దగ్గరకు తీసుకుంటే ఛాతీ వరకూ వస్తాడు.

'ఏం రా బంగారూ... తిను' అనేది.

మంత్రం వేసినట్టు తినేసేవాడు.

జంషీద్ ఆపా పక్కన ఉంటే వాడికి బాగుండేది. క్యూటికురా పౌడర్ వాసన... బాగుండేది. రీటా నూనె రాసిన వాసన... బాగుండేది. ఎప్పుడైనా రోకలి దంచుతూ ఉంటే ఆ చెమట వాసన.... బాగుండేది. స్కూల్‌కు వెళ్లే ముందు, స్కూల్ నుంచి వచ్చేశాక, ఖాళీ దొరికితే, సెలవు రోజున... ఇంట్లో ఉంటే కదా... జంషీద్ ఆపా దగ్గరే.

'వహీద్... రా' ఎప్పుడూ నవ్వుతూ పిలుస్తుంది. ఒక్కసారి కూడా కరుకుగా మాట్లాడదు.

అసలు జంషీద్ ఆపాను ఎవరైనా సరిగ్గా చూశారా? తనే చూశాడు. బావి దగ్గర గొంతుక్కూచుని, గాజులు వెనక్కు జరుపుకొని, చప్టా మీద చేపలు పడేసి, ఊగి ఊగి తోముతూ ఉంటే ఎగిరి ఎగిరి పడే అంచును తనే చూశాడు. దొడ్లోని చిక్కుడు తీగ, ఇబ్బడిముబ్బడిగా కాపుకొచ్చినప్పుడు, హమీద్ రా రా అని పిలిచి, ఎగిరి ఎగిరి కాయలు తుంచుతుంటే, ఆ పందిరి నీడతోపాటు ఆమె ఛాతీ నీడను కూడా తనే చూశాడు. ఒకసారి ఇంటికెళితే.... అమ్మ బాబోయ్... ఎవరూ లేకపోతే.... గోరింటాకు పెట్టుకొని నులక మంచం మీద నిద్రపోతుంటే ఆ ఆదమరుపు రూపం... తనే చూశాడు. అసలు చాలాసార్లు నీళ్లు చేది ఆఖరు బిందె పూర్తయ్యాక పావడా పైకెత్తి కాళ్లు కడుక్కుం టుంటే ఆ పాదాల తెలుపు తను మాత్రమే చూశాడు. ఇంకెవరు చూశారు.

కాని, ఒకోసారి, ఇంటికి వెళితే వాళ్లమ్మ గుమ్మం దగ్గరే ఆపేసేది.

'నువ్వెంద్రా'

'ఏం.. ఆపా లేదా'

'స్నానం చేస్తోంది మళ్లీ రాపోరా'

వచ్చేసేవాడు.

కాని వాడికి ఎందుకో చాలా సంతోషం వేసేది. ఆపా స్నానం చేస్తోందంటే వాడికెందుకు సంతోషమో. కాని సంతోషం వేసేది.

వాడికి ధైర్యం జంషీద్ ఆపా ఉందని. ఎప్పటికీ తనతోనే ఉంటుందని.

కాని ఇప్పుడు నిఖా వచ్చేసిందే.

'వహీద్... మీ అమ్మ వెతుకుతోంది' ఎవరో పిలిచారు.

'ఎక్కడ చచ్చావురా... అందరూ తినేస్తున్నారు' కేకేసింది తల్లి.

వెళ్లి బంతిలో కూచున్నాడు. పసుపురంగు మెతుకులు. లేత ఎరుపు రంగు మాంసం ముక్కలు. బాగా ఉడికి– అన్నంలో కలిసిపోయిన టొమేటో పచ్చిమిర్చీ అల్లం వెల్లుల్లి ఘుమఘుమ. అయినాగాని వాడికి ఆకలి కావడం లేదు.

దూరంగా పెళ్లికొడుకును చాలా మంది కావలించుకొని ముబారక్ చెప్తున్నారు. సాయంత్రం జల్వా అట. ఆ తర్వాత?

విస్తరి ఎదురుగ్గా ఉంది.

కాని లేచి రేకు కుర్చీని కాలితో ఒక్క తన్ను తన్ని పరిగెత్తి పోతున్నాడు.

తల్లి గమనించింది.

'ఒరే... ఒరే... చచ్చినోడా'....

పరిగెత్తుకుంటూ వచ్చి జుట్టు పట్టుకుంది.

'తిను... తినేసి పో'

'నేను తినను పో'

'దెయ్యం పట్టిందేరా... దెయ్యం నా కొడకా'...

'నేను అన్నం తినట్లేదని పోయి జంషీద్ ఆపాకు చెప్పుపో'

నెత్తి మీద టప్‌మని ఒకటి కొట్టింది.

'పెళ్లి గడ్‌బడ్‌లో వాళ్లుంటే పోయి నీ వేషండాలు చెప్పమంటావా?'

'నేను తినను'.... కళ్లల్లో నుంచి గల్లుగల్లుమని ముత్యాలు రాలిపోతున్నాయి.

తల్లి అమితమైన శాంతం వహించింది హటాత్తుగా.

'రేయ్... పలావు... చల్లారితే బాగోదు... అయిపోతుందో ఏం పాడో. తిన్రా... నన్ను సతాయించక'...

విననట్టే నటించాడు.

కాని, ఒక్క ఉదుటున విడిపించుకొని పరిగెత్తాడు.

సాయంత్రమైంది.

తిరిగి తిరిగి ఇంటికి వస్తూ ఉంటే దూరంగా పెళ్లి ఇంటి బయట కుర్చీలెత్తి టైరు బండిలో వేస్తూ కనిపించారు. వాడు ఇంట్లోకి వెళ్లాడు. తల్లి పొయ్యి దగ్గర ఉంది. తండ్రి స్నానం చేసి టవల్ భుజాన వేసుకొని రేడియో ట్యూన్ చేస్తూ ఉన్నాడు. ఇద్దరూ వాణ్ణి చూశారు. ఏమీ అనలేదు. వాడు వంట గదిలోకి వెళ్లి, దబరలో మూతపెట్టి ఉంచిన పలావు తిని మొద్దు నిద్ర పోయాడు.

తెల్లారాక వాడికి పెళ్లి ఇంటివైపు వెళ్లబుద్ధి కాలేదు.

జంషీద్ ఆపా తమ్ముడు కనిపించాడు. ఏం అడగబుద్ధి కాలేదు. కాని వాడే చెప్పాడు. ఆపా రాత్రే వెళ్లిపోయిందనీ కారులో తీసుకెళ్లారనీ రెండు మూడు రోజుల్లో వచ్చేస్తుందనీ.

రెండు మూడు రోజులు గడిచాయి.

స్కూలు నుంచి రావడంతోటే తల్లి చెప్పింది.

'రేయ్... జంషీద్ వచ్చిందంట్రా'

'వచ్చిందా?'

ఒక్క నిమిషం కూడా ఆగలేదు. పరుగు తీశాడు.

గేటు తీసే ఉంది. తోసుకొని లోపలికి వెళ్లాడు. కాని లోపల వేరేగా ఉంది. ఎప్పుడూ సందడిగా ఉండే ఇల్లు చాలా మర్యాదగా ఉంది. వసారాలో పెళ్లికొడుకు కొత్త లుంగీ, కొత్త బనీను తొడుక్కుని వైరు మంచం మీద కూచుని ఉన్నాడు. పక్కన ఒక సాసర్‌లో పకోడి, ఇంకో సాసర్‌లో తీపి పెట్టి ఉన్నారు. సాయంత్రం పూట కొత్త పెళ్లికొడుక్కి అలా నాష్టా పెట్టాలి. అమ్మా నాన్నా మర్యాదగా అటూ ఇటూ తిరుగుతున్నారు. ఆపా లోపల ఉంది కాబోలు.

వసారా దగ్గరే నిలబడ్డాడు.

ఆపా మధ్యలో ఒకసారి వచ్చి నీళ్లు పెట్టి లోపలకి పోయింది. కొత్త చీర కట్టుకొని ఉంది. చాలా గాజులు పెట్టుకొని ఉంది. నడుస్తుంటే గాజులన్నీ శబ్దం చేస్తూ ఉన్నాయి.

కనిపించాననుకున్నాడు. చూసిందని కూడా అనుకున్నాడు. కాని పలకరించలేదు.

ఈలోపు రాత్రికి వండాల్సిన కూర కోసం బుట్ట కింద ఉన్న కోణ్ణి తీసి హలాల్ చేయించడానికి వీధిలోకి వెళ్లాడు ఆపా నాన్న. ఆపా అమ్మ కూడా బయటకు వచ్చింది.

ఇదే సందని పెళ్లికొడుకు ఆశ్చర్యంగా చూస్తూ ఉండగా లోపలికి పరిగెత్తాడు.

ఆపా అద్దం ముందు నిలుచుని జడ వేసుకుంటూ చేతులు కదిలిస్తూ ఉంది.

'ఆపా... ఆపా'...

'వహీద్'...

'ఆపా...'

'ష్.... నువ్విప్పుడు రాకూడదు. ఆయన ఉన్నారు. వెళ్లు'

'ఆపా'...

'నా బంగారూ... ఇదిగో...'

పక్కనే ఉన్న చిన్న పర్స్‌లో నుంచి పావలా తీసి ఇచ్చింది.

'ఆపా'...

'పద పద'...

పంపించేసి జడ వేసుకుంటూ ఉండిపోయింది.

వాడు తల ఒంచుకొని మెల్లగా అడుగులో అడుగు వేస్తూ బయటికి వచ్చాడు. వీధిలో ఆపా తమ్ముడు మసాలా కోసం టెంకాయలు కొనుక్కుని వస్తూ కనిపించాడు.

'రేయ్... మా అమ్మ చెప్పింది అబద్ధం అంటరా. ఆపా ఎప్పటికీ అక్కడే ఉండి పోతుందంటరా. రేపు వెళ్లిపోతుందంట'

వాడు అది ఊహించినట్టుగా తల ఊపాడు.

ఆ రాత్రి వాడు నిద్రపోలేదు. ఆపా మాటిమాటికి గుర్తుకు వస్తూ ఉంది. ఒకసారి ఆపా తన ఇంటికి వచ్చినప్పుడు తలస్నానం చేస్తూ ఉన్నాడు. బయటకు రాగానే–

'వహీద్... నేను తుడుస్తాను రా' అని కుర్చీలో కూచుని, 'నా బంగారూ' అని తలను దగ్గరకు తీసుకొని చాలాసేపు తుడిచింది. అలా వాణ్ణి అంత ప్రేమగా ఎవరూ తాకలేదు. అది గుర్తుకు వచ్చింది. ఆ వెంటనే ఏడుపు కూడా వచ్చింది. మంచం మీద కదులుతూ ఉన్నాడు.

'చచ్చినోడా... ఇంకన్నా పడుకోరా' పక్కనున్న తల్లి కసిరింది.

మరుసటి రోజు ఆపా వెళ్లిపోయింది.

ఆ తర్వాత మూడు నెలల పాటు ఫలానా జబ్బు అని తెలియకుండా వాడు తల్లిదండ్రుల్ని కిందా మీదా చేసేశాడు. వాడి తల్లి వంద మొక్కులు మొక్కుకుంది. తండ్రి ఎందుకైనా మంచిదని గ్యార్‌వీ చేయించాడు.

మూడు నెలలు గడిచాయి.

వాడు ఇదంతా మర్చిపోయి మళ్లీ ఆటల్లో చదువులో పడ్డాడు.

ఆ తర్వాత పెరిగి పెద్దవాడయ్యాడు. పెళ్లి చేసుకున్నాడు. పిల్లల్ని కూడా కన్నాడు.

ఇప్పుడు కూడా ఎప్పుడైనా భార్య మీద కోపం వచ్చినప్పుడు అన్నం మీద అలుగుతాడు.

అప్పుడు జంషీద్ ఆపా గుర్తుకు వస్తుంది.

అప్పుడు ఎందుకనో చాలా బాగుంటుంది.

ఏప్రిల్ 2, 2013.

# మచ్చ

‘ఏది... చూపించండి’ అంది లేడీ డాక్టర్.

ఆమె లేచి నిలబడి, లంగా బొందు కొంచెం వదులు చేసి, చీరనూ లంగానూ బొటనవేలితో కొంచెం కిందకు దించి వెనుక వైపు చూపించింది.

‘ఊ... కూచోండి’

ఆమె కూచుంది.

‘ఇంతకు ముందువి ఎలా ఉన్నాయ్?’

‘తగ్గలేదు... అలాగని పెరగలేదు. కొంచెం మాశాయి అంతే’

‘ఊ... ప్రమాదం ఏమీ కనిపించడం లేదు. కాని ఎందుకు వస్తున్నాయో అర్థం కావడం లేదు. ఇది మూడోది కదా’

‘అవును’

‘ఏడాదికి ఒకటి’

‘అవును’

‘అదీ వేసవి కాలంలో’

‘అవును’

‘సాధారణంగా చలికాలంలో ఇలాంటి స్కిన్ ప్రాబ్లమ్స్ కనిపిస్తాయి. చూద్దాం. మీరేం వర్రీ కాకండి. పాత మందులే. మళ్లీ రాస్తున్నా. కంటిన్యూ చేయండి’– రాసి ఇచ్చింది.

ఆమె బయటకు వచ్చేసింది. కూరగాయలు లేవు. ఆటో ఎక్కి రైతు బజారుకు వచ్చి ఒక్కొక్క కూరగాయా కొంది. చిక్కుడు, వంకాయ... కొనాలంటే ఈ మధ్య భయం వేస్తోంది. హైలీ అలెర్జిక్ అట. ఫ్రూట్స్‌లో పైనాపిల్ అని చెప్పున్నారు. అవి తప్ప అన్నీ కొంది. మళ్లీ ఆటో ఎక్కి ఇల్లు చేరుకుంది. భర్త అప్పటికే ఆఫీసు నుంచి వచ్చేసున్నాడు. పిల్లలిద్దరూ స్నానాలు చేసి నైట్ డ్రస్‌లు వేసుకొని టివి చూస్తున్నారు. చాలా సంతోషం ఏమిటంటే వాళ్లు చానల్స్ కోసం కొట్టుకోరు. అన్నయ్య ఏది పెడితే చెల్లి కూడా అదే. ఒకరు తొమ్మిది చదువుతున్నారు. ఒకరు ఎనిమిది.

ఆమె సరుకులన్నీ ఫ్రిజ్జు పక్కన నేల మీద పడేసి 'కాఫీ ఇవ్వనా' అంది భర్తతో.

'ఊ' అన్నాడతడు ల్యాప్‌టాప్‌లో పని చేసుకుంటూ.

వెళ్లి కాఫీ పెట్టింది. పెడుతూ రెండు క్యారెట్‌లు కడిగి, కొంచెం పీల్ చేసి పిల్లలిద్దరికీ ఇచ్చింది. తర్వాత తను స్నానానికి వెళ్లి, చేసి వచ్చాక, కాసేపు పూజగదిలో కూచొని, ఐదు నిమిషాలు, మళ్లీ వంటకు ఉపక్రమించింది.

మచ్చ రావడం గురించి ఆమెకు భయం లేదుగాని అది తగ్గకపోవడం గురించే భయంగా ఉంది. సరే, వచ్చినా నష్టం లేదు... రాకూడని చోట వస్తే? ముఖం మీద వస్తే? శ్రద్ధగా చేయలేక ఏదో చేశానని అనిపించి ముగించింది. తినడాలు అయ్యాయి. పిల్లలు పడుకోవడమూ అయ్యింది. భర్త పని ముగించుకొని వచ్చి పక్కన చేరాడు.

'స్నానం చేశారా?'

'ఇప్పుడా!'

'ఏమిటండి... పొద్దున నుంచి ఎంత మురికి. వెళ్లండి'

'నీకు ఈ మధ్య శుభ్రం ఎక్కువయ్యింది'

'సరే, వెళ్లండి'

వెళ్లి చేసి వచ్చాడు. ఆమె అతణ్ణి హత్తుకొని పడుకుంది.

అది ఇల్లేగాని నిన్న మొన్నటి వరకూ ఉదయం తొమ్మిది దాటితే పిట్ట ఉండేది కాదు. పిల్లలు స్కూళ్లకు వెళ్లిపోయేవారు. తను కాలేజీకి వెళ్లిపోయేది. భర్త ఆఫీసుకు. అలాగని తనది పర్మినెంట్ జాబ్ కాదు. పార్ట్‌టైమ్. రోజుకు రెండు క్లాసులు ఉండేవి. ఎప్పుడైనా మూడు. ఎంత లేదన్నా ఒంటిగంటా రెండుకల్లా ఇల్లు చేరుకునేది. నాలుక్కు పిల్లలు. ఏడుకు భర్త. కాని ఈ రెండేళ్లుగా ఉద్యోగం మానేసింది. ఎదుగూ బొదుగూ లేదు. అదీగాక పాఠాల మీద దృష్టి నిలవడం లేదు.

అందరూ వెళ్లిపోయాక ఇంట్లో ఒక్కతే మిగిలి ఉంది.

ఇల్లు సర్దుకుంది. తుడుచుకుంది. మాసిన బట్ట కనిపించకుండా వాషింగ్ మెషీన్‌లో పడేసింది. డోర్‌మ్యాట్‌లు దులుపుకుంది. అలర్జీలు గట్రా రాకుండా ఇల్లంతా నీట్‌గా ఉందో లేదో చూసుకుంది.

బెల్లు మోగింది.

వెళ్లి తలుపు తీసి ఒక్క క్షణం ఏం చేయాలో తోచనట్టుగా నిలుచుండిపోయింది.

పైఫ్లాట్ వాళ్ల అబ్బాయి... పక్కనే అతడి భార్య... నవ్వుతోంది.

'రండి.. రండి' జరిగి దారి ఇచ్చింది.

అబ్బాయి లోపలికి వచ్చి సోఫాలో కూచుని భార్యను తన పక్కన కూచోబెట్టు

కున్నాడు.

'అమ్మ మిమ్మల్ని కలిసి రమ్మని చెప్పింది ఆంటీ'

ఇద్దర్నీ చూసింది.

అమ్మాయి సిగ్గు పడుతూ కూచుని ఉంది. ఆమె కడుపు ఉబ్బెత్తుగా ఉంది.

'సిక్స్త్ మంత్' చెప్పాడు.

'చెన్నైలోనే కదా'

'అవునాంటీ. ఇద్దరం అక్కడే. తనిక డెలివరీకి వాళ్లూరు వెళుతోంది. సరే ఒకసారి కనపడి పోదామని వచ్చాం'

ఇద్దరూ స్నేహంగా పలకరింపుగా చూస్తున్నారు.

ఆమె– 'మంచిది' అని ఊరుకుంది.

అబ్బాయి కొంచెం ఇబ్బంది పడ్డాడు. అది గమనించి మరీ ఇబ్బంది పెట్టడం ఎందుకని లోపలికి వెళ్లి అమ్మాయికి మంచినీళ్లు తెచ్చి ఇచ్చింది.

'ఇంకేం ఆంటీ సంగతులు. మీరూ అమ్మా రోజూ కబుర్లు చెప్పుకుంటున్నారా?'

'మీ అమ్మా... అయ్యో వేగలేమయ్యా బాబూ' అంది.

పరిహాసం చేస్తున్నదేమో అన్నట్టుగా చూశాడు. ఆమె సీరియస్‌గానే ఉంది.

'బాల్కనీలో బట్టలు ఆరేయొద్దు అని లక్షసార్లు చెప్పాను. అదే పని చేస్తుంది. ఆ నీళ్లు మా బాల్కనీలో పడ్తున్నాయి. ఇంకో బాల్కనీలో మొక్కలు పెట్టి నీళ్లు పోస్తోంది. ఆ నీళ్లు కూడా మా దగ్గరే' తిట్టినట్టుగా అంది.

అమ్మాయి నీళ్లు తాగడం మానేసింది. అబ్బాయి చాలా ఇన్‌సల్ట్ ఫీలయ్యాడు.

'సరే ఆంటీ' లేచి నిలబడ్డాడు.

కడుపుతో ఉన్న ఆడపిల్ల వస్తే బొట్టు పెట్టడం, రవిక ముక్క పెట్టడం.... ఆ ఊసే లేనట్టు ఆమె మామూలుగా నిలబడి ఉంది.

వాళ్లు మళ్లీ పలకరింపుగా నవ్వి మెట్లు ఎక్కి వెళ్లిపోయారు.

ఆమె సోఫాలో కూలబడింది.

ఆ తర్వాత బెడ్‌రూమ్‌లోకి వెళ్లి అద్దానికి వీపు చూపిస్తూ తల వెనక్కు తిప్పి మచ్చను చూసుకొనే ప్రయత్నం చేసింది. సగం కనిపిస్తోంది. మొత్తం కనిపిస్తే తప్ప అది ఎంత పెద్దదో తెలియదు. వంట పొద్దున్నే అయిపోయింది గనుక మధ్యాహ్నం వరకూ అంటే... పుస్తకం తీసింది. భగవద్గీత. ఈ మధ్య భగవద్గీత తెగ చదవాలనిపిస్తోంది. దానిని ఒడిలో పెట్టుకొని మధ్య మధ్య ఆలోచనల్లోకి జారిపోతూ– ఏంటి మరీ ఇది చదివేంత ముసలిదాన్ని అయిపోయానా అని ఒక క్షణం కంగారు పడింది. కాని

ఇలాంటివి, రామాయణం, భారతం కూడా ఈ మధ్య చదవాలని అనిపిస్తున్నాయి. పిల్లలకి చెప్పొచ్చు. మన సంస్కారం కూడా మనకు తెలిసి రావాలి కదా.

సాయంత్రం పిల్లలు ఇంటికి వచ్చారు.

వాళ్ల కోసమని, వాళ్లను ఇంట్లోనే ఉంచి, దగ్గర్లో ఉన్న ఫుడ్ వరల్డ్‌లోకి వెళ్లింది. బిస్కట్ ప్యాకెట్స్, ఫ్రూట్ కేక్స్, పెట్ బాటిల్స్... ఫుడ్ వరల్డ్ పలుచగానే ఉంది. అక్కడిద్దరు... ఇక్కడ ముగ్గురు. బాస్కెట్ తీసుకొని కావలసినవి ఎంచుకుంటూ నడుస్తూ ఉంది. పక్కన ఎవరో కదిలినట్టయ్యింది. చురుగ్గా వెనక్కు తిరిగింది.

'మిస్టర్'... గావుకేక పెట్టింది.

అటువైపు తిరిగి ఏదో వెతుక్కుంటున్న వ్యక్తి అదిరిపడ్డాడు.

'మేనర్స్ లేదా మీకు? ఈజ్ దిస్ ద వే టు బిహేవ్ విత్ విమెన్'

అవతలి వ్యక్తి పూర్తిగా కంగారు పడ్డాడు. అందరూ ఇటే చూస్తున్నారు. మేనేజర్ దారి చేసుకుంటూ వేగంగా వచ్చాడు.

'ఏమైంది మేడమ్?

'చూడండి... రబ్ చేశాడు'

అవతలి వ్యక్తికి మాట రాలేదు.

'ఏం మిస్టర్?'

'ఏం చెప్తాడండీ.... నా వెనుక రబ్ చేసి ఏం ఎరగనట్టు అటు తిరగాడు. అరె... మర్యాదకరమైన ఆడవాళ్లు వచ్చే చోట కూడా జాగ్రత్తగా లేకపోతే ఎలా? తేరగా ఉన్నారా ఆడవాళ్లు? వచ్చి మీద పడిపోతారనా మీ ఉద్దేశం. ఆడది కనిపిస్తే చాలు మీద పడిపోవడమే. ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి. పరువూ మర్యాద కలిగిన కుటుంబాల నుంచి వస్తామండీ. బజారు మనుషులం కాదు ఊరికే ఉండటానికి'

అందరూ ఇటే చూస్తున్నారు.

ఆమె అందరివైపు చూసి తల ఎగరేసి కౌంటర్‌లో డబ్బు పడేసి బయటకు నడిచింది.

సాయంత్రం భర్త వచ్చాక జరిగింది చెప్పింది.

'పోనీ... వదిలేయ్... చిన్నదేగా' అన్నాడు భర్త.

'ఏం చిన్నదండీ... ఇలాగే ఉంటే శ్రుతి మించుతారు ఇడియట్స్. అందుకే బయటకెళ్లినా... ఇంట్లో ఉన్నా నా జాగ్రత్తలో నేనుంటాను. పాలవాణ్ణి... పేపర్ వాణ్ణి కూడా మనం నమ్మకూడదండీ... బయటి నుంచే పంపించేయాలి'

భర్త ఊ కొట్టాడు.

'అన్నట్టు పైఫ్లాట్ వాళ్ల అబ్బాయి వచ్చాడు భార్యను తీసుకొని. బ్లెస్సింగ్స్

కావాలట. నాలుగు దులిపి పంపించాను. వాళ్లతో మనకేం పనండీ'

భర్త ఊ కూడా కొట్టలేదు.

ఈలోపు పిల్లలు పరిగెత్తుకుంటూ వచ్చారు.

'మమ్మీ.... ఒన్ వీక్‌లో ఎగ్జామ్స్... ఒన్ వీక్‌లో అయిపోతాయి. ఈ సమ్మర్‌కి నువ్వు తాతయ్య వాళ్లూరు పంపించాలి'

'నో' అరిచింది.

అందరూ అదిరిపడ్డారు.

'సమ్మర్‌కు మీరెళ్లి... మధ్యలో క్యాంపులని ఈయన తిరిగి ఒక్కదాన్ని నేనుండలేను'

పిల్లలు చాలా చిరాకు పడిపోయారు.

'మూడేళ్లుగా నువ్వు పంపడం లేదు' ఏడుపు ముఖాలు పెట్టారు.

'ఇంకెప్పటికీ పంపను. మీరు నా దగ్గర ఉండాల్సిందే. వెళితే అందరం వెళదాం. లేకుంటే లేదు. అర్థమైందా' మళ్లీ పెద్దగా అరిచింది.

పిల్లలు అలిగి వాళ్ల రూమ్‌లోకి వెళ్లిపోయారు.

భర్త ఆమె వైపే చూశాడు.

ఆమె భర్త వైపు చూసింది.

'నీకీ మధ్య కోపం ఎక్కువైనట్టు అనిపించడం లేదూ?'

ఆమె హటాత్తుగా, అవును కదా అన్నట్టుగా స్తబ్దుగా అయిపోయింది.

'ఏంటోగా ఉంటున్నావ్. ఒకసారి డాక్టర్‌ని కలవరాదూ?'

ఆమెకు కన్నీళ్లు పొంగుకొచ్చాయి. గదిలోకి వెళ్లిపోయింది. సిక్స్ బై సిక్స్ బెడ్ అది. ఒకవైపు పడుకుంటే కిటికీలో నుంచి ఆకాశం కనపడుతుంది. ఒకోసారి అడ్డాలు దిడ్డాలు లేకపోతే శుభ్రంగా చంద్రుడు. ఆమె చంద్రుడి వైపే చూస్తూ ఉంది. ప్రశాంతంగా ఉన్నాడు.... మాటా పలుకూ లేనట్టుగా. ఎన్ని చూసుంటాడు ఈ భూతలం మీద సాక్షిగా. దేనికీ చలించడే!

మరుసటిరోజు సాయంత్రం మళ్లీ డాక్టర్‌ని కలిసింది. అదే డాక్టర్.

'మీరేదో స్ట్రెస్ పెట్టుకున్నట్టున్నారు'

'స్ట్రెస్సంటే... ప్రత్యేకంగా ఏమీ లేదు డాక్టర్'

'ఫైనాన్షియల్ ప్రాబ్లమ్స్'

'లేవు'

'మీ భర్త గురించి'

'నో నో... హి ఈజ్ వెరీ అఫెక్షనేట్'

'పిల్లలు స్కూల్‌కు వెళ్లడం రావడం... ఒక్కోసారి అది కూడా పని చేస్తుంది'

'లేదండీ'

'పోనీ... ఏదైనా గిల్ట్‌తో బాధపడుతున్నారేమో ఆలోచించండి'

రాసిన మందులు తీసుకొని క్లినిక్ నుంచి బయటపడింది. వేసవి సాయంత్రాల్లో ఎలా ఉంటాయో అలాగే ఉన్నాయి బజార్లు. ఎండ పూర్తిగా తగ్గినా వేడి అలాగే ఉండి ఉబ్బరింతగా ఉంది. ఒకచోట నిన్నటి పూలలా ఉంది, ఒక ముసలామె తీసి బుట్టల మీద సర్దుతోంది. మల్లెపూలు. వెళ్లి రెండు మూరలు కొంది. కాసింత అవతలనే చిన్న వినాయకుడి గుడి. వాటిని గుడి ముందు పెట్టి దండం పెట్టుకుంది. వినాయకుణ్ణే చూస్తూ ఒక నిమిషం నిలబడింది. వినాయకుడు కూడా ఆమెనే చూస్తూ.

ఆ తర్వాత చూస్తుండగనే పిల్లల పరీక్షలు వచ్చేశాయి. వాటిల్లో కొన్ని రోజులు మునిగిపోయింది. చదివించడం... రాయించడం.... ఆరోగ్యం పాడుకాకుండా జాగ్రత్తగా చూసుకోవడం.....

చివరి పరీక్షకు సాగనంపి, భర్త వెళ్లిపోయాక, తీరిగ్గా పేపర్ తిరగేస్తూ ఉంటే ఫోన్ మోగింది. ల్యాండ్ లైన్. ఎత్తింది.

'నేనాంటీ'...

ఒక్కక్షణం ఏం చేయాలో తోచనట్టుగా ఉండిపోయింది. ముఖం పాలిపోయింది. పెదాలు ఒణికాయి.

'ఐ యామ్ వెరీ సారీ ఆంటీ'...

ముద్దగా ఉండిపోయింది.

గొంతు పెగల్డం లేదు.

'దే..నికి?'

'అదే... మా అమ్మ చేసిన తప్పులకు... మీరు చెప్తుంటే నాకు బాధేసింది'

కుర్చీలో కూలబడింది. అవతలివైపు కుర్రాడు కూడబలుక్కుంటున్నాడు.

'మీరు... మనస్ఫూర్తిగా క్షమిస్తున్నారా?'

రిసీవర్ పట్టుకునే ఉంది. అడుగుతున్నాడు.

'క్షమిస్తున్నారా?'...

'అంత... ఏముందిలే'

'లేదాంటీ. నాకు అర్థమైంది. మీరు మనస్ఫూర్తిగా క్షమిస్తేనే నాకు సంతోషం. అన్నట్టు వాళ్లను ఇక్కడకు షిఫ్ట్ చేస్తున్నాను. చెన్నైకి.'

'చెన్నై..కా?'

'అవునాంటీ. ఇంక నా ఉద్యోగం ఇక్కడేగా. దాదాపు నేనిక్కడ సెటిలైనట్టే. వాళ్లు మాత్రం అక్కడ ఎందుకు? ఫ్లాట్ కూడా అమ్మేద్దామనుకుంటున్నాం'

సతమతం అయిపోతూ ఉంది.

'ఇంక హైద్రాబాద్‌తో తెగిపోయినట్టే ఆంటీ. ఎవరున్నారని? అంతా అయిపోయినట్టే'

'ఊ.... ఊ'....

'ఐ యామ్ వెరీ సారీ ఆంటీ... మిమ్మల్ని ఇబ్బంది పెట్టాను'...

ఆమెకు కన్నీళ్లు పొంగుతున్నాయి. ధారగా కారి వక్షం మీద పడుతున్నాయి. అవస్థ పడుతూ ఉంది. ఆమె అవస్థ అతడికి తెలుస్తూ ఉంది. ఆమె మాట్లాడింది.

'నా తప్పు కూడా ఉంది'...

'అదే'...

ఆమె ఏడుస్తూ ఉంది.

'ఎదుటివాళ్లనే కాదు ఆంటీ ఒక్కోసారి మనల్ని కూడా మనం క్షమించుకోవాలి... మనల్ని కూడా... మనస్ఫూర్తిగా.'

'ఊ.. ఊ'...

ఏడుస్తూనే ఉంది.

'ఉంటానాంటీ'.....

ఫోన్ పెట్టేశాడు.

ఆమె రిసీవర్ పెట్టేసి అలాగే కూలబడి చాలాసేపు ఏడ్చింది. ఉద్ధృతంగా. ఆ కన్నీళ్లు ఆమె హృదయాన్ని కడిగేస్తున్నాయా? అవి ఆమె దేహాన్ని క్షాళనం చేస్తున్నాయా?

వేసవి వెళ్లిపోయింది. స్కూళ్లూ కాలేజీలు తెరిచారు.

పిల్లలు స్కూళ్లకు వెళుతున్నారు. భర్త ఆఫీసుకు.

ఏమనుకుందో ఏమో మళ్లీ ఆమె ఉద్యోగంలో చేరింది. ఇప్పుడు పాఠాల మీద ఆమెకు దృష్టి నిలుస్తోంది. సబ్జెక్ట్ పుస్తకాలు తప్ప ఇతర పుస్తకాలు చదవబుద్ధి కావడం లేదు. శుభ్రత మీద పిచ్చి పోయింది. మార్కెట్లలో ఫుడ్‌వరల్డ్‌లలో ఎవరైనా నిజంగానే రాసుకున్నా ఆమెకేమీ అనిపించడం లేదు. కోపం తగ్గింది. వచ్చే సంవత్సరం పిల్లలను తప్పకుండా తాతయ్య ఊరికి పంపుతానని మాట కూడా ఇచ్చింది.

అన్నట్టు ఆ తర్వాత ఆమె ఒంటి మీద మచ్చలు రాలేదు.

ఏప్రిల్ 3, 2013

ఏకాభిప్రాయం...

'మేడమ్‌గారూ.... మేడమ్‌గారూ... ' స్కూటర్ ఆపి, ఒక కాలు కింద పెట్టి, పిలిచాడు.

ఎవరూ అన్నట్టుగా ఆమె కంగారుగా అటూ ఇటూ చూసింది.

'రండి.... నా స్కూటర్ మీద పోదాం' పిలిచాడు.

బస్‌షెల్టర్‌లో జనం పెద్దగా లేరు. పల్లెకు పోవాల్సిన బస్సు వస్తుందో రాదో గ్యారంటీ కూడా లేదు. ఇరవై కిలోమీటర్లు పోవాలి.

'రండి మేడమ్... ఆఫీసుకు టైమైపోవట్లేదా?' పిలిచాడు.

ఆమె స్థిరంగానే నిర్ణయం తీసుకుంది.

'వద్దులేండి సార్... ఏమనుకోకండి... బస్సులోనే వస్తా'

'అయ్యో... భలేగా ఉన్నారే మీరు... సరే' బయల్దేరాడు.

టౌన్ నుంచి అతడి ఆఫీసు కూడా ఇరవై కిలోమీటర్ల దూరంలోని పల్లెలోనే. రోజూ స్కూటర్ మీదే వెళ్లి స్కూటర్ మీదే వస్తాడు. కొత్తల్లో బస్సులో వెళ్లడానికి ప్రయత్నించాడు. నడుము విరిగిపోయింది. స్కూటర్ మీద సేఫ్ కూడా కాదు. లారీలు తిరుగుతుంటాయి. కాని ఇందులో సుఖం కూడా ఉంది. ఆఫీసులో ఆలస్యం అయినా కంగారు ఉండదు. స్కూటర్ ఉంది కదా.

ఎదురుగాలి కొడుతోంది. పై జేబులో సెల్ పెట్టుకొని నడుపుతున్నాడు. దారిలో పొలాలు ఉన్నాయి. కొన్ని చోట్ల టేకు తోటలు. కొన్ని చోట్ల జామాయిల్ తోటలు. కొన్నిచోట్ల అడపా దడపా కుందేళ్లు తిరుగాడేంత చిట్టడవి. టౌన్ నుంచి ఆ చుట్టుపక్కలంతా ఉదయం లేస్తే పల్లెలకు తిరిగే ఉద్యోగులు ఉన్నారు. టీచర్లు, రెవెన్యూ ఉద్యోగులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు... మగవాళ్లు... ఆడవాళ్లు....

ఆఫీసుకు చేరుకునే సరికి అప్పటికే నలుగురైదుగురు కాచుకొని ఉన్నారు. ఒకడు ముసలాయన.

'ఏం చెంచయ్యా'

ముసలాయన ఏం మాట్లాడలేదు.

'లోపలున్నోణ్ణి చెప్పు తీసుకొని కొట్టు. వాడు ఇస్తే కదా నేను ఇవ్వడానికి'

ముసలాయన నెత్తి గీరుకున్నాడు.

'వాడేం అడిగాడో ఇచ్చేస్తే పోతుంది గదా చెంచయ్యా'

మాసిన బట్టలు. చెప్పులు లేవు. ముసలాయన కాడలా ఉన్నాడు.

'సరే... ఉండు' అని టేబుల్ మీద కాగితం వెతికి లోపలికి వెళ్లాడు.

'సార్. మంచి బేరం వస్తే నేనే చెప్తాను. మీకెంత కావాలో అంత తిందురుగాని. ఇలా అణాకీ కాణికీ రైతుల్ని ఆపకండి. మీకేం లోపలుంటారు. వాళ్లు ఎండిన మొకాలేసుకొని నావైపు చూస్తున్నారు. సంతకం పెట్టండి'

'అది కాదు ఎంఆర్ఐ గారూ'

'పెట్టండి సార్'

'మీరు నాతో మిలాఖాత్ అయితే కదా'

'నేను కాను సార్. మీకేదైనా కావాలంటే మీరు చూసుకోండి. పేదోళ్లతో మాత్రం వద్దు. సంతకం పెట్టండి'

పెట్టేశాడు.

ఆ సాయంత్రం వరకూ ఇలాంటివే పనులు. ఆ మాటకొస్తే రోజూ ఇలాంటి పనులే.

ఆఫీసయ్యాక మళ్లీ స్కూటర్ మీద బయలుదేరాడు. దారిలో వెతికాడు. ఎవరైనా కనిపిస్తారా... లిఫ్ట్ ఇద్దామా అని. ఎవరూ కనిపించలేదు. టౌన్‌లోకి వచ్చేటప్పటికి దీపాలు వెలిగి అట్టహాసంగా ఉన్నాయి రోడ్లు. సమోసాల బండి... చికెన్ పకోడి బండి.... దోసెల బండి... జనం మూగి ఉన్నారు. సాయంత్రపు అల్పాహారం. సమోసాలు రెండు ప్యాకెట్లు కట్టించుకొని ఫ్రంట్ డిక్కీలో పెట్టుకున్నాడు. రోడ్డు దిగి సందుల్లోకి స్కూటర్ తిప్పేసరికి పరిచయస్తుడు పైన షాల్ కప్పుకొని నడుచుకుంటూ వస్తున్నాడు. స్కూటర్ ఆపాడు.

'ఏం సుబ్బారెడ్డి...'

'జ్వరంగా ఉంది. డాక్టర్ దగ్గరికి పోతున్నా'

'ఎవరి దగ్గరా?'

చెప్పాడు.

'వాడి దగ్గరికా? ఎదవ గాదా. నా బంధువే. కాదన్ను. కాని ఇంజెక్షన్ వేస్తే వాపు తగ్గడానికి మళ్లా ఏడాది తిరగాలి. ప్రబాకర్ నాయుడు దగ్గరకి పోకపోయా?'

'ఫీజు ఎక్కువ కదా'

'ఫీజు ఎక్కువైతే? పిచ్చాయన... భలే ఉన్నావే... పో...పో... ప్రబాకర్ నాయుడి దగ్గరకుపో'

స్కూటర్ స్టార్ట్ చేశాడు. ఇల్లు చేరేసరికి భార్య వంటగదిలో ఉంది. పిల్లలు స్నానానికి పోబోతూ డ్రాయర్లతో మంచం మీద గెంతుతున్నారు. తల్లీ తండ్రీ శివాలయంలో ఉండే టైము.

'వీళ్ల ప్రైవేటుకు పోరంటనా?' అడిగాడు.

'ఏదీ... వింటేగా' లోపలి నుంచి భార్య అంది.

పిల్లలు తండ్రిని చూసి ఇంకా ఉత్సాహంగా గెంతడం మొదలుపెట్టారు.

నవ్వుకుంటూ వాళ్లను తీసుకెళ్లి స్నానం చేయించి సమోసాలు పెట్టి ప్రైవేటులో దించి వచ్చాడు.

మరుసటి రోజు స్కూటర్ తీసుకొని ఆఫీసుకు బయలుదేరాడు. ఇంటి నుంచి బయలుదేరి టౌన్ వదిలేలోపు మూడు అడ్డాలున్నాయి ఉద్యోగులు బస్సు ఎక్కడానికి. ఒకచోట కాకపోతే ఒకచోటైనా ఎవరో ఒకరు కనపడతారు లిఫ్ట్ ఇవ్వడానికి.

రెండో అడ్డా మీద ఒకామె నిలుచుని ఉంది.

'మేడమ్ గారూ... మేడమ్‌గారూ...' స్కూటర్ ఆపి, కాలు కింద పెట్టి, పిలిచాడు.

ఆమె చూసింది.

'రండి... నా స్కూటర్ మీద వెళ్దురుగాని'

ఆమె మొహమాటంగా నవ్వింది. నిజానికి ఆమెకు టైమైపోయి చాలాసేపవుతోంది.

'వద్దులేండి సార్... మీకెందుకు శ్రమ'

'శ్రమేముంది... రండి మేడమ్'...

ఆమె అటూ ఇటూ చూసి ఇబ్బంది పడుతూనే వచ్చి బిగుసుకుని కూచుంది. స్కూటర్ స్టార్ట్ చేశాడు. ఎదురుగాలి షరామామూలుగా ఉంది. ఇరవై కిలోమీటర్లంటే కాస్తో కూస్తో మాటలు నడవాలి.

'ఏం తెచ్చారు మేడమ్ బాక్సు'...

'ఆ... ఏదో ఒకటి'

'అంతేలేండి... ఉదయాన్నే లేచి ఒండుకొని ఉద్యోగం కూడా చేయాలంటే'...

ఆమె ఏమీ మాట్లాడలేదు.

'మీ సారు పర్లేదా... ఏమైనా సాయం చేస్తాడా?'

ఆమె ఏమీ మాట్లాడలేదు.

'ఏంటోలేండి... సుఖం లేకుండా తయారయ్యింది బతుకు'

'సార్... మీకు పుణ్యం ఉంటుంది. తొందరగా పదండి. అవతల నాకు టైమైపోయింది'

బిగుసుకొని కూచుంది.

స్కూటర్ నడపడం మీదే దృష్టి పెట్టి, మధ్యలో ఆమె దిగాల్సిన చోట దింపేసి ఆఫీసుకు వచ్చేశాడు. అప్పటికే తాసిల్దారు జీప్ స్టార్ట్ చేసుకుని పటాలంతో పోబోతూ ఉన్నాడు.

'ఎక్కడికి సార్?'

'పంచనామా... రండి'

చావు మామూల్దైతే పర్లేదు. కిరికిరి ఉంటే మంచి డబ్బు.

'వద్దు సార్. మీరు పదండి. నేనలా రేషన్ షాపులు చూసుకొని వస్తా'

జీపు వెళ్లిపోయింది. రేషన్ షాపులు అంటాడుగాని సాధారణంగా అతడు ఒకే ఒక రేషన్ షాపుకు వెళతాడు. అతడు వెళ్లేటప్పటికి ఆమె ఉంది. చూసి పలకరింపుగా నవ్వి కుర్చీ వాల్చింది. నివాసం ఉన్న పెంకుటింట్లోనే షాపు. కిరోసిన్ డ్రమ్ములు, పామాయిల్, చక్కెర, సాల్ట్, ఒకవైపుగా వాలి మరోవైపు తేలిగ్గా ఉన్న కాటా.

'ఎలా ఉన్నావమ్మా?'

'ఏదో మీ దయ సార్' ఆమె దండం పెట్టింది.

నిజానికి ఆమెకు ఆ డీలర్‌షిప్ నిలబడటం తన దయే. భర్త చనిపోయాడు. చనిపోతే వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి ఇంకొకరికి డీలర్ షిప్ ఇవ్వొచ్చు. కాని విడో కదా పాపం బిడ్డలు గలది బతకద్దని.

'నాదేముందమ్మా. అంతా ఆ దేవుడి దయ. నువ్వు బాగుంటే నాకదే సంతోషం.'

ఆమె తలాడించింది.

'పిల్లలు బాగా చదువుకుంటున్నారా?'

‘చదువుకుంటున్నారు సార్’.

‘ఇంకేం వాళ్ళు దారిలో పడ్డట్టే. కాస్త మంచినీళ్లు ఉంటే ఇవ్వు’

ఆమె లోపలికెళ్లి భక్తిగా, శ్రద్ధగా మజ్జిగ చేసుకొని తెచ్చి ఇచ్చింది.

ఒక గుక్క తాగాడు.

‘ఈకాలం పిల్లలకు చెప్పే పనే లేదు. ఇంక నువ్వు కూడా నీ సంతోషం చూసుకోవాల’

ఆమె తల దించుకుంది.

‘ఏం... నీ సంతోషం నువ్వు చూసుకోవా?’....

ఆమె తల దించుకునే ఉంది.

‘ఎన్నో అనుకుంటాం. అంతలోనే అరే దేవుడు ఇంత పని చేశాడే అని బాధపడతాం. కొన్నాళ్లకు సర్దుకొని సరే ఇది కూడా ఒక దారే అనుకొని ముందుకు పోవాల.’

‘ఏం?’

‘నాకు ఏ ఆశా లేదు సార్’

‘అలా అంటే ఎలాగమ్మా’

‘ఆయన జ్ఞాపకాలతోనే బతుకుతున్నా సార్. పడగ్గదిలో కూడా ఆయన ఫొటోనే పెద్దదిగా తగిలించుకుని ఇంకో ఆలోచనే రాకూడదని బతుకుతున్నా. ఇంకో ఆలోచన వచ్చిందా... ఒకరోజుతో పోదు కదా. ఏమంటారు... నిజమా... అబద్ధమా?’

‘నేను చెప్పేది అదే. ఇంకో ఆలోచన రాకుండా మనం చూసుకోవాల. అందులోనే మన సంతోషం వెతుక్కోవాల. మంచిది’

‘మంచిది సార్’

స్కూటర్ వేసుకొని ఆఫీసుకు వచ్చేశాడు. ఆ సాయంత్రం టౌన్‌లో ట్రావెల్ ఏజెంట్ దగ్గరకు వెళ్లాడు. ట్రావెల్ ఏజెంటంటే ట్రావెల్ ఏజెంట్ కాదు, అతడొక భోజన హోటల్ నడుపుతూ సంవత్సరానికి రెండుసార్లు తీర్థయాత్రలు నిర్వహిస్తుంటాడు. అతడి దగ్గరకు వెళ్లి మరో రెండు వారాల్లో ఏర్పాటైన కాశీయాత్రకు డబ్బులిచ్చి రెండు సీట్లు బుక్ చేసుకున్నాడు– తల్లిదండ్రుల కోసం. ఇంటికి వచ్చి ఆ సంగతి చెప్పేసరికి భార్యకు ఇంత పొడుగు వచ్చింది కోపం.

‘ఇప్పుడేం అంత డబ్బు ఖర్చు పెట్టాలా? శివాలయంలో ఉండే శివుడు చాలడట్నా మీ అమ్మా బాబులకూ’

ఆమెకు కోపం పెరిగిపోయింది.

'చీటికిమాటికి లగెత్తుతాపోయి బలే ఖర్చుపెడుతున్నావే డబ్బు... ఏం మూల్గ తుందనా '

'నువ్వు నోర్మూయ్'

'మూస్తా మూస్తా. నువ్వు నా మాటెప్పుడు విన్నావులే'

'పెళ్లాం చెప్పినట్టు వినే ఆడంగోణ్ణి కాదు'

'నేనేం చెడ్డ చెప్పానా?'

'మంచి చెప్తే నేను కాదంటానా? ముసలాళ్లకు ఆ మాత్రం సంతోషం ఇవ్వక్కర్లేదా మనం. ఎప్పట్నించి అడుగుతున్నారు?'

భార్య ఇంకేం మాట్లాడలేదు. అతడు వినే రకం కాదు.

మరుసటి రోజు యథావిధిగా స్కూటర్ తీసుకొని బయలుదేరాడు.

ఎండ పెద్దగా లేదు. రాత్రి కొత్త పోస్టర్లు వేసినట్టుంది గోడలన్నీ డబ్బింగ్ సినిమా ముఖాలతో అలుక్కుపోయి ఉన్నాయి. మొదటి అడ్డా చూశాడు. ఎవరూ లేరు. రెండో అడ్డా చూశాడు. ఒకామె నిలుచుని ఉంది. తెలిసిన ముఖమే.

'మేడమ్‌గారూ... మేడమ్‌గారూ' స్కూటర్ ఆపి, కాలు కింద పెట్టి, పిలిచాడు.

ఆమె చూసింది. పలకరింపుగా నవ్వింది.

'రండి నా స్కూటర్ మీద వెళదాము' పిలిచాడు.

ఆమె పెద్దగా ఆలోచించకుండా నేరుగా వచ్చి కూచుంది.

'బతికించారు సార్. నేను వచ్చేసరికి బస్సు పోయింది. ఎలారా అనుకుంటూ నిలుచుంటే'

'దాన్దేముంది మేడమ్'....

స్కూటర్ గేర్ మార్చి గుంతల్ని తప్పించుకుంటూ టౌన్ దాటుతున్నాడు.

'బాక్స్ తెచ్చుకున్నారా?'

'లేదండీ'

'అయ్యో. మధ్యాహ్నం ఏం తింటారు?'

'ఏవో నాలుగు బిస్కెట్లు తిని సోడా తాగుతా'

'అయ్యో. ఇలా చేస్తే ఎలాగండీ. ఆరోగ్యం పాడైపోదూ'...

'ఏం చేస్తాం సార్. ఉదయాన్నే లేచి పిల్లలకి కావలిసినవి చూసి బయల్దేరడమే సరిపోతోంది. ఇంక వంట కూడా అంటే ఒకోరోజు సాధ్యం కాదు...'

‘ఇవాళ వాళ్లేం తింటారు?’

‘బంధువుల ఇల్లు దగ్గరే లేండి. మధ్యాహ్నం వెళ్లి తినమన్నాను’

‘ఏం బతుకులో ఏమిటో. ఆడవాళ్లకు అన్నీ కష్టాలే’

‘ఏం చేస్తాం సార్. డబ్బులు కావాలి కదా. కాలు మీద కాలు వేసుకొని కూచునే బతుకులా మనవి’

‘బాగా చెప్పారు’

‘మీరు తెచ్చుకున్నారా?’

‘లేదండీ’

‘అదేం?’

‘మా ఆవిడకు పని తెమలదు. నాకు ఆలస్యం నచ్చదు. మా ఆఫీస్ దగ్గర చిన్న హోటల్ ఉంది. దాన్లోనే’...

‘బాగుంది సంబడం. మగాళ్లని చూసుకోనక్కర్లేదటండీ’

‘ఇలాగే ఉంటాయిలేండి కాపురాలు’

టౌను దాటారు. ఎదురుగాలి నాగా లేకుండా వీస్తూనే ఉంది. అతడి జుట్టు గాలికి పైకి లేచినా అందులో ఏదో వయ్యారం ఉంది. ఆమె పవిట గాలికి రెపరెపలాడుతూ ఉంది.

‘మీ సారు పర్లేదా మేడంగారూ. సాయం చేస్తాడా. వంటా గింటా...’

‘అయ్యో రామా. అంత ప్రాప్తం కూడానా’

‘తెలుసుకోరండీ మగవాళ్లు. కొంచెం సాయం చేస్తే ఆడవాళ్లకు అదే పెద్ద సంతోషం’

‘చెప్పి చెప్పి విసిగిపోయానండీ బాబూ’

‘వినరు కదా’

‘అస్సలు’

‘చూశారా. ఇలాంటి చిన్న చిన్న విషయాలే లోలోపల పేరుకుపోతాయండీ. ఏమంటారు?’

‘ఆడవాళ్లం కదా సార్. అన్నీ నోరు తెరిచి చెప్తామా?’

‘నాకు అర్థమైంది లేండి. మందూ గిందూ?’

‘పెద్దగా లేదు. ఏ మాటకా మాట చెప్పుకోవాలి. వారానికి ఒక్కసారి. అదీ ఆదివారం’

'నేనస్సలు ముట్టనండీ'

'ఔనా?'

'నిజం.'

'మేలే'

'ఏమండీ... ఉన్నదే ఒక్క ఆదివారం. ఆ ఒక్కరోజైనా పెళ్లాం బిడ్డలతో గడపాలి కదా. మీ వారైనా... మీరూ ఆఫీసుకు వెళ్తారు... ఆయనా ఆఫీసుకు వెళ్తారు... ఆదివారం ఒక్కరోజైనా మీతో సరదాగా ఉండకపోతే ఎలా?'

'ఏం చెప్తామండీ. వాళ్లకు వాళ్లు తెలుసుకోవాలి'

'బాగా చెప్పారు'....

పత్రా... బీడూ అలాంటిది పోయి జామాయిల్ తోటలు మొదలయ్యాయి. తోటల్లో చెట్లు వరుసగా నిలబడి గాలికి మెల్లగా తలలు ఆడిస్తున్నాయి.

'పోనీ సినిమాకూ షికార్లకూ తీసుకుపోతాడా?'

'ఏదోలేండి... ఒకటి అరా'

'చూశారా... ఇంక అసంతృప్తి కలగదంటే కలగదండీ...?'

ఆమె మౌనంగా ఉంది.

'అందుకే ఇలాంటివి ముదిరి సంబంధాలు కూడా పెట్టుకుంటున్నారండీ. '

'మీరూరుకోండి సార్'

'నిజమండీ'...

'మరీ'...

'అయ్యో. పేపర్లలో ఎన్ని చదవడం లేదు'

ఆమె కాసేపు ఊరికే ఉండి అంది.

'అవేం అంత సులువా సార్. ఆడవాళ్లకి. ఒక్కసారి తగులుకుంటే అదో పెద్ద బంక'

'ఛ. అలా కాదండీ. మనిషిని గమనించుకోవాలి. ఎలాంటి వాడో చూసుకోవాలి. ఒరే బాబూ ఎప్పుడైనా ఒకసారి అరసారి... మళ్లీ నా జోలికి రాకూడదు... అని చెప్పుకోవాలి. ఆ మాటకొస్తే మగవాళ్లు కూడా అంతే కదండీ. ఒకసారో రెండు సార్లో.... అదే పనిగా ఉంటే కాపురాలు కూలిపోవటండీ'

'మీరు బలే తేలిగ్గా చెప్పేస్తున్నారు సార్'

'ఇందులో పెద్ద పర్వతాలు మోసేది ఏముందండీ. గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోవాలి. ఆ తర్వాత మర్చిపోవాలి. ఒకవేళ రేపో మాపో ఎదురుపడినా నమస్తే సార్.... నమస్తే మేడమ్ అని ఏమీ ఎరగనట్టుగా మన పనిలో మనం వెళ్లిపోవాలి. అంతే. బస్'....

ఆమె మౌనంగా ఉండిపోయింది.

టేకు తోటలు కూడా వెళ్లిపోయాయి.

ఒకటీ ఒకటిన్నర మైలుండే చిట్టడవి.

చిన్న మబ్బుతునక ఏదో అడ్డు వచ్చి ఉండాలి... సూర్యుడు కాసింత మసక బారాడు. గాలి బాగుంది. చల్లగా వీస్తున్నట్టే అని ఇద్దరికీ అనిపించింది. అతడు స్కూటర్ నడుపుతున్నాడు. గతుకులకు ఆమె తేలిగ్గా ఎగిరెగిరి పడుతోంది.

చిట్టడవి ఒకచోట ఇంకాస్త చిక్కనవుతుంది.

అతడు స్కూటర్ కాస్త స్లో చేస్తున్నట్టుగా కనిపించాడు.

ఆమె అభ్యంతరం చెప్పకుండా అలాగే ఉంది.

మరి కాస్త స్లో చేశాడు.

ఆమె అలాగే ఉంది.

ఇక పూర్తిగా స్లో చేసి పక్కకు ఆపుకుంటూ– 'ఇక్కడ కాసేపు రెస్ట్ తీసుకొని పోదామండీ మేడమ్‌గారూ' అని అతడు అన్నాడు.

'మీరు బలేటోళ్లు సార్' అని ఆమె అంది.

మొత్తం మీద అతడికి ఏకాభిప్రాయం ఉన్న విషయం పట్ల ఆమెకు ఏకాభిప్రాయం కుదిరి స్కూటర్ చిట్టడవిలోకి దారి తీసింది.

ఏప్రిల్ 5, 2013

# పట్టాయ...

'పోయే బోడిముండా' అన్నాడు నాయుడు ముద్దుముద్దుగా.

'తాంకూ... తాంకూ' అని నవ్విందది.

నల్లగా ఉంది. పెదాలకు టొమాటో కలర్ లిప్‌స్టిక్ రాసుకొని ఉంది. పొట్ట కనిపించని నడుము. కింద కూసుగా ఎగుడు దిగుడుగా ఉన్న కాఫీకలర్ స్కర్ట్. టాన్ చేసిన కాళ్లు. శాండల్స్. గోళ్లకు ఆకుపచ్చ పాలిష్. నాయుడి వైపే చూస్తూ ఉంది.

'పోయే బోడిముండా' అన్నాడు నాయుడు ఈసారి ఇంకా ముద్దుముద్దుగా పెదాలు రెండూ ముందుకు చేర్చి.

దానికేదో అర్థమైనట్టయ్యి, అక్కణ్ణుంచి కదిలి, గిట్టుబాటు కాకుండా పోతుందా అన్నట్టుగా చూస్తూ, వెళ్లి మూలనున్న బార్‌స్టూల్ మీద కూచుంది.

నాయుడు దాన్నే చూస్తూ, పక్కకు తిరిగి– 'అరె ముచ్చు మూర్తి... దీనికో ఐదు పదులు ఉండవట్రా.... మనల్ని తగులుకుంది ముసల్ది' అన్నాడు వికారంగా.

ముచ్చు మూర్తి ఏం మాట్లాడలేదు. గ్లాసులో సెవనప్ పోసుకొని కూచుని ఉన్నాడు. తాగడు. అలాగని అనుకుంటాడు. చూడ్డు. అలాగని అనుకుంటాడు.

నాయుడు ఇంకా వికారం పడి 'నీతో లాబం లేదురా యెదవా... బావా... బుద్ధుడా... దీన్తో పోతే అదే పోత గదా పైకి' అన్నాడు బిగ్గరగా నవ్వి, బల్ల చరిచి, అటూ ఇటూ తిరిగి బుద్ధుడి కోసం వెతుకుతూ.

బుద్ధుడు లేడు. దూరంగా హాఫ్ ప్యాంట్స్ వేసుకొని, ఒక చేతిలో ఐ ప్యాడ్ పట్టుకొని, ఇంకో చేతిని భుజానికి ఉన్న బ్యాగ్ మీద భద్రంగా వేసి, రెస్ట్‌రూమ్‌లోకి పోతూ కనిపించాడు.

నాయుడు డల్ అయిపోయాడు.

'ఏంట్రా... మళ్లీనా?' అన్నాడు.

ముచ్చు మూర్తి  ఏం మాట్లాడలేదు.

'ఇందాకే కర్రా రౌండేశాడు'

ముచ్చు మూర్తి ఏం మాట్లాడలేదు.

నాయుడికి కోపం వచ్చేసింది.

'వొద్దురా... ఆ పంజాబీముండ దగ్గర పాలక్ పనీర్ తినొద్దురా అని చిలక్కి చెప్పినట్టు చెప్పాను. విన్నాడా. జన్మలో ఎరగనట్టుగా ప్లేటంతా నాకేశాడు. ఇప్పుడు చూడు. కొట్టేసింది. దేశం కాని దేశం. ఎప్పటికాగాలి గనక' అన్నాడు.

ముచ్చు మూర్తి ఏం మాట్లాడకుండా అలానే చూస్తూ ఉన్నాడు.

'మాట్లాడవేంట్రా యెదవా. అసలే నసనసగా వచ్చాడు మన్తో. ఇప్పుడు ఇది కూడా అంటే సతాయించేస్తాడు కొడుకు' అన్నాడు.

కాఫీకలర్ స్కర్ట్‌ది లేచి, వయ్యారంగా అటూ ఇటూ నడిచి, మళ్లీ స్టూల్ మీద కూచుంది నాయుణ్ణి ఎక్కుపెట్టి.

ఈలోపు పక్కనున్న ఇంకో ఓపెన్ బీర్‌బార్ నుంచి గోల మొదలైపోయింది. పార్టీ బ్యాండ్. ఎవడో ఒక కోడితురాయి కుర్రాడు మైక్ ముందు నిలబడి, భుజానికి వేలాడుతున్న గిటార్‌ని మీటుతూ, అరుస్తూ, ఎగుర్తూ పాడేస్తున్నాడు థాయ్‌లో. తోడుగా ఇంకొకడు. జతగా డ్రమ్స్. జుట్టు ఇరుపాయలుగా ముందుకు వేసుకున్న పిల్ల ఒకతి స్టేజ్ మీద అటూ ఇటూ గెంతుతూ రెండు చేతుల్తో చప్పట్లకు సైగ చేస్తూ హుషారు పరుస్తోంది అందరినీ. వాళ్ల  మోతకి హోరుకి స్టేజ్ మీదా బార్ లోపలా అంతా గోల. దానికి తోడు లైట్స్.  బ్లిజార్డ్స్. ఏదీ సరిగ్గా కనిపించని ఎరుపు.

నాయుడు ఒక నిమిషం ఆ గోలకు అసహనంగా కదిలాడు.

అంతలోనే సర్దుకుని, తన్మయుడవుతూ– 'ఆహా ఏం పాడుతున్నార్రా...  ఓహో ఎంత గొప్ప మీనింగు' అన్నాడు.

ముచ్చు మూర్తికి అనుమానం వచ్చింది.

'ఏంటి... వాళ్లు పాడుతున్నది నీకర్థమవుతోందా?'

'ఓ'

'ఏంటో చెప్పూ'

పడ్డాడు. నాయుడు ముచ్చు మూర్తి వైపే చూసి నవ్వి, బకార్డిని ఒక్క గుక్క వేసి, ఇప్పుడు చూడు అన్నట్టుగా చేతులు రుద్దుకొని, పెద్దగా, అరిచినట్టుగా–

'నీయబ్బా... నా కొడకల్లారా... మా దేశం వచ్చార్రా... దొబ్బిడాయికీ' పాడాడు.

ముచ్చు మూర్తి ఏం మాట్లాడలేదు.

కిక్కురుమనకుండా సెవనప్ ఇంకో గుక్క వేసి పుక్కిట పట్టాడు.

పక్కన బ్యాండ్ గోల పెరిగింది. ఇటు కాఫీకలర్ది వదల్డం లేదు. నాయుడు రెంటినీ కాచుకునేలోపు పులి మీద పుట్రలా బుద్ధుడు వచ్చాడు.

'ఏంటి.. పోదామా... రూమ్‌కి' అన్నాడు కొంచెం నీరసంగా.

నాయుడు గతుక్కుమన్నాడు.

'ఏం నాయుడూ?'

లేచి కుక్కలా పడ్డాడు.

'ఏం మాట్లాడుతున్నావ్ బుద్ధుడూ ఏం మాట్లాడుతున్నావ్? పదిహేన్రోజులైనా ఉందామనుకున్నానిక్కడ. ఆఫ్ట్రాల్ మూడ్రోజుల ప్యాకేజీ మాట్లాడావు. పొద్దున దిగాము. ఈ ఊళ్లో పగటిపూట ఏ బొంగూ ఉండదని మధ్యాహ్నం పరోటాలు తినిపించి ఉత్తపుణ్యానికి బొబ్బోపెట్టావు. సాయంత్రం షో అన్నావు. అమ్మాయిలూ అబ్బాయిలూ లైవ్‌లో డాం డూం డుస్కే అన్నావు. దాన్సంగతీ తేల్చలా. ఇప్పుడు తీసుకొచ్చి ఈ దిక్కుమాలిన బార్‌లో కూచోబెట్టావు. కూచున్నామో లేదో అప్పుడే పదమంటున్నావు. ఏంటి నీ ఉద్దేశం? ఇలా అయితే ఎందుకొచ్చినట్టు. ఎందుకెళ్లినట్టు. డివిడి ఏస్కుంటే పోతుంది' ఎర్రగా అయిపోయాడు. ఏడుస్తాడేమో అని డౌట్ కూడా వచ్చేస్తుంది.

నాయుడు ఇంత గోల చేసినా ముచ్చు మూర్తి ఒక్క మాటా మాట్లాడలేదు. ఎవరివైపూ చూళ్లేదు. సెవనప్ ఉంది ముచ్చు మూర్తి ఉన్నాడు.

బుద్ధుడు నాయుడి వైపే చూశాడు.

నిజానికి అప్పుడప్పుడే ఊరు నిజమైన రాత్రికి సిద్ధమవుతూ ఉంది. మధ్యాహ్నం ఎండకి రూముల్లోనే ఇరుక్కుపోయిన టూరిస్టులందరూ చీమల్లాగా బయటపడి రోడ్డంతా నిండిపోతూ ఉన్నారు. సముద్రంగాలి కూడా అందుకు తగినట్టుగానే సహకరిస్తూ చల్లగా మారి వీస్తూ ఉంది. రోడ్డు మీద ఎటుచూసినా మనుషులు. రకరకాల దేశాల వాళ్లు. రకరకాల ఆకారాల వాళ్లు. రకరకాల వయసుల వాళ్లు. రకరకాల రంగులవాళ్లు. తెల్లాళ్లు. నల్లాళ్లు. చైనీస్. వియత్నామీస్. అరబ్బులు. ఇండియన్లు. దక్షిణాదివాళ్లు. ఒకటే పోలిక... మగాళ్లు.

బార్‌లోకి చూశాడు.

కౌంటర్ దగ్గర ఇంతకు ముందు కంటే బార్‌గర్ల్సు పెరిగారు. సందడి హెచ్చింది.

ఎర్రగౌన్లు... పచ్చగౌన్లు... నల్లగౌన్లు... జీన్స్ అండ్ టీ షర్ట్స్... యెంగ్... ఏజ్డ్... థిన్... ఫ్యాటీ....

నాయుడు వాళ్లవైపే కళ్లు యింతింత చేసుకుని బుద్ధుడి వైపు బతిమిలాడు తున్నట్టుగా చూశాడు.

'సరే ఏడు'

నాయుడు రిలాక్సయిపోయాడు.

'అలా అన్నావు బాగుంది. మా మంచి మాటన్నావు బాగుంది. ఏమైనా నువ్వు నా బావవి. బంగారు బావవి. ఇంకో బకార్డి' హుషారుగా ఆర్డరిచ్చాడు.

'అలా ఆర్డరిస్తే సగం పోసి సగం నీళ్లు కలుపుతారు. అటే చూడు'

'మాక్కూడా తెలుసులేవో. మావూ ఒకటీ అరా నెట్‌లో చదివాం. ఖర్మగాలి నువ్వు ముందొక సారొచ్చావు. మాకిదే ఫస్ట్ టైమ్'

'వచ్చాను కాబట్టే ఇప్పుడు రానని చెప్పాను'.

'సరే'

'వచ్చే దాకా చంపావ్'

'సరే... సరే'

నాయుడు తల తిప్పేసుకున్నాడు.

ఎందుకంటే ఆ ప్రస్తావన వస్తే బుద్ధుడు తిట్లు అందుకుంటాడు.

నిజానికి బుద్ధుడికి హైద్రాబాద్‌లో చచ్చేన్ని పనులున్నాయి. అతడేం పని చేస్తాడో ఏం అవసరం గాని అతడికి హైద్రాబాద్‌లో చచ్చేన్ని పనులులైతే ఉన్నాయి. అదొక కోపం. వచ్చాక రెస్ట్‌రూమ్. ఇదొక కోపం. నాయుడు ఇంతకు మునుపు తిరుపతిలో ఒక ధార్మిక ట్రస్ట్‌లో మేనేజర్‌గా పని చేశాడు. విజయవాడలో ఒక ఆఫ్‌సెట్ ప్రెస్ కొన్నాళ్లు నడిపి ఎత్తేశాడు. కరీంనగర్‌లో బిఇడి కాలేజ్ పెట్టడానికి దాదాపుగా ఫైనల్ స్టేజ్ వరకూ వచ్చాడు. కర్నూలులో అతడు చాలామందికి తెలుసు. హైద్రాబాద్‌లో సరేసరి. ముచ్చు మూర్తి సత్రకాయ.

ఈ ట్రిప్పంతా ప్లాన్ చేసింది నాయుడే. చార్జీలన్నీ చాలా వరకు లాగాడు. ఒక్కడిగా రావాలంటే భయం. తోడుగా ఇద్దరు. నిజానికి ఆ ఇద్దరిలో ఒకరు బుద్ధుడు కాకుండా ఉంటే నాయుడి ప్రాణం సుఖంగా ఉండేది. వచ్చినప్పటి నుంచి బుద్ధుడు సతాయిం చేస్తున్నాడు. ఎక్కడికీ కదల్నివ్వడం లేదు. మధ్యాహ్నం లంచ్ చేసి వచ్చాక బుద్ధుడికి కునుకు పట్టడం గమనించి ఇదే సందని మసాజ్ కోసం వెతికాడు నాయుడు ముచ్చు మూర్తిని తోడు తీసుకొని రోడ్ల వెంట పడి.

‘మసాజ్ అంటే మాలీషేనా’ అడిగాడు ముచ్చు మూర్తి పక్కనే నడుస్తూ.

‘అది వేరు’

‘ఇది?’

‘చెప్తా’

ముచ్చుకు కొంత అర్థమైంది.

‘బట్టలు తీసేయాలా?’

‘అవును. నువ్వయితే లోపలికెళ్లాక చీర కట్టుకోవాలి’

ముచ్చు ఏం మాట్లాడలేదు. రోడ్డులో చాలామటుకు ఫుట్ మసాజ్ సెంటర్స్ కనిపించాయి. షట్టర్స్ బయటే వరుసగా చెయిర్స్ వేసి టీషర్ట్స్ వేసుకొన్న అమ్మాయిలు కింద కూచుని మసాజ్ చేస్తూ కనిపించారు. కొందరమ్మాయిలు పరుపుల మీద చేరగిలపడి ఒళ్లో టూరిస్టుల తలలు పెట్టుకొని కణతలు నొక్కుతూ హెడ్ మసాజ్‌లు చేస్తూ ఉన్నారు. కొన్నిచోట్ల బాడీ మసాజ్ బోర్డ్‌లున్నాయి.

‘బాడీ మసాజ్?’ ఆగి అడిగాడు.

‘త్రీ హండ్రెడ్ బాత్స్’

‘అంటే ఎంత?’ ముచ్చు మూర్తి అడిగాడు.

‘ఆరొందలు’

‘చీపే’

‘మనక్కావల్సింది ఇది కాదు’

షట్టర్‌లోకి ఒక అడుగు ముందుకేసి, తొంగి చూసి– ‘బాడీ టు బాడీ?’ ఆరా తీశాడు.

‘వాత్?’

‘ఓ... నీకర్థమై చావదు కదూ... బాదీ తు బాదీ... శాండ్‌విచ్ మసాజ్?’

అవతలివైపు చాలాసేపు మాట్లాడినట్టుగా అనిపించింది.

‘తిడుతోంది’ అన్నాడు ముచ్చు మూర్తి.

నాయుడు నిరాశ పడి, అక్కణ్ణుంచి కదిలి, కాసేపటికి– సరే బాడీ మసాజే అనుకొని ఇంకోచోట లోపలికెళ్లాడు. ముచ్చు రాలేదు. నిజానికి ముచ్చుకు బాడీ మసాజ్ వద్దు. కాని కావాలని ఉంటుంది.

‘తూ ఫిఫ్టీ బాత్స్’ నాయుడు బేరం తెంచాడు.

మసాజ్ గర్ల్ అతణ్ణి లోపలికి తీసుకెళ్లి, బల్ల మీద పడుకోబెట్టి, నడుము నుంచి

టవల్ ఏమాత్రం బెసగకుండా పట్టి ఉంచి లాఘవంగా ఒళ్లంతా మసాజ్ చేసింది మధ్య మధ్య ఆవిరి తువాళ్లతో తుడుస్తూ. అదంతా చాలా హాయి. కాని అతడిక్కావల్సింది అందులో లేదు.

దానిని ఇప్పుడు సాధించుకోవాలి. ఈ రాత్రి.

పక్కకు చూశాడు. బుద్ధుడు మళ్లీ అడుగులో అడుగు వేసుకుంటూ నీరసంగా నెమ్మదిగా రెస్ట్ రూమ్‌లోకి వెళుతూ కనిపించాడు. ఇటు కౌంటర్‌లో బార్‌గర్ల్స్. అందరూ చూస్తున్నారు. ఎవర్ని పిలిస్తే వాళ్లు. ఈలోపు కాఫీకలర్ది వచ్చి మళ్లీ తగులుకుంది.

'ఎయిత్ హండ్రెద్ బాత్స్'

'వాట్'

'షార్ట్ టైమ్ ఒన్ తౌజండ్ బాత్స్. ఐ... ఎయిత్ హండ్రెద్. లాంగ్ టైమ్ తూ తౌజండ్ బాత్స్. ఐ... సిక్స్‌తీన్'

'ఏంటంటది?' ముచ్చు మూర్తి అడిగాడు.

'కన్సెషన్ ఇస్తోంది'

'తీస్కో మరి'

నాయుడు మళ్లీ ముద్దు ముద్దుగా పెదాలు రెండూ ముందుకు చేర్చాడు.

'నువ్వు ఫ్రీగా వచ్చినా వద్దు. పోయే బోడిముండా'

'తాంకూ... తాంకూ'

ఇంకొకత్తి వచ్చింది. కుర్రపిల్ల. నిజంగా కుర్రపిల్లే. బండగా ఉంది. టీ షర్ట్ జీన్స్ ప్యాంట్ వేసుకొని ఒంటిని బరువుగా కదుపుతోంది. పెద్ద నోరు. పళ్లు చిన్నగా ఉన్నాయి. మీద చేయి వేసింది.

'హలో... ఇందియా... ఇందియా'

'నమస్తే... నమస్తే'

'ఐ స్తూదెంత్.... నాత్ బార్‌గర్ల్.... జాబ్ హియర్'....

'ఐసీ... ఐసీ'

'ఏంటంటది?'

'స్టూడెంటట... బార్‌గర్ల్ కాదట'

'ఓహో'

'ఐ.. వర్జిన్... నాత్ బార్‌గర్ల్'

'అమ్మనీయమ్మ'

'ఏంటంటది?'

'కన్నెశిరోమణి అట'

'లక్కీ... లక్కీ' ముచ్చు ఇమిటేట్ చేశాడు.

అది పక్కకు వెళ్లి నిలబడింది.

అప్పటికే బార్ స్టూల్స్ అన్నీ ఫుల్ అయిపోయాయి. ప్రతివాడూ దేన్నో ఒకదాన్ని కూచోబెట్టుకుని కబుర్లు మొదలేశాడు. అవి వినాలంటే పోయించాలి. ఒకడు– ఇటాలియన్ లాగున్నాడు మొహమాటం వదిలేసి ఇటాలియన్‌లోనే తన మనసులో ఉన్నదంతా ఆవేదనగా మాట్లాడేస్తున్నాడు. బార్‌గర్ల్‌కి ఇది అలవాటు లాగుంది ఓపిగ్గా సానుభూతిగా వింటూ మధ్య మధ్య 'యు ఆర్ రైత్.. యు ఆర్ రైత్' అంటూ ఉంది. ఒకడు జోక్ వేసి పెద్దగా నవ్వుతున్నాడు. బార్‌గర్ల్ కూడా తెగబడి నవ్వుతోంది. కొందరు బార్‌గర్ల్స్‌కి అడిగినంతా పోయించి తమ మానాన తాము తాగుతూ కూచుని ఉన్నారు సంబంధం లేకుండా. కొందరు నడుం మీద చెయ్యేశారు ఇది చాల్లే అన్నట్టు.

నాయుడు అందర్నీ చూశాడు.

దూరంగా ఒకడు దిగులుగా తాగుతున్నాడు. హాఫ్ హ్యాండ్స్ షర్ట్. తెలుగు ముఖం లానే ఉంది.

నాయుడు గ్లాస్ తీసుకొని అతడి దగ్గరికెళ్లి– 'ఎక్కడా?' అరిచాడు గోల్లో వినపడ దేమోనని.

'వైజాగ్'

'మొహం అలా పెట్టావేం?'

'బోర్ దొబ్బుతోంది బాసూ'

'ఏం'

'అప్పుడెప్పుడో ఓసారొచ్చా. బాగుండింది. రష్యా ముఖాలు తగిలాయి. అదే గుర్తు పెట్టుకొని వచ్చా. ఇప్పుడేం లేదు. అంతా రొచ్చుముండలు. దరిద్రం ముఖాలు'....

'సరిపోరా?'

'పోరు'

'ఏడిశావ్' అనుకుంటూ మళ్లీ పాత సీటు దగ్గరికొచ్చాడు.

'ఏంటంటాడు?'

'బోరు దొబ్బుతోందట. నువ్వెళతా?'

ముచ్చు ఏం మాట్లాడలేదు. ఇంకో సెవనప్ తెప్పించుకున్నాడు.

నాయుడు కాసేపు స్థిమితంగా ప్రశాంతంగా బార్‌లోకి చూశాడు. ఉన్న అందరు గర్ల్స్ కంటే ఇందాకటి బండదే యంగ్‌గా ఉంది. మేకప్ వేయకుండా చూట్టానికి మామూలుగా ఉంది. దార్లో ఎదురుపడే కాలేజీ గర్ల్‌లా ఉంది. దాని వైపే చూశాడు. దానికి అర్థమైంది. దగ్గరికొచ్చింది.

'హౌ మచ్... హౌ మచ్'...

'త్రీ తౌజండ్ త్రీ తౌజండ్ ... ఐ.. వర్జిన్... నాత్ బార్ గర్ల్'

'పోయే బోడిముండా'

ఇటు తిరిగాడు.

'ఓకే. తూ ఫైవ్... వర్జిన్... నాత్ బార్ గర్ల్'

నాయుడు ఏం మాట్లాడలేదు.

'లాస్త్... తౌజండ్.. షార్త్ తైమ్... తూ తౌజండ్.. లాంగ్ తైమ్'

బుద్ధుడు వచ్చాడు.

నాయుడు బేరం ఆపి– ఆగు ఆగు అన్నట్టుగా బండదానికి చేయి చూపించాడు.

'ఏంటి?'

నాయుడు నసిగాడు.

'ఏం లేదు. చిన్న సర్దా. కాదనకూడదు'

'ఎంతట?'

'షార్ట్‌టైమ్ తౌజండ్ బాత్స్ అట. కరెక్టేనా'

'అది అడగొద్దు'

'నువ్వొకడివి. పోయిన్సారి నోట్లో వేలేసుకొని తిరిగా? లాంగ్ టైమే అడుగుతా'

'లాంగ్ టైమ్. రాత్రంతా మేమెక్కడ ఉండాలి?'

నాయుడు డీలా పడిపోయాడు.

'చూశావా బావా దరిద్రం. ఈ దరిద్రం చూశావా. అసలు ముగ్గురం కలిసి ఒక రూమ్ తీసుకున్నామంటేనే దరిద్రం అని అర్థం. ఇంత దూరం వచ్చి కూడా ఈ దరిద్రం చూశావా?'

'ఇంకో రూమ్ తీసుకో. ఒక రాత్రికి టూ తౌజండ్ బాత్స్'

'నా వల్ల కాదు. దానికీ పెట్టి దీనికీ పెట్టి మందుకీ పెట్టి'

బండది కౌంటర్ దగ్గరకు వెళ్లి నాయుడి వైపు సైగ చేసి అతడి అకౌంట్‌లో డ్రింక్ అందుకుంది. రాత్రి ఇంకా చిక్కబడింది. మందు అప్పటికే చాలామందికి తలకెక్కిపోయింది. దిగ్గానే మోపెడ్స్ అద్దెకు తీసుకునే టూరిస్ట్‌లు తగిలినదాన్ని వెనక కూచోబెట్టుకొని షికార్లు తిరుగుతూ కనిపిస్తున్నారు హెల్మెట్లతో. బీర్‌బార్లలోని ముఖాలతో బేజారెత్తిన వాళ్లు రోడ్డు మీద అలా నడుచుకుంటూ దారిలో తగిలే బేరాల కోసం వెతుక్కుంటున్నారు. దూరాన సముద్రం నుంచి ఎలాంటి చప్పుడూ లేదు. కాని గాలి మాత్రం దానిని తాకే ఇక్కడ ఉన్నవాళ్లందరినీ తాకుతోందని తెలుస్తోంది.

నాయుడు నిర్ణయానికొచ్చాడు.

'సరే... ఏదో ఏడుస్తా... షార్ట్ టైమ్... మీరు కాసేపు లాంజ్‌లో తగలడండి'

బుద్ధుడు ముచ్చు వైపు చూశాడు. ముచ్చు ఏ అభిప్రాయమూ లేకుండా చూశాడు. నిజానికి ముచ్చుకు షార్ట్ టైమ్ అక్కర్లేదు. కాని కావాలనుకుంటాడు.

'సరే చావు'

'తాంకూ... తాంకూ'... నాయుడు చాలా తెరిపినపడి, హాయిగా నవ్వాడు.

'బ్రీజర్?' హుషారుగా అడిగాడు.

'ఊ'

'తాగు తాగు... కింద నుంచి పోయేదానికి పై నుంచి ఆ మాత్రం కవరప్ కావాలి తాగు... నాకేం తొందర్లేదు'

బండదాన్ని పిలిచాడు.

'ఎయిత్ హండ్రెడ్ బాత్స్... షార్త్ తైమ్... ఫైనల్'

అది తల అడ్డంగా ఆడించింది.

నాయుడు పైజేబు పెదవి విరుస్తూ చూపించాడు.

'లెస్ మనీ.... ఓన్లీ ఎయిత్ హండ్రెత్ బాత్స్... ఐ... ఇందియా... గ్రేత్ కంత్రీ'... వేళ్లలో వేళ్లు గుచ్చి మనం మనం ఒకటి అన్నట్టు సైగ చేశాడు.

అది మళ్లీ తల అడ్డంగా ఆడించింది.

నాయుడు మారాం చేస్తున్నట్టుగా చూశాడు.

అది కనికరించింది.

'ఓ..కే... నైన్ హండ్రెడ్... ఫైనల్'

'తాంకూ... తాంకూ... నాత్ నౌ... వెయిత్ వెయిత్'

అది తలాడించి మళ్లీ మందులో పడింది.

రోడ్డు మీద ఒక కుంటి అరబ్బు, పెద్ద పొట్ట వేసుకొని, జీరాడుతున్న గౌన్‌లో, కుంటుకుంటూ, తప్ప తాగి కంట్రోల్ తప్పిన ఒక పద్దెనిమిదీ పంతొమ్మిదేళ్ల పిల్ల చేయిని ఒడిసిపట్టుకొని పోతూ ఉన్నాడు. అది ఒంటి మీద చెడ్డీతో, టీషర్ట్ వేసుకొని, అడుగులో అడుగు వేస్తూ, ఏదో వాగుతూ, ఎందుకో నవ్వుతూ, కళ్లు సగం మూసి, సగం తెరిచి పోతూ ఉంది. మధ్యలో కింద పడింది. ఏదో చెప్పింది. లేపబోయాడు. మళ్లీ పడింది. అరబ్బు దాన్ని లేవదీశాడు. ఈసారి నడుం మీద చేయి వేసి, చాలా గట్టిగా పట్టుకొని, లాక్కుని పోతూ ఉన్నాడు. అది ప్రమేయం లేకుండా నవ్వుతూ, ఏదో చెప్తూ, కింద పడ్తూ, పొట్టలో నుంచి వొంగి నడుస్తూ పోతూ ఉంది.

నాయుడు ఇబ్బంది పడ్డాడు.

'బావా... ఏంటిది... ఏంటీ లంజాకొడుకు' అన్నాడు.

'ఏం చేసుకుంటాడు దాన్ని. ఏం చేసినా దానికి ఏం తెలిసొస్తుందని' అన్నాడు మళ్లీ.

బుద్ధుడు చూశాడు.

అది మొత్తుకుంటూ, తట్టుకుంటూ, పొట్టలో నుంచి ఒంగి పోతూ ఉంది. అరబ్బు తిడుతూ లాక్కెళుతున్నాడు.

బుద్ధుడు అలాగే చూస్తూ అన్నాడు.

'ఆకలి'

'అంటే?'

'ఆకలే'

బ్రీజర్ వచ్చింది. కొంచెం తాగాడు. నాయుడి ప్యాంట్ వైపు చూపుడువేలు ఆడించాడు.

'దీని ఆకలి ఎంత నాయుడూ. ఇంత. కొంచిం. పిడికెడు బువ్వ చాలు. సంతృప్తి పడిపోతుంది'....

వేలిని నాయుడి కణత దగ్గర ఆనించాడు.

'దీని ఆకలి ఉందే. అనంతం. దాని కోసమే వస్తారంతా'

నాయుడికి కొంత అర్థమైంది. కొంత కాలేదు. ముచ్చు వైపు చూశాడు. ముచ్చుకు ఇలాంటివి బానే అర్థమవుతాయన్నట్టు చూస్తూ ఉన్నాడు.

బుద్ధుడు వేలు పెట్టి నాయుడి ఒక్కో అవయవాన్నీ చూపుతూ ఉన్నాడు.

కంటిని– 'దీని ఆకలి ఉందే', ముక్కును– 'దీని ఆకలి ఉందే', చెవిని– 'దీని

ఆకలి ఉందే', నాలికని– 'దీని ఆకలి ఉందే', చర్మం మీద గీత వేస్తూ– 'దీని ఆకలి ఉందే'... 'ఈ ఆకళ్లన్నీ కలిసి'– కణత దగ్గర వేలు పెట్టి– 'దీని ఆకలి అవుతాయి. అందుకే వస్తారంతా'....

నాయుడు తల ఆడించాడు అర్థమైనా కాకపోయినా. ముచ్చు కుతూహలంగా చూస్తున్నాడు. బుద్ధుడికి ఉత్సాహం వచ్చింది.

'ఈ ఆకలి ఏం చేస్తుందంటే'...

కదిలింది.

'ఈ ఆకలి'....

మళ్లీ కదిలింది.

చెప్పడం ఆపి, 'థూ' అని ఊసి, బల్ల మీద పిడికిలితో బాదాడు.

నాయుడు భయపడ్డాడు.

'పోయిరా... కోప్పడకు... పొద్దునకల్లా తగ్గిపోతాయి... పోయిరా'

బుద్ధుడు మళ్లీ లేచి, ఐ ప్యాడ్ పట్టుకొని, బ్యాగ్ మీద చేయి వేసి వెళుతూ ఉంటే ముచ్చు లేచి తోడు రానా అన్నట్టు చూశాడు. వాలకం గమనించి మళ్లీ మాట్లాడకుండా కూచున్నాడు.

ఈలోపు మళ్లీ గోల మొదలైంది. ఈసారి ఇక్కడే. ఎవడో తెల్లాడు టెన్ బాత్స్ ట్వంటీ బాత్స్ నోట్లు నాలుగైదు పట్టుకొని కౌంటర్ ముందున్న అమ్మాయిల మీదకు విసిరాడు కాలక్షేపానికి డాన్స్ చేయమని. మ్యూజిక్ ఆన్ అయ్యింది. ఇద్దరు ముగ్గురు అమ్మాయిలు ముందుకొచ్చి పోటీ పడి కాళ్లు చేతులూ ఆడించడం మొదలుపెట్టారు. ఒక పిల్ల– లేస్ స్కర్ట్ వేసుకొని ఉంది– నడుం ఆడిస్తూ భుజాలు ఊపేస్తూ పొట్ట కదిలిస్తూ అదరగొట్టేస్తూ ఉంటే తెల్లాడు ఇంకో మూడు నాలుగు నోట్లు నజరానాలాగా చుట్టూ తిప్పి నేలకు విసిరాడు.

మ్యూజిక్ కాస్త పెరిగింది. ఇంకాసేపు ఉండింది. తెల్లాడు శాంతించాడు అనుకోగానే శాంతించింది.

మ్యూజిక్ ఆగాక, ఆ లేస్ స్కర్ట్ పిల్ల అటూ ఇటూ చూసి, నాలిక ఎండిపోయినట్టుగా ముఖం పెట్టి, బుగ్గల మీద మెరుస్తున్న చెమటతో, ఎఱ్రటి పెదాలతో, ఒంటి మీది ఒక రకమైన సువాసనతో, హటాత్తుగా వచ్చి నాయుడి పక్కన కూచుంది కాలికి కాలు ఆనిస్తూ.

నాయుడు కదిలాడు. దగ్గరకు జరిగింది. నాయుడు కదిలాడు. పైకాలిని పైకాలితో

ఆనించింది. నాయుడు చూస్తూ ఉన్నాడు. చెంపకు చెంప ఆనించింది. చెవిలో గుసగుస.

'ఒన్ ఓడ్కా ప్లీజ్'...

నాయుడికి మొహం కనపడ్డం లేదు. చెంప మీద మెత్తగా, గరుకుగా, చెమ్మగా దేన్తోనో రాస్తున్నట్టుగా ఉంది. గిలిగింతగా ఉంది.

'ఒన్ ఓడ్కా ప్లీజ్'...

ఊపిరి చెవి దగ్గరగా వచ్చింది. రెప్పపాటులో చెవి తమ్మను కొరికి వదిలేసినట్ట య్యింది.

'ఒన్ ఓడ్కా'....

నాయుడు అదిరిపోయాడు.

'ఇంత దాకా ఎక్కడున్నావే గుంటదానా?'

అది కళ్లలో కళ్లు పెట్టి చూసింది. నవ్వింది. త్వరత్వరగా ముడేయడానికి చూస్తోంది.

'ఒన్ ఓడ్కా'....

నాయుడి చేయి తీసి చనువుగా ఛాతీ మీద వేసుకుంది. తీయకుండా పట్టుకుంది.

'ఒన్ ఓడ్కా'...

నాయుడు కంగారుగా ముచ్చు వైపు చూశాడు. ముచ్చు దాని వేగానికి కొంచెం ఎడం జరిగి ఉన్నాడు.

'ఒన్ ఓడ్కా...'

తలాడించాడు.

అది వెంటనే లేచి, బుగ్గ మీద మృదువుగా చిన్న దెబ్బ వేసి, ఒక్క నిమిషంలో తెచ్చుకుని మరు నిమిషంలో ముగించింది.

'తాంకూ... తాంకూ' కృతజ్ఞతగా నవ్వి బొటనవేలిని అడ్డంగా ఆడించింది.

'తూ దేస్... నో వర్క్.... నో మనీ.....'

మళ్లీ చేయి అందుకుని ఛాతీ మీద వేసుకుంది. పట్టుకుంది.

'యూ... ఇందియా?'

నాయుడు తలాడించాడు.

'బిగ్ కంట్రీ... బిగ్ మనీ'...

స్నేహంగా నవ్వింది.

ఇంకో ఓడ్కా కోసం చూసి, తెచ్చుకుని, మరు నిమిషంలో ముగించింది.

'యూ... హాంద్‌సమ్... ఇందియా హాంద్‌సమ్...'

నాయుడి తల వొంచి బట్టతల మీద గట్టిగా ముద్దుపెట్టింది. కృతజ్ఞతగా నవ్వింది.

'తూ దేస్... నో వర్క్.... నో మనీ... '

మళ్లీ చేయి అందుకుని వేసుకుంది. ఈసారి నాయుడు తీయలేదు.

'యూ... హౌ మెనీ?'

నాయుడు మూడు వేళ్లు చూపించాడు.

'ఓకే.. ఓకే... ఆల్ త్రీ'

ఆలోచించి మళ్లీ చెప్పింది.

'ఓకే... ఆల్ త్రీ... తౌజండ్ బాత్స్... లాంగ్ టైమ్...'

నాయుడు అదిరిపోయాడు.

సంజాయిషీ ఇచ్చింది.

'ఐ... తూ తౌజండ్... యూ... ఇందియా... ఐ లెస్'

కౌంటర్ వైపు రహస్యంగా వేలు చూపించింది.

'దే... నో హ్యాపీ... ఐ గివ్ హ్యాపీ... దే... ఓన్లీ మనీ.... ఐ... కోఆపరేత్'

మోకాలిని నాయుడి ప్యాంట్‌కు తాకించింది.

నాయుడు ముక్కులో నీళ్లుపోయినవాడిలా చూస్తున్నాడు.

రెండు చేతుల్నీ పట్టుకుని నడుం మీద వేసుకుంది.

'ఐ... యంగ్ గర్ల్... యంగ్ బాదీ.... కోఆపరేత్'....

నడుమును చేతులకు పట్టి పట్టి ఇస్తోంది. నాయుడి చేతులు మెత్తగా కదలుతున్నాయ్. అప్పటికి బకార్డి తల్లోకి పూర్తిగా చేరిపోయింది. లేస్‌స్కర్ట్‌ది మత్తుగా, మెరిసి పోతూ కనిపిస్తూ ఉంది. నాయుడు ముద్దుముద్దుగా మాట్లాడే మూడ్‌లోకి వచ్చేశాడు.

'యూ వాంత్ తు కమ్?'

'యా... యా'

'యూ వాంత్ తు రియల్లీ కమ్ విత్ మీ'

'యా... యా'

'యూ వాంత్ తు కోఆపరేత్'

అది నాయుడి చేతుల మీద చేతులు వేసి గట్టిగా నొక్కేసింది.

నాయుడికి ఆవహించేసింది.

'ఓకే. నో లాంగ్ టైమ్. ఓన్లీ షార్ట్ టైమ్. నో త్రీ. ఐ ఓన్లీ'

అది సంతోషంగా ముఖమంతా నోరు చేసుకొని నవ్వింది.

'ఐ ఓకే... ఐ ఓకే'..

'హౌమచ్... హౌమచ్'

'ఫైవ్ హండ్రెడ్.. ఫైవ్ హండ్రెడ్'...

'ఐ ఓకే... ఐ ఓకే'....

అది కృతజ్ఞతగా ముద్దుల మీద ముద్దులు పెట్టింది.

నాయుడికి తొందరగా ఉంది.

'లెత్స్ గో... లెత్స్ గో తు రూ...మ్'...

అది చాలా కంగారుపడి వెంటనే ఆపింది.

'నో రూమ్ నో రూమ్... ఫస్ట్ హోతేల్... ఫూద్... దెన్ రూమ్...'

చటుక్కున నాయుడి చేయి అందుకొని పొట్ట మీద వేసి నిమురుకుంటూ చిన్నబుచ్చు కుంటూ నవ్వింది.

టీ షర్ట్ కింద మెత్తటి పొట్ట. నాయుడి ధాటికి అణుగుతూ లేస్తూ ఉంది. నాయుడికి ఒకటి అనిపించింది– దీనికి మధ్యాహ్నంలా పంజాబీదాని దగ్గర కాకుండా ముందు ఎక్కడైనా మంచి తిండి పెట్టాలి. ఆ తర్వాత దీని సంగజ్జూడాలి.

నాయుడికి హుషారు వచ్చింది.

వస్తున్న బుద్ధుణ్ణి చూసేసరికి హుషారు ఇంకా పెరిగింది.

'బుద్ధుడూ. పద. బిల్లు సెటిల్ చెయ్. పోదాం'

బుద్ధుడు చూశాడు.

'ఏంటి. మార్చావా?'

'అవును. చాలా చీప్. లక్కీగా దొరికింది. పద'

అది వెంటనే బుద్ధుడి వైపు స్నేహంగా, కంగారుగా, చెడగొట్టొద్దురా మగడా అన్నట్టుగా చూసి నవ్వింది.

బుద్ధుడు బ్యాగ్‌లో నుంచి డబ్బు తీసి, అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్లి, కౌంటర్‌లో మొత్తం బిల్లు పే చేశాడు. బార్ ఓనర్ డబ్బు తీసుకుంది. చిల్లర ఇవ్వకుండా బుద్ధుణ్ణే చూస్తూ ఉంది. బుద్ధుడికి అర్థం కాలేదు. మరు నిమిషంలో బండది వచ్చింది. కాఫీ కలర్ది కూడా వచ్చి ఓనర్ పక్కన నిలుచుంది. మరు నిమిషంలో ముగ్గురూ కలిసి బుద్ధుణ్ణి తిట్టడం మొదలుపెట్టారు. బుద్ధుడు కంగారు పడిపోయాడు.

నాయుడు దూరం నుంచే చూశాడు.

'ఏంటి?'

'ఏంటో' బుద్ధుడు అరిచాడు.

ముచ్చు, నాయుడు కౌంటర్ దగ్గరకొచ్చారు.

నాయుణ్ణి చూడగానే బండది, కాఫీ కలర్ది ఇంకా పెద్దగా తిట్టడం మొదలుపెట్టారు. నాయుడికి కంగారు వేసింది.

'ఏంటి ఏంటి' అంటున్నాడు.

లేస్ స్కర్ట్‌ది దూరం నుంచే చూసి ఏదో అర్థమైనట్టయ్యి, పరిగెత్తుకుంటూ వచ్చి ఓనర్‌తో ఏదో చెప్పబోయింది. రెండు మాటలు కూడా పూర్తి కాలేదు. బండది దబ్బుమని దాని ముఖాన బాదింది. కాఫీకలర్ది అంతవరకూ ఉన్న వయ్యారాన్నంతా పక్కన పెట్టి  లేస్ స్కర్ట్ దాని జుట్టు పట్టుకొని ఒక్క సెకనులో కిందకు ఈడ్చింది. మరు నిమిషంలో దాని పొట్టకు అటొక కాలూ ఇటొక కాలూ వేసి నిలుచుంది. బండది రెప్పపాటులో వేగంగా వచ్చి లేస్ స్కర్ట్‌దాన్ని కాలితో ఒక్క తాపు తన్నింది.  అది మూలిగింది.

నాయుడికి ఇంకా కంగారు పెరిగింది. బుద్ధుడు కడుపు మీద చేయి వేసుకుని నీరసంగా, కంగారుగా చూస్తున్నాడు. ముచ్చు ముచ్చుముఖం మాని చురుగ్గా అటూ ఇటూ గమనిస్తున్నాడు. గోల ఇంకా పెరిగింది. రక్షణకు వైజాగ్‌వాడు పరిగెత్తుకొని వచ్చాడు.

'ఏమైంది..'

'ఏమో...'

'ఇంతకు ముందు ఎవర్తోనైనా బేరం చేశారా?'

'చేశాం'

'అదీ సంగతి. ఎవర్తో బేరం చేశారో దాన్తోనే పోండి.'

'అదేంటి?

'అదంతే. తొందరగా పోండి'

ఆడవాళ్లు ఇంకా తిట్లు పెంచారు. బార్ గోలలో ఆ గోల  కలిసి అంతటా తీవ్రంగా ఉంది. లేస్ స్కర్ట్‌ది కదలబోయింది. కాఫీకలర్ది దానిని అక్కడే అణిచి పెట్టేసరికి నేలకు అంటుకుపోయి అలాగే నాయుణ్ణే చూస్తూ ఉంది. నాయుడు దాన్నే చూస్తూ ఉన్నాడు. దాని కళ్లు... భుజాలు... ఛాతీ... ఇందాక తాను తడిమిన దాని పొట్ట....

'నాకు అదే కావాలి'

'కుదర్దు... చెప్తే విన్రా... దేన్తో మాట్లాడారో దాన్నే తీసుకొని తొందరగా కదలండి'

నాయుడు చూస్తున్నాడు.

'ఇక్కడంతా కమిషన్లు. మీ ఇష్టమొచ్చినట్టుగా పోతానంటే ఎవరు భరిస్తారు బొక్కా. ముందే చూస్కోవాలి'

నాయుడికి పంతం పెరిగింది.

బండదానివైపు చూశాడు.

అది ఉగ్రంగా కోపంగా నోరు ఇంత పెద్ద చేసుకుని నాయుణ్ణే చూస్తూ ఉంది.

'ఛీ.. నాకు మూడ్ పోయింది. దీన్తో పోను. దాన్తోనే పోతాను. కావాలంటే ముందు మాట్లాడింది పారేస్తాను'

బార్ ఓనర్ ఇప్పుడు లేచి నిలబడి పెద్ద పెద్దగా అరుస్తూ చేయి చూపిస్తూ బయటకి పోండి అన్నట్టుగా తిడుతూ ఉంది.

నాయుడు నిర్ణయానికొచ్చాడు.

తౌజండ్ బాత్స్ నోటు తీసి, కౌంటర్ మీద పడేసి, వెళ్లి లేస్ స్కర్ట్ దాని చేయి పట్టుకోబోయాడు. కాఫీ కలర్ది ఒక్క తోపు తోసింది. నాయుడు ఆగకుండా మళ్లీ మూర్ఖంగా వెళ్లి లేస్ స్కర్ట్ దాని చేయి పట్టుకోబోయాడు. ఓనర్‌కు ఎక్కడలేని కోపం వచ్చి కౌంటర్ మీదున్న నీళ్ల గ్లాసు తీసి నాయుడి ముఖాన కొట్టింది. బండది ఇంకో గ్లాసు తీసి బుద్ధుడి ముఖాన విసిరింది. ఈలోపు ఇంకో ఇద్దరు ముగ్గురు బార్‌గర్ల్స్ ఏకమయ్యి ఐస్ బకెట్ బోర్లించి రక్కినంత పని చేశారు. నాయుడు తబ్బిబ్బయ్యి ఏదో అనబోయాడుగాని అప్పటికే ముచ్చు వేగంగా కదిలి కౌంటర్ మీదున్న బీర్ బాటిల్‌ని భళ్లున కొట్టాడు.

అందరూ హడలిపోయారు.

నాయుడు అదిరిపోయాడు.

వైజాగ్ వాడు ఒక అంగ వెనక్కు దూకాడు.

ఒక్క క్షణం బార్‌లో రొద మందగించింది.

ముచ్చు చేతిలో ఉన్న గాజు ముక్కను అందరికీ చూపిస్తూ 'ముయ్... ముయ్... మూసెయ్' అన్నాడు. ఒక్క నిమిషం తర్వాత ఆ గాజు ముక్కను కౌంటర్ మీదే ఉంచాడు. బార్‌లో రొద మళ్లీ యథాతథం అయ్యింది.

నాయుడు ఇక లాభం లేదన్నట్టుగా కదిలి తౌజండ్ నోటును తీసుకొని జేబులో

పెట్టుకున్నాడు.

ముందు బుద్ధుడు కదిలాడు.

వెనుక నాయుడు.

వెనుక ముచ్చు.

వీళ్లు కదులుతుండగానే లేస్ స్కర్ట్ దాన్ని లేపి వెనుక గదివైపు ఈడ్చుకు వెళ్లడం తెలుస్తూనే ఉంది.

ముగ్గురూ బయటకు వచ్చారు. థాయ్ ఆకాశంలోని చంద్రుడు ఈ ముగ్గురు తెలుగు వాళ్ల గొడవేమీ పట్టనట్టుగా తెల్లగా నిలబడి చూస్తూ ఉన్నాడు. రోడ్డు మీద కార్లు... పికప్ ట్రక్కులు... మోపెడ్‌లు...

నాయుడు ఏం మాట్లాడట్లేదు. అందరి ముఖాల మీదా చెమట కారిపోతూ ఉంది. బుద్ధుడు కర్చీఫ్ తీసుకొని ముఖాన్నీ  తడిసిన జుట్టునీ తుడుచుకుంటున్నాడు. ముచ్చు బుద్ధుడి దగ్గరి నుంచి ఐ ప్యాడ్, బ్యాగ్ అందుకొని నడుస్తూ ఉన్నాడు.

నాయుడు టక్కున ఆగాడు.

దూరాన ఒక పిల్ల. ఇరవై ఇరవై ఐదేళ్లుంటాయ్. ఒక తెల్లాడి వెంట పడి బేరం కుదుర్చుకోమని బతిమిలాడుతూ పోతూ ఉంది. తెల్లాడు వినడం లేదు. నెట్టేస్తూ ఉన్నాడు. అది మళ్లీ మళ్లీ వాణ్ణి బతిమిలాడి వెంటపడుతూ ఉంది. చనువుగా చేతులు వేస్తూ ఉంది. వాడు కంగారుగా చేతులు రెండూ ప్యాంట్‌కు అడ్డంగా పెట్టుకుంటూ ఉన్నాడు.

నాయుడు అలాగే చూసి టక్కున వెనక్కు తిరిగాడు. జేబులో నుంచి ఫైవ్ హండ్రెడ్ బాత్స్ నోట్ తీసుకొని గబగబా బార్‌లోకి వెళ్లి ఓనర్ దగ్గర నిలుచున్నాడు.

తడిసిన బట్టతల... తడిసిన చొక్కా.... తడిసిన ముఖం...

నోటు సాచాడు.

ఏదో చెప్పాలనుకున్నాడు.

ఒకటి రెండు మాటలు. గొంతు రాలేదు.

'షి... హంగ్రీ... దోన్త్ బీత్... గివ్ ఫూద్'.....

ఓనర్ ఒక్క ఉదుటున లేచి, నోటు అందుకొని, ఉండచుట్టి నాయుడి ముఖాన కొట్టింది.

అలాగే నిలబడ్డాడు.  వెనక గది వైపు చూశాడు. అరుపులు కేకలూ లేవు. మూసేసి ఉన్నారు.

రోడ్డు మీదకు వచ్చాడు.

అప్పటికే వైజాగ్‌వాడు బిల్లు పే చేసి వీళ్ల దగ్గరకు వచ్చి ఉన్నాడు. నాయుణ్ణి చూసి చెప్పాడు.

'ఉల్ఫా ముండలు బాసూ. మీరు చాలా లక్కీ. చాలా పెద్ద గొడవయ్యేది లేకపోతే'

అందరూ నడుస్తూ ఉన్నారు.

'వీళ్లిలా ఉన్నారా? ఈ థాయ్ ముండలకి వయసు తెలీదు. అందరికీ ముప్పయి నలభై ఉంటాయ్. పదిహేను పదహారుకే పెళ్లిళ్లయిపోతాయి. ఇరవై లోపల ఇద్దరు ముగ్గురిని కనేస్తారు. మగాళ్లు సోంబేరులు. సంపాయించినా వాళ్ల తిరుగుళ్లకు చాలవు. వీళ్లు కష్టపడాలి. ఇలా వచ్చి కష్టపడతారు. బేరాలు తగిలితే సరే. లేకుంటే ఇలా తగులాటలు కొట్లాటలు. వర్జిన్‌లని చెప్పినా యంగ్ ఏజ్ అని చెప్పినా అందరూ కన్నతల్లులే... అందుకే వీళ్లంటే నాకు రోత. అదే రష్యన్లయితే'... ఏదో చెప్పు కుంటూ పోతున్నాడు.

నాయుడికి వినే మూడ్ లేదు.

బుద్ధుడు ఇంకా తుడుచుకుంటూ ఉన్నాడు.

ముచ్చు ఎటో చూస్తూ ఉన్నాడు.

కాసేపు మాట్లాడి మాట్లాడి అతడు రూమ్‌కి పోతున్నానని చెప్పి పోయాడు.

బుద్ధుడు తెరిపిన పడి, కాసేపు విశ్రాంతి అన్నట్టుగా ఫుట్‌పాత్ మీద రోడ్డులోకి కాళ్లు చాపి కూలబడ్డాడు. ముచ్చు పక్కన కూచున్నాడు. నాయుడు అటూ ఇటూ దిక్కులు చూస్తూ నిలుచున్నాడు. ఏం తోచలేదు. రోడ్డుకు ఆ వైపు డిపార్ట్‌మెంటల్ స్టోర్ ఉంటే వెళ్లి వాటర్ బాటిల్స్ కొనుక్కొని వచ్చి చెరొకటి ఇచ్చి తనొకటి పట్టుకు న్నాడు. ముగ్గురూ నీళ్లు తాగుతూ కూచున్నారు.

రోడ్డు మీద వరుసగా బండ్లు పోతూ ఉన్నాయి. అదోరకం బండ్లు. మోపెడ్‌లకే బండ్లను అటాచ్ చేసి ఆ బండ్లను అలాగే డ్రైవ్ చేసుకుంటూ తీసుకుని పోతూ ఉన్నారు. ఫ్రూట్ జ్యూస్ బండి... నూడుల్స్ బండి... లిక్కర్ బండి.... ఎండుచేపల బండి... అది ఏమి నూనో.... వికారమైన వాసన రోడ్డంతా వ్యాపించింది.

బుద్ధుడు లేచి వెనుక దులుపుకుంటూ అన్నాడు.

'నాయుడూ... పద'

'ఎక్కడికి?'

నాయుడి గొంతులో ధైర్యం లేదు. దబాయింపు పోయింది.

'ఇవాళ నీ తుప్పంతా వదలగొడతాను పదా'

నాయుడు ముచ్చువైపు చూశాడు. ముచ్చు ఏమీ మాట్లాడలేదు. బుద్ధుడు బ్యాగ్‌ను భుజానికి తగిలించుకుని, ఐ ప్యాడ్ చేతిలోకి తీసుకుని రోడ్డు మీద పోతున్న టుక్‌టుక్‌ని ఆపాడు.

'వాకింగ్ స్ట్రీట్'

డ్రైవర్ ముగ్గుర్నీ చూసి చెప్పాడు.

'ఫిఫ్టీ బాత్స్'

టుక్‌టుక్ కదిలింది. ముగ్గురూ కూచున్నారు. గాలి వీస్తూ ఉంది. రోడ్డు అప్పుడే టైమైనట్టుగా కళకళలాడిపోతూ ఉంది. అటూ ఇటూ చిల్లర దుకాణాల్లాగా వరుసగా ఓపెన్ బీర్‌బార్‌లు. వాటి ఎదుట తప్పనిసరిగా మెరిసే ఫ్లోరోసెంట్ దీపాలు. ప్రతిబార్ నుంచి ఏదో ఒక మ్యూజిక్. కొన్నింటిలో పార్టీ బ్యాండ్స్. కొన్నింటిలో కేతిగాళ్లు. కొన్నింటిలో డాన్స్ చేస్తున్న ఆడపిల్లలు. మధ్య మధ్య రెస్టారెంట్స్. అక్కడక్కడా నల్లగా మురికిగా చీకటిగా షార్ట్‌టైమ్ హోటళ్లు. బయట మంతనాల్లో ఆడవాళ్లు మగవాళ్లు.

నాయుడు చూస్తూ ఉన్నాడు.

బుద్ధుడు గమనించాడు.

'ఏం చూస్తున్నావ్ నాయుడూ?'

నాయుడు జవాబు చెప్పలేదు. ఊరికే ఉన్నాడు. ముచ్చు భుజం మీద మొదటిసారి చేయి వేసి కూచుని ఉన్నాడు.

బుద్ధుడు అన్నాడు.

'నీ ఆకలి కోరుకున్న ప్రపంచం ఇదే నాయుడు. ఎప్పట్నించో ఏమిటేమిటో అనుకొని ఉంటావుగా. లోపల ఏదేదో పేర్చుకొని ఉంటావుగా. చీకట్లలో ఏదేదో దాచుకొని ఉంటావుగా. ఆ చీకటిని తీర్చే ప్రపంచం ఇదే నాయుడూ. అలాగనుకునేగా ఇక్కడిదాకా పరిగెత్తుకొని వచ్చావ్. దాన్ని సరిగ్గా చూపిస్తాను పద'

టుక్‌టుక్ ఇంకా వేగం పెంచుకుంది.

ఒక కొత్త ప్రపంచంలోకి వస్తున్నట్టుగా పరిసరాలతోనే అర్థమవుతూ ఉంది.

దూరం నుంచే గోల. కళ్లు మిరమిట్లు గొలిపే కాంతి. ఫ్లోరోసెంట్ లైట్లతో భారీగా నిర్మించిన ఆర్చ్. స్వాగతం చెబుతున్న వాకింగ్ స్ట్రీట్.

టుక్‌టుక్ ఆగింది. వెలుగు తీవ్రంగా మింగేసేలా ఉంది. గోల తినేసేలా ఉంది.

బుద్ధుడు అరిచాడు.

'మీ ఇద్దరూ నాతో పాటే నడవండి. దేనిలోకీ వెళ్లొద్దు. ఎవర్తోనూ మాట్లాడొద్దు. వెనకే నడుస్తూ ఉండండి'

దిగాడు.

వెనుక ముచ్చు.

వెనుక నాయుడు.

వాకింగ్ స్ట్రీట్ మొదలయ్యింది. దారంతా జనం. మందలు మందలుగా నడుస్తూ ఉన్నారు. మందలు మందలుగా రాసుకుంటూ ఉన్నారు. మందలు మందలుగా పూసుకుంటూ ఉన్నారు. అరుపులు. నవ్వులు. కేరింతలు. గోల. చెట్టాపట్టాలేసుకున్నవాళ్లు. ఒంటరిగా తిరుగుతున్నవాళ్లు. వీడియోలు తీసుకుంటున్నవాళ్లు. నోరు తెరిచి చూస్తున్నవాళ్లు. జంకుగా కంగారు పడుతున్నవాళ్లు.

స్ట్రీట్‌కు ఇరువైపులా హుక్కా సెంటర్లు. బీర్‌బార్లు. గోగో బార్లు. యూరోపియన్ బార్లు. గే బార్లు.

అన్నింటి బయటా ఆడపిల్లలు. ఒళ్లు కొంచెం కొంచెం కప్పుకున్న ఆడపిల్లలు. ఒళ్లు అంతా అంతా చూపించే ఆడపిల్లలు. ఒళ్లు తప్ప వేరే ఏమీ లేని ఆడపిల్లలు. రకరకాల దుస్తులు. రకరకాల రంగులు. టూ పీస్ బికిని... కీ హోల్ బికిని... లెదర్ చైన్ స్కర్ట్స్... పింక్ అండ్ పింక్... బ్లూ అండ్ ఎల్లో... రెడ్ అండ్ రెడ్... బ్లాక్ అండ్ బ్లాక్....

రా... రా... రా...

దయచెయ్... దయచెయ్.. దయచెయ్...

ప్రతి బార్ బయటా అద్దాల గదులు. ప్రతి అద్దాల గదిలో సర్పాల్లాగా ఆడపిల్లలు. గుట్టలు గుట్టలుగా ఆడపిల్లలు. పోల్స్ పట్టుకొని నడుము తిప్పుతూ... ఒంగుతూ లేస్తూ.... కాళ్లు చీల్చి విన్యాసాలు చూపుతూ... ఏం వింటున్నామో అర్థం కానంత పెద్దగా మ్యూజిక్.... కొన్నిచోట్ల పెట్టెల్లో బాతుల్లాగా అద్దాల గదుల్లో ఉత్తినే అలా నిలబడి చేతులు ఊపుతూ... మొత్తం కనిపించే భుజాలు... మొత్తం కనిపించే వీపు... మొత్తం కనిపించే కాళ్లు... మొత్తం కనిపించే పొట్ట.

దా... దా... దా...

దయచెయ్... దయచెయ్... దయచెయ్....

ముచ్చు బుద్ధుణ్ణి అంటుకుపోయాడు. ముచ్చును నాయుడు అంటుకుపోయాడు. ఆగడానికి లేదు. వెనుక నుంచి నెట్టుకుంటూ నడుస్తూ ఉంటారు. వరద.

దేనిలోకైనా పోతే?

'వద్దు. పోగానే చేతిలో ఏదో ఒకటి అంటగడతారు. తాగితే వాచిపోద్ది. నడూ'

'అద్దాల్లో ఈ పిల్లలేంటి బుద్ధుడూ'

'లోపల చిన్న చిన్న గదులుంటాయ్. కాసింత బీర్ తాగి. కావాలంటే ఇది. షార్ట్ టైమ్'....

వీధి ఇరుకైనప్పుడల్లా వాసనొస్తున్నట్టుగా అనిపించింది. ఏం వాసన అది? ఆ వాసన? ఏళ్లకేళ్లు రేయింబవళ్లు అదే పనిగా వాడీ వాడీ కడగని వాసన? ముక్కుకు చేయి అడ్డం పెట్టుకున్నారు.

విగ్గులు పెట్టుకొని తామూ ఆడపిల్లలమే అన్నట్టు కనిపిస్తున్న లేడిబాయ్‌ల గుంపు ఒకటి ఇద్దరు తెల్లాళ్ల వెంటపడి పోతూ ఉంది బతిమిలాడుతూ చీదరింపును ఎదుర్కొంటూ. కొందరు అచ్చు ఆడపిల్లల్లాంటివాళ్లు హండ్రెడ్ బాత్‌లకు కూడా సిద్ధమని నిలుచుని ఉన్నారు. కొందరు ఒక్క బ్రీజర్‌కి.

ఒక్కోచోట వీధంతా పౌడర్ల, సెంట్ల, మేకప్‌ల వాసన కొడుతోంది. మందలు మందలుగా ఉన్న ఆడపిల్లల మేకప్‌ల వాసన. ప్రతి పిల్లకూ దట్టమైన మేకప్ ఉంది. కళ్ల మీద మేకప్. కనుబొమ్మల మీద మేకప్. చెంపల మీద మేకప్. కంఠం మీద మేకప్. కాళ్లూ చేతులూ వీపూ నడుమూ.... అసలు రూపు ఎలా ఉంటుందో.

దా... దా... దా...

ఒక తెల్లాడు– కోసిన పుచ్చకాయంత వెడల్పుగా ఉన్నవాడు– టీషర్టూ షార్టూ వేసుకొని, స్పోర్ట్ షూస్ కట్టుకొని, ఎర్రటి రంగుతో, చాలా లావైన బుగ్గలతో ధబ్‌ధబ్ మని చప్పుడు అయ్యేలా నడుస్తూ ఒక పిల్లను పట్టుకొని పోతూ ఉన్నాడు. ఆ పిల్లకు పన్నెండేళ్లు ఉంటాయి. సన్నగా పుల్లలాగా ఉంది. కాళ్లు కనిపించేలా గౌన్ తొడుక్కుని ఉంది. తెల్లాడి చిటికెనవేలు పట్టుకొని వాడేదో చెబుతుంటే వాణ్ణి మురిపెంగా చూస్తూ పోతూ ఉంది. ఆ పిల్ల ఒంట్లో ఏమీ లేదు. పైన ఏమీ లేదు. కింద ఏమీ లేదు. అసలు తాకడానికంటూ ఆ పిల్ల వొంటి మీద ఏమీ లేదు. ఇంకా శరీరం రాని చిన్నపిల్ల ఎలా ఉంటుందో అలా ఉంది. అలాంటి దానిని పట్టుకొని తెల్లాడు పోతూ ఉన్నాడు .

బుద్ధుడు చూశాడు. ముచ్చు చూశాడు. నాయుడు చూశాడు. ఆశ్చర్యంగా చూస్తూ ఉన్నారు.

చూడగా చూడగా అర్థమైంది.

అది ఒక గిడసబారిన స్త్రీ.

ఆ పుచ్చకాయవాడికి చిన్నపిల్ల కావాలి. ఆ గిడసబారిన స్త్రీ అందుకు ప్రత్యామ్నాయం.

నాయుడికి లొడపెట్టినట్టు అయ్యింది.

'బుద్ధుడూ ఆగు... వెనక్కిపోదాం'

‘ఇంకా చాలా ఉంది’

‘నీకు దండం పెడతాను ఆగు’

ముగ్గురూ దారి చేసుకొని ఒక వైపుగా ఆగారు.

మామూలు పనులకు మామూలు వెలుతురు చాలు. కాని తప్పు చేసే చోట ఎక్కువ వెలుతురు కావాలి. పగటిపూట ఆ వీధిని ఎవరూ చూడకపోవచ్చుగాని రాత్రిపూట ఆ అట్టహాసపు వెలుగు ప్రాణభీతి కలిగించేలా ఉంది. కాని ఎవరూ అదేమీ పట్టించు కోవడం లేదు. జరిగే బేరాలు జరుగుతూ ఉన్నాయి. సాగే ఆరాలు సాగుతూ ఉన్నాయి. లోపలికి వెళ్లేవాళ్లు వెళుతూ ఉన్నారు. బయటకు వచ్చేవాళ్లు వస్తూ ఉన్నారు. ఎంచు కునేవాళ్లు ఎంచుకుంటూ ఉన్నారు. పట్టుకుపోయేవాళ్లు పట్టుకుపోతూ ఉన్నారు.

ఆకలి.... ఆకలి... ఆకలి...

ఇండియన్స్‌కి యూరోపియన్లు కావాలి. యూరోపియన్లకు థాయ్ పిల్లలు కావాలి. అరబ్బులకు బ్లాక్స్ కావాలి. బ్లాక్స్‌కు ఆసియన్స్ కావాలి.

ఆకలి... ఆకలి... ఆకలి...

ఇలా తింటామో లేదో అలా పుట్టుకొచ్చే ఆకలి.

ఎవరెవరో ఎవర్తోనో పోతున్నారు. ఏ అమ్మాయో ఎవర్తోనో పోతోంది. ఆ చేయి పట్టుకున్నవాడు ఎలాంటివాడో. ఏ శరీరం వాడో. ఏ భాషవాడో. ఎలా వ్యవహరించ బోతున్నవాడో.

నాయుడు చూస్తూ ఉన్నాడు.

ముచ్చు చూస్తూ ఉన్నాడు.

బుద్ధుడు చూస్తూ చెప్పాడు.

‘వీళ్లు కూడా అందరు ఆడపిల్లల్లా పుట్టిన వాళ్లే నాయుడూ. వీళ్లు కూడా అమ్మ పొత్తిళ్లలో నిర్భయంగా ఆవలించి కళ్లు తెరిచినవాళ్లే. ఊహ తెలిసి సంబరంగా చంద మామను చూసిన వాళ్లే. వీళ్లు కూడా పూసేవన్నీ పూలనీ కాసేవన్నీ పండ్లనీ అమాయ కంగా నమ్మిన వాళ్లే. మన అమ్మల్లాగా అక్కల్లాగా చెల్లెళ్లలాగా ఈ ప్రపంచం నుంచి వేరే ఏమీ ఆశించకపోయినా కాసింత మంచిని ఆశించినవాళ్లే’

బుద్ధుడి ముఖం ఎర్రగా అయ్యింది.

చూపు వీధి మీద నుంచి తప్పడం లేదు.

వీధంతా వ్యాపించిన ఉద్రేకాన్ని పొడుగ్గా చూస్తూ అన్నాడు.

‘ఇది మానవజాతి విసర్జకం నాయుడూ. ఈ ఊరులాంటి విసర్జకాన్ని అది సిద్ధం

చేయకపోతే మిగిలిన ప్రపంచాన్నంతా శుభ్రంగా ఉంచలేదు. కనిపించే ప్రతి ఆడదీ అందుకే అనిపించే ఒక ఊరు ఉందంటే ఏమిటి అర్థం? ఇవాళ ఈ ఊరు. రేపు మరొకటి. కాని ఇలాంటి విసర్జకాన్ని తయారు చేయకుండా అది ఎప్పుడూ లేదు'....

నాయుడి మనసులో ఏముందో. అలాగే చూస్తూ ఉన్నాడు.

'చీకటిని కడుక్కోవాలి నాయుడూ మనమంతా ఎప్పటికప్పుడు మెలకువగా చీకటిని కడుక్కోవాలి. లేదంటే నీ ఆకలంతా తీరిపోయేంత తృప్తిగా నువ్వు నీ భార్యతోనో ప్రియురాలితోనో గడపగలగాలి. ఆమె అంతా నీ కోరిక అయిపోయి... నీ కోరికే ఆమె అయిపోయి... నీ పంచేంద్రియాలన్నీ ఆమెతో సంగమించి... ఆమె పంచేంద్రియాలన్నీ నువ్వు అయిపోయి.... అప్పుడు క్లియర్ అయిపోతావ్. కాని మనం ఏం చేస్తామంటే పెళ్లాం పక్కలో పడుకుని కూడా ఎక్కడో సుఖం ఉందని ఊహిస్తూ.. ఆకలి పెంచుకుంటూ... ఆ ఆకలితో ఇలాంటి విసర్జకాన్ని సిద్ధం చేస్తూ... లేదంటే కనిపించినదాని మీద పడుతూ'....

ఇక వాళ్లకు అక్కడ ఉండబుద్ధి కాలేదు.

వచ్చేశారు.

ఆ రాత్రి ఎవరు ఎప్పుడు పడుకున్నారో తెలియదు.

తెల్లారే నాయుడు అందర్నీ నిద్ర లేపాడు. బుద్ధుడు, ముచ్చు లేచి నిద్రకళ్లతో నాయుణ్ణి చూశారు.

'ఏంటి?'

'వాక్‌కి పోదాం'

'వాక్కా?'

నాయుడు జీవితంలో మార్నింగ్ వాక్ చేసి ఎరగడు. రాత్రి అతడు నిద్రపోయినట్టు కనిపించలేదు.

బుద్ధుడు, ముచ్చు నీళ్లు పుక్కిలించి స్లిప్పర్లు వేసుకొని రూమ్ బయటకు వచ్చి కిందకు దిగారు.

టైమ్ ఏడు దాటి ఉంటుంది. రిసెప్షన్ నిశ్శబ్దంగా ఉంది. బయటకు నడిచి రోడ్డు మీదకు వచ్చారు. నిశ్శబ్దంగా ఉంది. హోటళ్లు మూసేసి ఉన్నాయి. మసాజ్ సెంటర్లు మూసేసి ఉన్నాయి. డిపార్ట్‌మెంటల్ స్టోర్లు మూసేసి ఉన్నాయి. కార్ రెంటల్స్... మోపెడ్ రెంటల్స్.... ఏటిఎంలు ఖాళీగా ఉన్నాయి. రోడ్డు ఖాళీగా ఉంది. మనిషనేవాడు లేడు. ముగ్గురూ నడుస్తూ ఉంటే అప్పుడొకటీ అప్పుడొకటీ పికప్ ట్రక్కులు పోతు

న్నాయి. తలెత్తి చూస్తే హోటళ్లు. ఐదంతస్తులు... పదంతస్తులు.. దూరంగా పదిహేనం తస్తులు.... నిశ్శబ్దంగా ఉన్నాయి. బహుశా రాత్రిపూట మాత్రమే వాటికి ఉనికి. లేదా రాత్రి పూట మాత్రమే ఈ ఊరికి ఉనికి.

'శ్మశానంలో నడుస్తున్నట్టుగా ఉంది' అన్నాడు నాయుడు నడిచి నడిచి.

'శ్మశానంలో మాత్రమే ఈ టైమ్‌లో ఇంత నిశ్శబ్దంగా ఉంటుంది' అన్నాడు మళ్లీ.

బీచ్‌కు వెళ్లడానికి ముగ్గురూ చాలాసేపు రోడ్డు మీద నిలబడ్డారు టుక్‌టుక్ వస్తుందేమోనని. ఒక్క టుక్ టుక్ లేదు. బీచ్ ఇంకో రెండు కిలోమీటర్లు ఉంటుంది.

'నడుద్దాం' అన్నాడు బుద్ధుడు.

బీచ్ దగ్గర బోట్లన్నీ కట్టేసున్నాయి. ఒడ్డు నిర్మానుష్యంగా ఉంది. రాత్రి ఏమేమి విన్నదో సముద్రం ఒడ్డు మీద అలలతో పాకుతూ వెనక్కుపోతూ ఆడుకుంటున్నట్టుగా నటిస్తూ ఉంది.

ముగ్గురూ ఒకచోట కూలబడ్డారు.

సముద్రం నీలంగా ఉంది. చాలా దూరంగా లంగరు వేసిన ఓడలు కనిపిస్తూ ఉన్నాయి. బుద్ధుడు అన్నాడు–

'ఒకప్పుడు అమాయకమైన బెస్తవాళ్ల ఊరు ఇది. చేపలు పట్టుకుని బతికేవాళ్ల ఊరు. కాని వియత్నాం వార్ సమయంలో అమెరికన్లు ఇక్కడ ఆగి తాగి తందనాలాడి వీళ్లకు ఈ వినోదం అలవాటు చేసి వెళ్లారు'

ముచ్చు దూరంగా చూస్తూ ఉన్నాడు.

నాయుడు తలాడిస్తూ ఊపిరి వదుల్తూ అన్నాడు.

'నెక్స్ట్ ఏమిటి'

'ఏమిటేమిటి? మళ్లీ సాయంత్రం దాకా ఆగాలి. ఏదైనా చూడాలంటే. అప్పుడే వినోదం'

'సాయంత్రం దాకా?'

'ఊ. నువ్వే కదా మూడ్రోజులుండాలన్నావ్'

నాయుడు ఏం మాట్లాడకుండా ఉన్నాడు. ముచ్చు ఒక పుల్ల పట్టుకొని ఇసుక మీద గీతలు గీస్తూ ఉన్నాడు. ఒడ్డు మీద ఖాళీ బీరుటిన్నులు అప్పుడొకటీ అప్పుడొకటీ అలలకు గిరికీలు కొడుతున్నాయి. నాయుడికి ఏదో గుర్తుకు వచ్చింది.

'నీ సంగతి ఎలా ఉంది?'

'తగ్గాయ్'

‘ప్రపంచమంతా దీనిని ఒకరకంగా ఖరాబు చేస్తోంది. నువ్వు ఇంకో రకంగా ఖరాబు చేశావ్’ నవ్వాడు.

బుద్ధుడు నవ్వాడు. ముచ్చు కూడా ముచ్చుముఖం మాని నవ్వాడు.

‘వెళ్దామా. హోటల్లో బ్రేక్‌ఫాస్ట్ అయిపోతుంది. మళ్లీ మధ్యాహ్నం దాకా ఈ ఊళ్లో ఏం తిందామన్నా దొరకదు’

ముగ్గురూ లేచారు.

బీచ్ మీద నుంచి రోడ్డు మీదకు వచ్చేసరికి తొమ్మిదై ఉంటుంది. అదే నిశ్శబ్దం. మనిషి లేడు. నాలుగడుగులు వేశాక నాయుడు అన్నాడు.

‘బ్యాంకాక్ వెళ్లిపోదాం’

బుద్ధుడు, ముచ్చు ఆగి నాయుడి వైపు చూశారు.

‘ఇక్కడొద్దు. వెళ్లిపోదాం. మళ్లీ రాత్రికి అదంతా చూడాలి. నాకు పిచ్చెక్కేలా ఉంది’

మధ్యాహ్నం పన్నెండు గంటలకి చెకౌట్ చేశాక ట్రావెల్స్ నుంచి వచ్చిన వ్యాను వాళ్లను పికప్ చేసుకొని రోడ్డు మీదకు వచ్చింది.

నాయుడు, బుద్ధుడు, ముచ్చు విండోలో నుంచి నిశ్శబ్దంగా బయటకు చూస్తూ కూచున్నారు.

ఊరు కనిపిస్తూ ఉంది.

అప్పుడప్పుడే మసాజ్ సెంటర్లు తెరుస్తూ ఉన్నారు. అక్కడొక్కటీ అక్కడొకటీగా వాహనం కనిపిస్తూ ఉంది. హోటళ్ల సరుకులను కట్టుకొని ఉండి ఉండి మోపెడ్లు చాలా స్పీడుగా వెళుతూ కనిపిస్తూ ఉన్నాయి. రాత్రి ఏ బేరం తగల్లేదేమో ఒక పిల్ల– ఒక చౌరస్తాలో– మేకప్ వేసుకుని లిప్‌స్టిక్ పూసుకొని భుజాన బ్యాగ్‌తో ఎండలో నిలబడి దిక్కులు చూస్తూ ఉంది.

వ్యాన్ ఊళ్లో నుంచి ఫోర్ వే మీదకు ఎక్కింది.

నాయుడు ఊరి మీద నుంచి మొహం తిప్పుకొని, హైవే వైపు చూస్తూ, సీట్లో సర్దుకుని కూచున్నాడు.

మే 3, 2013

# అపస్మారకం

లిఫ్ట్ దిగుతున్నాడు. ఎవరూ లేరు. నల్లటి వెలుగు. ముద్దగా వెలుగుతున్న మైక్రో ల్యాంప్స్. టైమ్– ఏడై ఉంటుంది.

డింగ్ డాంగ్.

ఫిఫ్త్ ఫ్లోర్.

తలుపులు తెరుచుకున్నాయి. ఆ అమ్మాయి వచ్చి నిలుచుంది.

డింగ్ డాంగ్.

సన్నటి వెలుగు. ముద్దగా వెలుగుతున్న ఫ్లోరోసెంట్ మైక్రోల్యాంప్స్. ఆ అమ్మాయి.

నవ్వింది.

చేతిలో సెల్‌ఫోన్ చూసుకుంటూ, ఏమీ లేకపోయినా చూసుకుంటూ, మధ్య మధ్య తలెత్తి చూస్తూ, మళ్లీ నవ్వి, మళ్లీ సెల్‌ఫోన్‌లోకి.

– ఏంటి కొత్తఫోనా?

ఊ అని ఊరుకుంటుందనుకున్నాడు.

పొల మారింది.

– నంబర్ కావాలా?

లిఫ్ట్ దిగుతోంది. గుండె గుబిక్‌గుబిక్‌మని కొట్టుకుంటూ ఉంది. థర్డ్ ఫ్లోర్... సెకండ్ ఫ్లోర్... ఫస్ట్.... గ్రౌండ్‌కు వచ్చేసరికి ఎక్కేవాళ్లు ఎదురు పడొచ్చు. ఆ అమ్మాయితో మాట్లాడ్తూ కనిపించడం సరికాదు. నంబర్ తీసుకుంటూ కనబడటం ఇంకా సరికాదు.

లిఫ్ట్ దిగుతోంది. ఇండికేటర్ మీద ఒకటి మాయమై జీరో ప్రత్యక్షమయ్యేలోపు...

– త్వరగా చెప్పు

చెప్తోంది. రాసుకునే టైమ్ లేదు. సెల్‌లో గబగబా కీపాడ్ నొక్కాడు.

తలుపులు తెరుచుకున్నాయి. ఆ అమ్మాయి ఎగ్జిట్ వైపు. తను కార్ పార్కింగ్ వైపు. నొక్కిన నంబర్‌ను డయల్ చేసి, కట్ చేసి, సేవ్ చేసుకున్నాడు. పార్కింగ్ దగ్గర చీకటి చీకటిలాంటి చీకటి. అభిప్రాయాలేమీ లేనట్టుగా కారు. కూర్చుని స్టార్ట్ చేశాడు. టైమ్ చూసుకున్నాడు. ఏడూ పది. ఎనిమిదింటికి డాక్టర్‌తో అపాయింట్‌మెంట్. బాబుకు హైఫీవర్. నయం. తను అపాయింట్‌మెంట్ ముందే తీసుకుంది. ఈవెనింగ్ క్లినిక్స్ వచ్చాక ఇదో సుఖం. మార్నింగ్ అవర్స్‌లో అంటే ట్రాఫిక్... ఆఫీస్... నరకం.

కారు రోడ్డెక్కింది. టర్న్ తీసుకుంటూ చూశాడు. ఆ అమ్మాయి వెళ్తూ కనిపించింది. రోడ్డువారగా ఉండాల్సిన బండి లేదు. ఇవాళ పెట్టలేదా? తొందరగా కట్టేశారా? మీరు ఏమైనా చేయండి మంట మాత్రం వెలక్కూడదూ అన్నారట ఎమ్‌డీతో. క్యాంటీన్ అలా చేయలేదు. టీ మేకర్, కాఫీ మేకర్ అవీ సెకండ్‌హ్యాండ్‌వి పెట్టారు. స్టాఫ్‌కు ఫ్రీగా ఇవ్వాలంటే ఇవే. హెచ్‌ఆర్ వాళ్లు సలహా ఇస్తే ఖర్చెక్కువైందనుకున్నప్పుడల్లా నాసిరకం పౌడర్ వచ్చి చేరుతుంది. కాఫీలాంటి కాఫీ. టీలాంటి టీ. కెమికల్స్. చర్మం కింద కాన్సర్ ముడుచుకు పడుకోవడానికి దారి. అందుకే చాలామంది తాగరు. బయట బండి దగ్గర తాగుతారు. తల్లీకూతుళ్ల దగ్గర. ఖాతా. అప్పుడప్పుడు బిల్లు కోసం ఆ అమ్మాయి వచ్చీపోతూ. మొహమాటంగా బిడియంగా పలకరింపుగా నవ్వుతూ. పదహారేళ్లుంటాయా... నో..నో.. హార్డ్‌లీ ఫిఫ్టీన్.

జడ పొడుగ్గా కట్టి, చిన్న పుట్టుమచ్చలాంటి బొట్టు పెట్టి, సల్వార్ కమీజ్... నాసిరకంది అయితే ఏమి... చక్కగా. హెల్దీగా. పుష్టిగా.

– నంబర్ కావాలా?

ఏదో తన్నినట్టయ్యింది. కారు పక్కకు తీసుకొని బ్రేక్ వేసి ఆపాడు.

ఎందుకు అడిగినట్టు?

రింగ్ చేశాడు.

– పెదవే పలికిన మాటల్లోన తియ్యని మాటే అమ్మా పలికే దేవత అమ్మా

ఎత్తట్లేదు.

వదిలేసి కారు స్టార్ట్ చేశాడు. ట్రాఫిక్ ఎక్కువగా ఉంది. కారు మోకులేసి కట్టేసినట్టుగా ఇబ్బందిగా కదులుతూ ఉంది. ఒకచోట రోడ్డు మీద సగానికి పైగా బైకులన్నీ పార్క్ చేసి జనం గోలగోలగా మూగి ఉన్నారు. యాక్సిడెంట్ అయ్యిందనుకున్నాడు. కాదు. వైన్ షాప్.

– నంబర్ కావాలా?

గుబిక్‌గుబిక్‌మని కొడుతూ ఉంది. ఒక చేత్తో స్టీరింగ్ కంట్రోల్ చేస్తూ మళ్లీ నంబర్ నొక్కాడు.

– పెదవే పలికిన మాటల్లోన తియ్యని మాటే...

ఎత్తింది.

– హలో. ఎవరూ?

జీవితంలో అంత తబ్బిబ్బుగా తత్తరపాటుగా ఎప్పుడూ మాట్లాడలేదు.

– నేనే

– నేనే అంటే?

ఏం చెప్పాలి. ఆగాడు.

– ఇందాక నంబర్ తీసుకున్న సార్‌ని.

– ఓ. నువ్వా. ఎందుకు చేసినావ్ చెప్పు.

భయం వేసింది. పెట్టేశాడు. కారు ముందుకు వెళుతూ ఉంది. లోన గుబిక్ గుబిక్‌మని. పదిహేను పదహార్రేళ్ల అమ్మాయి. చక్కటి ముఖం. చిన్న పుట్టుమచ్చలాంటి బొట్టు. కింద మెడ. కింద.

మళ్లీ చేశాడు.

– పెదవే పలికిన మాటల్లోన...

ఎత్తింది.

– ఏం సంగతి. పెట్టేసినావ్

– కట్టయ్యింది

– కట్టయ్యిందా?

నవ్వింది.

అమ్మయ్య.

– ఇవాళ బండి పెట్టలే?

– లే. అమ్మ ఇంట్లో ఉంది.

– నువ్వు యీడ తిరుగుతున్నావ్?

– పైసల కోసం వచ్చినా.

– ఈ టైమ్‌లో తిరుగుతున్నావ్

– ఈ టైమ్‌లో తిరిగితే ఏమైద్ది

– ఆలస్యమైతే తిట్టదా?

– తిట్టద్.

– ఎప్పుడైనా పోవచ్చా?

– ఎప్పుడైనా పోవచ్చు.

ఆ అమ్మాయి ఫోన్ పట్టుకొని నడుస్తూ ఉంది. కారు ట్రాఫిక్‌లో మెల్లగా పాకుతూ ఉంది. గుబిక్‌గుబిక్... గుండెలు అవిసి పోతున్నాయి.

– రాత్రి పదీ పదకొండుదాకా తిరిగినా ఏమీ అనదా?

– ఏమీ అనద్.

నవ్వింది.

కారు పాకుతూ ఉంది. ఒకటి బ్రేక్... ఒకటి క్లచ్... ఒకటి ఎక్స్‌లేటర్... ఏది ఏదో అర్థం కావడం లేదు. తడబడుతూ అదిరిపడుతూ తడబడి అదిరిపడుతూ అడిగేశాడు.

– మరి నాతో వస్తావా ఇప్పుడూ?

అవతలివైపు శబ్దం లేదు.

పెట్టేద్దామనుకున్నాడు.

– ఏమిస్తావ్?

– ఏం కావాలంటే అది

– సరే. తొందరగా రా. ఫ్రెష్ పాయింట్ దగ్గరున్నా.

– వద్దు. ఇంకాస్త ముందుకెళ్లి నిలబడు.

– సరే.

కారు డివైడర్‌కు దగ్గరగా జరుపుకుంటూ యూ టర్న్ తీసుకుంటూ వెనుకకు మరలుతూ. 27–28 ఏళ్లకు పెళ్లయ్యిందతనికి. తన్ది కూడా ఈ ఆఫీసే. కన్సల్టెన్సీ. ఇప్పుడు మానేసింది. ఒకే వయసు. ప్రేమించుకున్నారు. ఉన్నంతలో బానే పెళ్లి. కాని ఒకటి ఉండిపోయిందతనికి. కతకడం గతకడం ఏమీ చూళ్లేదెప్పుడూ. ఒకసారి ఏదో పల్లెటూళ్లో పెళ్లికని వెళ్లి పెట్రమాక్స్ లైట్ల వెలుతురులో అంతా గోలగోలగా ఉంటే ఒక బంధువుల అమ్మాయి– పన్నెండేళ్లుంటాయేమో– అబ్యూజ్ చేశాడు. అయితే ఎక్కువసేపేమీ సాగలేదు. రెండుమూడు నిమిషాలు. విడిపించుకొని వెళ్లిపోయింది. ఇప్పుడు... ఈ అమ్మాయి. చక్కగా ఆరోగ్యంగా నడుము దగ్గర సల్వార్ బిగుసుకుపోయి

జబ్బల దగ్గర కమీజ్ టైట్‌గా అతుక్కుపోయి.

నడుపుతూనే తల ఒంచి అమ్మాయిని వెతుకుతూ ఉన్నాడు.

కనిపించింది.

అద్దాలు దించాడు.

– ఎక్కడ కూచోవాలె.

– ముందెక్కు

ఒక్క క్షణం తటపటాయించి డోర్ తెరిచి లోనికి దూరింది. కారు కదిలింది. కొంచెం కుడికి తీసుకొని రోడ్డు మధ్యలోకి వచ్చి ట్రాఫిక్‌లో సర్దుకొని ఏమీ ఎరగనట్టుగా. ఫిల్ములు ఉంటే బాగుండేది. డార్క్ ఫిల్మ్స్. ఇంతకు ముందు ఉండేవి. వద్దు వద్దని నసుగుతున్నా వారం క్రితం ఆపి పీకేశారు. అవి ఉంటే ఎవరున్నారో కనిపించేవారు కాదు. ఇప్పుడు? అందరూ చూస్తున్నారు. ఫుల్ హ్యాండ్స్ బ్లూ కలర్ షర్ట్, బ్లాక్ ప్యాంట్, షూస్, డీసెంట్ క్రాఫ్, స్పెక్టికల్స్, ముప్పయ్ అయిదేళ్ల వయసు. పక్కన ఈ అమ్మాయి. నలిగిన సల్వార్ కమీజ్‌తో. పొంతన లేదు. హోటల్? పోగానే డౌట్ చేస్తారు. లాడ్జ్? డేంజర్. కెబిఆర్ పార్క్ సబ్‌వే దగ్గర చీకటిలో ఆపుకుంటే? లాభం లేదు. వాకర్స్ ఇంకా తిరుగుతూనే ఉంటారు. జూబ్లీహిల్స్... ఫిల్మ్‌నగర్... మాదాపూర్. ఎస్... కావూరి హిల్స్ దగ్గర హండ్రెడ్ ఫీట్ రోడ్ ఒకటి ఉంది. ఎవరూ పట్టించుకోరు. అక్కడకు వెళ్లి పక్కకు తీసుకుని ఆపుకుంటే?

తిప్పాడు.

పక్కకు చూశాడు. అమ్మాయి కూచుని ఉంది. అలా కారులో కూచోవడం అలవాటు లేనట్టుగా కూచుని రోడ్డు మీదకు చూస్తూ ఉంది. రంగురంగుల బిజినెస్ హోర్డింగ్స్. మహేశ్‌బాబు... నాగార్జున... ఎన్టీఆర్... అల్లు అర్జున్... అందరూ పిలుస్తూ ఉన్నారు.. సేల్స్ బాయ్స్... నగలు కొంటారా నగలు... ఒకదాని వైపు చేయి చూపించింది.

– నువ్వెప్పుడైనా వెళ్లావా దీన్కి నీ భార్యను తీసుకొని?

– లే.

– నన్ను తీసుకెళ్లాలే.

– అమ్మో.

– ఏం?

– ఏం లే.  ఏం కావాలె?

– నీ ఇష్టం. నేనేం చెప్తా?

– సరే. కొంచెం దగ్గరగా జరిగి కూచో.

కళ్లలోకి చూసి, జరిగి కూచుంది. భుజం తగుల్తూ ఉంది. మెత్తగా. కాలు జరిపాడు. తగుల్తూ ఉంది. మెత్తగా. ఇంకొంచెం జరిగాడు. గుర్తొచ్చినట్టుగా అంది.

– పాకెట్ తీసుకో.

– ఏం?

– నాకేమైనా వస్తే?

ఇంకేమైనా ఉందా అన్నట్టు చూసింది. అలాగే చూశాడు. పుట్టుమచ్చలాంటి బొట్టు. కింద మెడ. కింద.

చేయి వేయబోయాడు. ఫోన్ మోగింది. ఆఫీసు నుంచి. రేపు ఉదయం పది గంట లకు మీటింగ్. పెట్టేశాడు.

– నీకు అలవాటేనా?

ఒకలాగా చూసింది.

– నాకేం అలవాటు? నా బాయ్‌ఫ్రెండ్‌తో రెండుసార్లు. బస్.

– నువ్వొప్పుకున్నావా?

– పుణ్యానికి ఒప్పుకుంటానా? ఇనార్బిట్‌మాల్‌లో తిప్పి, మూవీ చూపించి, లెగ్గింగ్సూ టాపూ కొనీమన్నా. ఓకే అన్నాడు. రెండోసారి సెల్‌ఫోన్. ఇది అదే.

చూపించింది.

– నీ వయసెంత?

కోపం వచ్చింది.

– ఓయబ్బా... ఎందుకంత కోపం?

– ఏం... నీకు సరిపోనా? టూ మినిట్స్‌కి నేను సరిపోనా?

దబాయించింది.

కారు బాగా స్లో చేసి ఆ అమ్మాయి వైపే చూశాడు.

– టూ మినిట్స్ అని ఎవరు చెప్పారు?

– ఏం... నాకు తెలీదా? నా బాయ్‌ఫ్రెండ్. వాడు టూ మినిట్సే.

లెక్కలేనట్టుగా తల ఎగరేసింది. అంతలోనే ఆగి, అనుమానంగా చూసింది.

– ఏం... టూ మినిట్స్ కాదా?

మళ్లీ ఫోన్. ఆఫీస్ నుంచే. రేపటి మీటింగ్‌కి అరగంట ముందే రావాలనీ కావలసిన

రిపోర్ట్ రెడీ చేసి పెట్టాలనీ ఇంకేదో ఇంకేదో. లాభం లేదని సైలెంట్ మోడ్‌లో పెట్టి డోర్ పానల్‌లో పడేశాడు.

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వచ్చింది. ట్రాఫిక్ చుట్ట చుట్టుకొని ఉంది. వాహనాలు. ఒకదానినొకటి ఒరుసుకొని... ఒకదానినొకటి రాసుకొని... ఒకదాని నాసిక ఒకదాని వీపుకి. బైక్ మీదున్న ఇద్దరు కుర్రాళ్లు కారులోకి తొంగి చూస్తూ వీళ్లనే ఉద్దేశించినట్టుగా నవ్వుకుంటూ ఏదో మాట్లాడుకుంటున్నారు.

– సరిగా కూచో

కూచుంది.

వాళ్ల వైపు చూడకుండా ఏమీ ఎరగనట్టుగా ఎఫ్ఎమ్ కలియబెడుతూ ఏదో స్టేషన్ పెట్టాడు. యాడ్ వస్తోంది. అమితాబ్. ఖుష్బూ గుజరాత్‌కీ. ఆ పవిత్రమైన గడ్డకు ఆహ్వానిస్తూ ఉన్నాడు. గొప్ప టూరిజమ్ స్పాట్స్ ఉన్నాయట. సమస్త శాంతి అక్కడే దొరుకుతుందట. పిలుస్తూ ఉన్నాడు.

యాడ్ అయిపోయింది.

ఇప్పుడు ఎఫ్ఎమ్ రెయిన్‌బో వార్తావాహిని.

– గాజా నగరం మీద ఇజ్రాయిల్ చేసిన యుద్ధవిమానాల దాడిలో పద్దెనిమిది మంది సామాన్యులతో పాటు ఏడుగురు చిన్నారులు బలయ్యారు. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. కాగా పాలస్తీనా మీద దాడులను మరింత తీవ్రతరం చేస్తామని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ అన్నారు.

– చిన్నారి శాన్వి హత్య కేసులో నిందితుడు రఘునందన్ విచారణకు సహక రిస్తున్నట్టు పెన్సిల్వేనియా విచారణ అధికారులు తెలియచేశారు. విచారణలో రఘు నందన్ తాను అనుకోకుండానే శాన్వి హత్య చేశానని అంగీకరించినట్టు సమాచారం.

– తెలంగాణ రాష్ట్ర సాధనలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా ఖమ్మం జిల్లా పినపాకకు చెందిన రవీంద్ర నాయక్ అనే పిజి విద్యార్థి రైలు కింద పడి.....

అమ్మాయికి విసుగు వచ్చింది.

– పాట పెట్టు.

కారు మెల్లగా అప్ ఎక్కించాడు.

– ఇదయ్యాక వస్తుంది.

కారు వేగం అందుకునేసరికి వార్తావాహిని ముగిసి పాట మొదలయ్యింది. బయట చలి. లోపల ఏసి ఆఫ్ చేసేశాడు.

– మీ నాన్న ఏమయ్యాడు?

– ఏమవుతాడు? చిన్నప్పుడే పోయాడు.

తల ఒంచుకుంది.

– ఏం చేస్తాం చెప్పూ. కిరాయి కట్టాలె. మాటలు పడాలె. అన్నీ అప్పులేనాయె.

విండోలో నుంచి బయటకు చూస్తూ కూచుంది. రోడ్డు మెరిసిపోతూ ఉంది. మార్కెట్ ధగధగలు.

దూరంగా బాంటియా కనిపిస్తూ ఉంది. అది దాటి ముందుకు పోతే హండ్రెడ్ ఫీట్ రోడ్. ఆపైన. కాళ్లల్లో ఉత్సాహం వచ్చింది. ఎక్సలేటర్ మీద బలం పెరిగింది. ఒక్క క్షణమే. మళ్లీ ఎందుకైనా మంచిదని కారు పక్కకు తీసుకొని ఆపి, మెడికల్ షాప్‌లోకి వెళ్లి పాకెట్ కొన్నాడు. దాంతో పాటు ఒక డైట్ కోక్.

అమ్మాయి కళ్లు మెరిశాయి.

– నీకూ?

– నువ్వు తాగు

టప్పున ఓపెన్ చేసి ఇచ్చాడు. డ్రైవ్ చేస్తూ చూస్తూ ఉన్నాడు. తాగుతోంది. పెదాలు తడిసిపోతూ ఉన్నాయి. అమ్మాయి. చిన్న పుట్టుమచ్చలాంటి బొట్టు. కింద మెడ. కింద.

హండ్రెడ్ ఫీట్ రోడ్‌లోకి వచ్చాడు.

నల్లగా ఉంది. ఖాళీగా ఉంది. ముందు ఒక టివిఎస్ పోతూ ఉంది. వెనకేమీ లేవు. ఇరువైపులా బయలు. మట్టి. గడ్డి. దూరంగా మినుకుమినుకుమంటున్న అపార్ట్‌మెంట్లు. వెతుకుతున్నాడు. సరిగ్గా చూసుకోవాలి. సరిగ్గా. కొంచెం చాటుగా. ఒక చోట వేగంగా లెఫ్ట్‌కు తిప్పాడు. ముతకగా, గరుకుగా, పెళ్లపెళ్లగా, గడ్డిగడ్డిగా ఉన్న బీడులోకి కారు తిరిగింది. తిరిగాక కాని అర్థం కాలేదు. ముందంతా రాళ్లే. ఠప్ ఠప్ ఠప్ అని కింద కొట్టుకుంటున్నాయి. పంక్చర్ అయితే? కాని తప్పదు. ఇంకా ముందుకు వెళ్లాడు. ఠప్ ఠప్ ఠప్.... టైర్ల ధాటికి గడ్డి అణిగి, పైకి లేవడానికి ప్రయత్నించి, అట్లాగే చతికిలపడుతూ ఉండగా ఇంకా ముందుకెళ్లి, కర్వ్ తీసుకొని, టప్పున ఇంజన్ ఆఫ్ చేసేశాడు. హెడ్‌లైట్స్ ఆఫ్. చిమ్మటలు అరుస్తూ ఉన్నాయి. వేరే ఏ శబ్దమూ లేదు.

గుడ్డి వెలుతురు. గుడ్డి వెలుతురులో దీపాల్లాగా అమ్మాయి కళ్లు.

నవ్వింది.

పదిహేను పదహార్లేళ్ల లేత అమ్మాయి.

సిగ్గుపడింది.

ఒక క్షణం బెదురుపాటుగా చూసి పర్లేదులే అన్నట్టు మళ్లీ నవ్వింది.

శరీరంలో పాము. సరసరమని పాకి మత్తుగా ఆవలించి తల ఎత్తి....

ధబ్బుమని డోర్‌ని బాదినట్టయ్యింది. ఉలిక్కి పడ్డాడు. మళ్లీ ధబ్‌ధబ్‌మని డోర్‌ని బాదినట్టయ్యింది. అదిరిపోతూ చూశాడు. ముఖాలు కనిపిస్తూ ఉన్నాయి. ఇందాకటి కుర్రాళ్లే. ఫాలో అయినట్టున్నారు. తొంగి తొంగి చూస్తూ ఉన్నారు. అద్దాల మీద చేతులు వేసి పామేస్తున్నారు.

– డోర్ తీబే సాలె...

– పొట్టీకు లాకె మజా కర్‌రారే సాలే...

బాదేస్తున్నారు.

– హమ్‌కోభీ దేరే మాకె...

అమ్మాయి కేర్‌మంది. గుండె ధడ్‌ధడ్‌ధడ్‌మని కొట్టుకుంది. అమ్మాయి పిచ్చి పట్టినట్టుగా అరిచి వెనుక సీట్‌లోకి దూకబోయి పెనుగులాడి మళ్లీ అరచి కూలబడింది.

– సాలే ఖోల్... ఫోడ్‌దేంగే హమ్.... ఖోల్ సాలే ఖోల్....

ఊపేస్తున్నారు.

ఒకడు రాయి ఎత్తి ధబ్బున ఫ్రంట్ గ్లాస్ మీద విసిరాడు. అది కుయ్యోమని మూలిగి కొంచెం చలించింది. ఇద్దరూ చెరోవైపు డోర్ హ్యాండిల్స్ పట్టుకొని లాగేస్తున్నారు. డోర్లు ఊగిపోతున్నాయ్. ఉన్మాదం. ఉన్మాదం. ఉన్మాదం. అమ్మాయి కావాలి వాళ్లకి. అమ్మాయి. చెమట. చెమట. చెమట. కొట్టేస్తోంది ముఖమంతా. అయిపోయిందివాళ. అంతా అయిపోయింది. సమస్తం.

అమ్మాయిని చూశాడు.

అమ్మా... అమ్మా... అమ్మా... తల ఒళ్లో దాచుకొని పెద్దపెద్దగా ఆక్రందనలు చేస్తూ ఉంది.

– ఊరుకో.. ఊరుకో... ఊరుకో తల్లీ...

– అమ్మా... అమ్మా... అమ్మా...

– ఊరుకో అమ్మాయ్... ఊరుకో అమ్మా....

కారు దిట్టమైనది. అదొక్కటే ధైర్యం. పూనకం వచ్చింది. నా కొడకల్లారా... ఇంజన్ స్టార్ట్ చేశాడు. క్లచ్ నొక్కి గేర్ వేసి ఫస్ట్ గేర్‌లో తీవ్రంగా రైజ్ చేస్తూ పిచ్చిగా స్టీరింగ్

తిప్పాడు. వాళ్లు ఒక్కక్షణం జంకి పక్కకు దూకారు. రివర్స్ చేసి మళ్లీ తిప్పాడు. ఒకడు బానెట్ మీద పిడికిలితో బాది తోడు రాబోయాడు. కారు సాయానికి వచ్చింది. ఎగిరి ముందుకు దూకింది. రాళ్లనూ ముళ్లనూ పిండి పిండి చేస్తూ దారి చేసుకుంది.

దారి.

అపాయం నుంచి ప్రమాదం నుంచి బయటకు విడుదల చేస్తూ దారి.

ప్రశాంతతనిచ్చే దారి.

అమ్మాయి ఊ...ఊ... ఊ... అని భయంతో దుఃఖంతో అపాయం తాలూకు తీవ్రతతో మూలుగుతూ ఉంది. కారు ఆపలేదు. సెంటర్‌లోకి వచ్చేంత వరకూ డ్రైవ్ చేస్తూనే ఉన్నాడు. ఒకచోట ఆపి, రెండు వాటర్ బాటిల్స్ కొన్నాడు. అమ్మాయి కారులోనే నీళ్లతో ముఖం తుడుచుకొని రెండు గుక్కలు తాగింది. ఏం మాట్లాడలేదు. తిరిగి నడపడం మొదలుపెట్టాడు. కారు రొద తప్ప మరేమీ లేదు. కాసేపటికి గోలగోలగా కళకళగా ఉన్న బస్తీ మొదలులో ఆపాడు.

– పోగలవుగా?

తల ఊపింది.

మరి ముఖం చూళ్లేదు.

ఒక్కపెట్టున సర్రుమని తిప్పి ఇంటి వైపు పరుగు పెట్టాడు. చెమట. చెమట. చెమట. కారిపోతూ ఉంది. ధడ్ ధడ్ ధడ్. కొట్టుకుంటూ ఉంది. భయం. కలవరం. ఏమిటో తెలియని కలవరం. ప్రాణాలు అవిసిపోతున్నాయి. పేగులు కదిలిపోతున్నాయి. దడగా ఒణుకుగా సిగ్గుగా నీచంగా అసహ్యంగా...

గడగడలాడిపోతున్న గుండెలతో సెల్‌ఫోన్ తీశాడు.

పదిహేడు మిస్డ్‌కాల్స్!

ఇంటి నుంచే.

అవును. బాబుకు జ్వరం. చాలా జ్వరం. డాక్టర్‌తో అపాయింట్‌మెంట్. ఎలా ఉన్నాడో ఏమిటో. ఏమయ్యిందో ఏమిటో. గుబగుబ లాడిపోతోంది. వజవజ వణికి పోతోంది. ఏం జరిగింది ఇందాక... ఏం జరిగింది ఇందాక... ఆ కుర్రాళ్లు.... వాళ్లను కుంది జరిగి ఉంటే... ఆ అమ్మాయికి ఏదైనా అయి ఉంటే... అడ్డొచ్చిన తనను పొడిచేసి ఉంటే... ఇద్దర్నీ చంపేసి ఉంటే...

మూత్రం... మూత్రం... మూత్రం... మూత్రం వస్తున్నట్టుగా ఉంది.

అయ్యో... అయ్యో...

ప్రాణాలు ఉగ్గపట్టుకొని కారు నడుపుతూ ఉన్నాడు. తొందరగా ఇల్లు చేరుకోవాలి. తొందరగా. బాబుని చూడాలి. తనని చూడాలి.

తొక్కుతున్నాడు. తొక్కుతున్నాడు. ఎక్స్‌లేటర్‌ని అదుముతున్నాడు.

ధన్!

ఇంటికొచ్చి పడ్డాడు.

– అయ్యో. అయ్యో. ఏమైందండీ. ఎందుకలా ఉన్నారు. ఏమైంది.

– బాబు... బాబుకెలా ఉంది.

– బాగుంది. జ్వరం కూడా లేదు. డాక్టర్ అవసరం లేదని చెప్దామని ఫోన్ చేస్తుంటే మీరు తీస్తే కదా?

– ఓ.. అవునా... పోనీలే... అవునా... అమ్మయ్య అవునా.

– ఏమిటి. ఏమిటలా ఉన్నారు. దేవుడా.

– ఏం లేదు ఏం లేదు. చిన్న యాక్సిడెంట్.

తను గబగబా వెళ్లి మంచినీళ్లు తెచ్చి ఇచ్చింది.

అవి మెల్లగా రెండు గుక్కలు తాగి, దూరంగా హాయిగా నిద్ర పోతున్న బాబును చూసుకుంటూ, తనని పక్కన కూచోబెట్టుకుంటూ, నెమ్మదిగా అతడు స్మారకంలోకి వచ్చాడు.

మార్చి 7, 2013

# ఇంకోవైపు...

బస్సులో లేడీ కండక్టర్ ఉంది.

కొంత నయం. సాయంత్రపు రద్దీలో వదిలేసిపోకుండా అందరూ ఎక్కేంతవరకూ ఆపుతుంది.

ముందు ఐదారుమంది ఎక్కారు. తర్వాత తను. సీట్లు ఉన్నాయి. కూచుంది.

'ఎక్కడికెళ్లాలమ్మా'

'మెహదీపట్నం'

నోటు తీసి ఇచ్చింది. టికెట్ ఏమిచ్చిందో చిల్లర ఎంతిచ్చిందో చూసుకోలేదు.

నిజానికి ఇది ఒంటరి ప్రయాణం. తోసుకొచ్చింది. ఎస్ఆర్ నగర్ నుంచి మణికొండ అంటే తన టూవీలర్ మీద వెళ్లొచ్చు. కాని అంతదూరం! చీకటి పడ్డాక. ఆటోలతో వేగలేం. బస్సే నయం. మెహదీపట్నం వెళ్లి అక్కణ్ణుంచి దర్గా బస్సు పట్టుకొని– మణికొండలో కూడా ఏదో కొత్త కాలనీ అని చెప్పాడు. వెతుక్కోవాలి.

సర్దుకొని కూచుంది. పాదాలు దగ్గర పెట్టుకుంది. చేతులు ఒడిలో పెట్టుకుంది. చీరకుచ్చిళ్లు, పవిట... అని సరిగ్గా ఉండేలా కూచుంది.

చిన్నప్పటి నుంచీ అంతే. తన బట్టలు చాలా శుభ్రంగా ఉంచుకునేది. మాసినవి తొడుగుతానంటే ఊరుకునేది కాదు. షూస్ మెరవాలి. సాక్స్‌లు ఉతికినవి ఉండాలి. నోట్ బుక్కుల్లో అక్షరాలు గుండ్రంగా కనిపించాలి. టెక్స్ట్ బుక్కులను బ్రౌన్‌పేపర్‌తో కవర్ చేసి పైన పాలిథిన్ కవర్ కూడా వేసి స్టేపుల్ చేసి....

ఒక్క మాట పడేది కాదు స్కూల్లో ఇంట్లో. అసలు పడటానికి ఏముంటుంది కనుక. అన్నీ సరిగ్గా చేస్తుంది. అన్నీ సరిగ్గా ఉండేలా చూసుకుంటుంది. పర్‌ఫెక్ట్ పిల్ల అని పేరు. వయసు వచ్చింది. నేనంటే నేను అని చాలామంది వెంటపడ్డారు. కాని పెద్దలు

చూసిన పెళ్లి చేసుకోవడమే పద్ధతి. అదే చెప్పింది. మీ ఇష్టమైన సంబంధమే చూడండి నాన్నా అని చెప్పింది. అలాంటిదే చూశారు. స్తోమతకు తగినట్టుగా. చెప్పుకోదగ్గ ఉద్యోగం. చెప్పుకోదగ్గ కుర్రాడు.

కాపురం మాత్రం మాట రానిచ్చిందా? అత్తయ్యా... మీరు చెప్పండి నేర్చు కుంటాను అంది. తనకు తెలుసు. కాని మర్యాద నిలపాలి కదా. ఏమో మావయ్య గారూ... మీ అబ్బాయి ఎలా చెప్తే అలా అంది. అదీ తెలుసు. కాని భర్త మాట నెగ్గించాలి కదా. పద్ధతంటే పద్ధతిగానే ఉంది. ఇంట్లో తమ గది. అత్తామామల గది. టివి రూమ్. సోఫా సెట్. ద్వారబంధనానికి వేలాడే మువ్వలు. పిల్లాడు పుట్టడానికి- ష్.... అనే పిల్లాడి పోస్టర్. తులసి కోట. ఒక పసుపు మందారం కుండీ. ఒక చిట్టి రోజాలు.

పని మనుషులు బాత్‌రూమ్‌లు కడగరు. దానికి వేరే అంటారు. ఎందుకు బాధ? ఏ రోజుదారోజు కడగాల్సిందే. తమదైనా. అత్తామామలదైనా.

అబ్బ... పర్‌ఫెక్ట్ కోడలు పిల్ల అన్నారు అందరూ.

భర్త పొంగిపోయాడు. అత్తామామలు కూడా.

అయితే తప్పు జరిగింది. ఎవరిది? ఏమో. పిల్లాడు పుట్టాడు. అందరూ పొంగి పోయారు. నెలలు గడిచాయి. బోర్లా పడలేదు. నెలలు గడిచాయి. ముద్దుముద్దుగా పాకలేదు. నెలలు గడిచాయి. ముద్దుముద్దుగా అడుగు వేయలేదు. పిడుగు పడింది పైన. భూమి కుంగిపోయింది.

ఇదంతే... రిటార్డెడ్.... నెమ్మదిగా పదిశాతమో ఇరవై శాతమో చేతికొస్తారు. మాట్లాడితే గొప్ప. నడిస్తే లాటరీ కొట్టినట్టే అన్నారు డాక్టర్లు. అత్తామామలు గుడ్లల్లో నీళ్లు కుక్కుకుని ఏడ్చారు. భర్త వారాల తరబడి తిండి తినలేదు. తను ఎంత క్షోభ అనుభవించిందో ఎవరికి తెలుసు? కాని కడుపున పుట్టినవాడు. వారసుడు. అత్తా మామలు అక్కున జేర్చుకున్నాడు. భర్త రాత్రంతా భుజాల మీద వేసుకొని జోల పాడాడు. తను కంటి మీద కనుకు లేకుండా చూసుకుంది.

ఐదేళ్లు వచ్చాయి.

ఇంట్లో కుర్చీలున్నాయి. టేబుళ్లున్నాయి. వాడూ ఉన్నాడు. ఏవో ఒకటి రెండు శబ్దాలు చేస్తాడు. ఏవో మూడు నాలుగు అడుగులు వేస్తాడు. తల్లిని చూసి నవ్వుతాడు. తండ్రిని చూసి చేతులు చాస్తాడు. బొమ్మలు తెలీవు. ఆటలూ తెలీవు. ఏమైనా చెప్తే నేర్పిస్తే అర్థమవుతుందా ఏమి? కాని న్యూస్ పేపర్లతో ఆడతాడు. నాలుగు పేపర్లు పడేస్తే వాటిని చింపుతాడు. ఎంత సంతోషమో వాడికి. చప్పుడు అయ్యేలా నవ్వుతాడు. చింపి చింపి ఒక ముక్కను చేతిలో పట్టుకుంటాడు. దానిని నేల మీద తపాతపా కొడుతూ ఉంటాడు. అదీ ఆట. తండ్రి వస్తే ఇంకా సంతోషంగా కింద తపాతపా

కొడతాడు.

తండ్రి అది చూసి సంతోషించి ఇంకొన్ని పేపర్లు తెచ్చి పక్కన కూచుంటాడు. వాడూ చింపుతాడు. తండ్రీ చింపుతాడు. ఇద్దరికీ ఆట.

కాని అన్నిసార్లూ అలాగే ఉండదు.

ఒక్కోసారి తండ్రికి కోపం వస్తుంది. ఒక్కోసారి బాధ వస్తుంది. ఒక్కోసారి అసహనం వస్తుంది. ఒక్కోసారి చీటికి మాటికి చిరాకు కూడా వస్తుంది. అదంతా తన మీద చూపిస్తాడు. కూర బాలేదు ఏంటిలా చేశావ్ అంటాడు. అన్నం సరిగ్గా వండలేదు ఏంటిలా వండావ్ అంటాడు. నా టవల్ ఎక్కడా అంటాడు. చెప్పులు కనపడి చావవేం అని అరుస్తాడు.

తను మాట్లాడదు. అత్తమామలు ఏమీ అనలేరు.

అన్నింటినీ మౌనంగా భరిస్తుంది. నవ్వుతూ ఉండటానికి ప్రయత్నిస్తుంది.

ఇవాళ పొద్దున తను వంట గదిలో ఉంది. భర్త స్నానం చేస్తున్నాడు. అత్తామామలు కారిడార్‌లో నిలబడి పక్క ఫ్లాట్ వాళ్లతో ఏవో కబుర్లు చెబుతున్నారు.

ధడ్‌మంటూ పెద్ద చప్పుడయ్యింది.

చిటాపటామంటూ అద్దం ముక్కలుముక్కలు అయ్యింది.

టీవీ.

వాడు ఎప్పుడు అక్కడకు చేరుకున్నాడో. స్టాండ్ మీద నుంచి లాగేశాడు. నయం మీద పడాల్సింది. చేతికి అందేవాడా? అందరూ పరిగెత్తుకొని వచ్చారు. వాడు నవ్వుతూ చేతిలో ఉన్న పేపర్‌ను తపాతపా కిందకు కొట్టి శబ్దం చేశాడు. భర్త స్పృహ తప్పినంత పని చేశాడు. తను గబుక్కున వొంగి వాణ్ణి ఎత్తుకుంది.

భర్త లోకంలోకి వచ్చాడు. చాలా కోపం వచ్చేసింది.

'ఏం చేస్తున్నావే చెత్తముఖందానా' అరిచాడు.

'చూసుకోనక్కర్లేదా పిల్లాణ్ణి. ఎక్కడ చస్తున్నావ్ సుత్తిముఖందానా' ఊగిపోతు న్నాడు. టవల్ కట్టుకున్నాడు. బుస కొట్టినట్టుగా తిరుగుతున్నాడు.

'ఎన్నని పడాలే. ఎన్నని చూడాలి. ఎందుకు ఇలా చేసిపెట్టావ్. ఎందుకు నా ఖర్మ ఇలా కాల్చావ్. అన్నీ పర్‌ఫెక్ట్‌గా చేసేదానివి కదా. ఇదెందుకు ఇలా తగలేశావ్. ఈ డిఫెక్టును జీవితాంతం ఎలా భరించాలే'... అనవలసిన మాటలన్నీ అన్నాడు. ఆ తర్వాత బ్రేక్‌ఫాస్ట్ చేయకుండా ఆఫీస్‌కు వెళ్లిపోయాడు.

అత్తామామలకు ఆ ఇంట్లో ఉండటం హింసగా ఉంది.

ఎవర్నని ఏమంటారు?

'ఊరుకోమ్మా.. ఊరుకో' అని గదిలోకి వెళ్లి తలుపేసుకున్నారు.

కాని తనకే. చాలా కష్టంగా అనిపించింది. నొప్పిగా. దేవుడా... ఎంత నొప్పి ఇది. తను చేసుకునే పనే అయితే పర్‌ఫెక్ట్‌గా చేసుకునేదేనే. ఇతనూ కలిశాడుగా. కలిసి చేసిన పని.

విడాకులు చాలా పెద్దమాట కాని ఒక్కోసారి అది తమలపాకు కంటే పలుచగా చీపురుపుల్ల కంటే చులకనగా అయిపోతుంది. దానిని దాటి ఎంతో దూరానికి వెళ్లిపోయే విషయాలు సంభవించినప్పుడు మరి వెనక్కు రావడం కష్టం. ఒక దెబ్బ కింద దాకా అణిచిపెట్టి సమస్తాన్ని ఛిన్నాభిన్నం చేశాక ఇక మందూ మాకూ బొత్తిగా అనవసరం.

అందుకే తను విడాకులు తీసుకోవాలనుకుంది.

పిల్లాణ్ణి తీసుకుని వెళ్లిపోవాలనుకుంది.

అందుకే ఇప్పుడు అడ్వకేట్ దగ్గరకు వెళ్లడం. తమ ఊరివాడే. తన తండ్రికి స్నేహితుడు. ఇంటికి రామ్మా మాట్లాడుకుందాం అన్నాడు. పిల్లాణ్ణి అత్తామామలకు అప్పజెప్పి బయలుదేరింది.

కాని–

రేపు ఎలా?

తను చదువుకుంది. కాని ఇప్పుడు ఉద్యోగం అంటే. తల్లిదండ్రుల ఆర్థిక స్థితి? అంతంతమాత్రం. బతుకు మళ్లీ మొదటి నుంచి మొదలుపెట్టాలి. పిల్లాడి బాధ్యత ఒంటరిగా మోయాలి. మోస్తుంది. ఎందుకు మోయదు. వాణ్ణి తను కంది. తన బిడ్డవాడు. బంగారు తండ్రి.

ధైర్యం తెచ్చుకుని కూచుంది.

అటూ ఇటూ పరికించింది. మొదటి వరుసల్లో అంతా ఆడవాళ్లు ఉన్నారు. డల్‌గా వెలుగుతున్న బల్బుల్లో డల్‌గా కనిపిస్తూ ఉన్నారు. లేడి కండక్టర్– అందరికీ టికెట్లు కొట్టి అలసిపోయినట్టుగా కూచుని ఎటో చూస్తూ ఉంది. ఈమె ఇప్పుడు డ్యూటీలో ఉందంటే రాత్రి పది వరకూ షిఫ్ట్ ఉండొచ్చు. అప్పుడు డిపోకు వెళ్లి– లెక్కాపత్రం అప్పజెప్పి– ఇంటికి చేరి–

ఆమె భర్త ఎలాంటివాడో. సంపాదిస్తాడో లేదో. ఈమె సంపాదనను ఈమెకే ఇస్తాడో లేదో. అసలు ఎంత అవసరం ఉంటే ఈ ఉద్యోగం చేస్తోందో ఏమో. రోజూ వేళగాని వేళల్లో– నిలువుకాళ్ల కొలువు– వందలమంది మగాళ్ల మధ్య. రాసుకునే పూసుకునే మగాళ్ల మధ్య.

బస్సులో ఉన్న అందరు ఆడవాళ్లవైపు మళ్లొకసారి చూసింది.

ఎవరూ పెద్దగా మాట్లాడుకోవడం లేదు. అలా కూచుని ఉన్నారు. ఎవరి లోపల ఏముందో. ఎవరి గుండెల్లో ఏ బడబాగ్ని దాగుందో. తను ఇక్కడ కూచుని ఉంది. తన లోపల ఏముందో వీళ్లెవరికైనా తెలుసా?

తన అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ల వాళ్లు గుర్తుకొచ్చారు.

ఒన్నాట్ టూ ఆమె. మొన్న లైపో చేయించుకుని ప్రాణం మీదకు తెచ్చుకుంది. ఏం తక్కువ తనకు? అన్నీ ఉన్నాయి. కాని లావైపోయావ్ లావైపోయావ్ అంటున్నాడట మొగుడు. డాక్టర్ దగ్గరకు వెళ్లింది. కొంచెం తెలియక నాలుగు లీటర్లు తీయాల్సింది ఎనిమిది తీశాడు. ఇన్‌ఫెక్షన్స్.

త్రీ జీరో ఫోర్ ఆమె! భర్తకు వచ్చే జీతం ఇంటిలోన్‌కూ నెలవారీ ఖర్చులకూ సరిపోతుంది. తాగుడుకి కావాలి. అందుకని కనిపించిన ఫ్లాట్‌వాడినల్లా అప్పడిగేస్తాడు. తిరిగి ఇవ్వడు. ఈమె సిగ్గుతో చచ్చిపోతుంది. దాదాపుగా ఇంట్లో నుంచి రాదు. ఇదో రకం ఖైదు.

ఇక ఫైవ్ లెవన్ ఆమె అయితే సైకలాజికల్ పేషంటే. చిన్నప్పట్నించి చదివి చదివి ఆఫీసర్ అవ్వాలని పంతం పట్టి గ్రూప్ వన్ కొట్టింది. ఏం లాభం. నాలుగేళ్లు. ఇప్పటికి లీవు పెట్టించి. పిల్లల కోసమట. అతడు ఒక్కరోజు కూడా లీవ్ పెట్టకుండా వెళ్లిపోతాడు. తను ఇంట్లో ఉండాలి.

మళ్లీ తెల్లారో సాయంత్రంపూటో అందరూ టాట్ లాట్ దగ్గర కలుస్తారు. పిల్లలను ఆడుకోవడానికి వదిలిపెట్టి ఏవో కబుర్లు చెప్పుకుంటారు. కాని ఎవరి లోపల ఏముందో ఎవరికి తెలుసు కనుక. ఈ నగరంలో ఎవరితో చెప్పుకోగలం కనుక.

అప్పటికీ పొద్దున ఫోన్‌లో అడ్వొకేట్‌తో అంతా చెప్పుకొని ఏడ్చింది.

'తల్లీ... ఇలాంటివన్నీ మామూలు. మగాళ్లు ఏదో చికాకులో నాలుగంటారు. ఓపిక పట్టు. రేపటి వరకూ ఆగు. అంతా మామూలైపోతుంది' అన్నాడు.

'లేదు బాబాయ్. ఇంక కష్టం'

'సరే. నువ్వంతగా చెప్తున్నావంటే సాయంత్రం రా. మాట్లాడదాం. చూడూ. మీ నాన్న వేరు నేను వేరు కాదు. నిన్ను చిన్నప్పుడు ఎత్తుకొని ఆడించాను. అంతగా కష్టం వస్తే నా దగ్గరే ఏదైనా పని చేసుకో. కంప్యూటర్ అవీ నేర్చుకొని చేయగలవు కదా'...

మెహదీపట్నం వచ్చింది.

బస్సు దిగి మళ్లీ బస్సు ఎక్కింది.

దిగాల్సిన దగ్గర దిగి, ఓయూ కాలనీ మీదుగా నడుచుకుంటూ.. ఇదే మణికొండ అంటే...

వాళ్లనీ వీళ్లనీ అడ్రస్ అడుగుతోంది.

అటు వెళ్లు ఇటు వెళ్లు అని చెప్తున్నారు.

కొత్త కాలనీ... ఇంకా సరిగ్గా నలుగురికీ పరిచయం కాలేదు.

కొంచెం బెరుగ్గా కొంచెం కంగారుగా నడుస్తోంది.

ముప్పయ్ రెండేళ్ల స్త్రీ– ఒక సమస్య వల్ల సతమతమవుతూ– ఆ సమస్యకు పరిష్కారం వెతుకుతూ– అది పరిష్కారమో కాదో అని ఆందోళన చెందుతూ–

మలుపు తిరిగింది.

స్ట్రీట్ లైట్స్ లేవు.

చీకటిగా ఉంది.

దూరంగా అక్కడొకటీ ఇక్కడొకటిగా ఇండిపెండెంట్ ఇళ్లు.

ముందుకు నడిచింది.

నలుగురు వచ్చారు.

ఆగింది.

ముప్పయ్ రెండేళ్ల స్త్రీ– ఒక సమస్య వల్ల సతమతమవుతూ ఆ సమస్యకు–

ముందుకు వచ్చారు.

భయపడింది.

ముప్పయ్ రెండేళ్ల స్త్రీ– ఒక సమస్య వల్ల సతమతమవుతూ–

చుట్టుముట్టారు.

ముప్పయ్ రెండేళ్ల స్త్రీ–

అబ్బ.. అబ్బ... ఏముందిరా.

ముప్పయ్ రెండేళ్ల–

ఆత్రపడ్డారు.

ఆ పెదాలు ఆ పెదాలు.... వాళ్లకు వేరే పెదాల్లా అనిపించాయి. ఆ ఛాతి ఆ ఛాతి... వాళ్లకు ఇంకేదోలా అనిపించింది. ఆ నడుము ఆ నడుము.... అబ్బా... ఆమె కూచునే చోటు ఆమె కూచునే చోటు... ఇస్స్ అబ్బా.... ఆమె అణువణువూ... ఆమె కణ కణమూ... గబగబా చుట్టుముట్టేశారు. గబగబా దడి కట్టేశారు. చేతులు పడుతున్నాయి.

ఎక్కడెక్కడో పడుతున్నాయి. తాకుతున్నారు. ఎక్కడెక్కడో తాకుతున్నారు. వత్తేసి... నలిపేసి... పిసికేసి.... ఒకడు ఆన్చుకున్నాడు. ఒకడు తగిలించాడు. ఒకడు ఇంకేమిటో చేశాడు. అబ్బ అబ్బ... ఎంగిలి పడుతూ ఉంది.... ఉమ్మి తాకుతూ ఉంది... పాము పాకుతూ ఉంది.... అబ్బ అబ్బ....

రెండు మూడు నిమిషాలు.

కళ్లు మూసి తెరిచేంతలో పరిగెత్తుకొని వెళ్లిపోయారు.

ఆమె–

ముప్పయ్ రెండేళ్ల స్త్రీ–

ఏదో సమస్యతో సతమతమవుతూ– ఆ సమస్యకు పరిష్కారం వెతుకుతూ– అది పరిష్కారమో కాదో తెలియకుండా– అగమ్యగోచరంగా– దిక్కుతోచక– భయం భయంగా– అక్కడకు వచ్చి–

ఒక ఆకారంగా

ఒక శరీరంగా

మగాళ్లు చేతులు వేసే కొన్ని అవయవాలుగా ఆ సందు మలుపులో అలా పడి ఉంది.

మే 9, 2013

# బియాండ్ కాఫీ

‘వాడు ముందు నా కుక్కను చంపేశాడండీ’ అందామె.

‘ఇప్పటికీ నాకు ఆ కుక్క అరుపులే వినిపిస్తూ ఉంటాయి. నిద్రలో కూడా వినిపిస్తూ ఉంటాయి. ఉలిక్కిపడి లేస్తూ ఉంటాను. పాపం... సునీల్’...

‘సునీల్?’

‘అవును. సునీలే. అది మా తమ్ముడి పేరు. వాడి పేరే నా కుక్కకు పెట్టుకున్నాను’

‘తమ్ముడి పేరా?’

‘ఎందుకు ఆశ్చర్యపోవడం? వాడిప్పుడు లేడు. పోయాడు. వాడిక్కూడా తెలియదు పోతాడని. దగ్గు వస్తోందని చెప్పాడు. ఇక్కడికే హైద్రాబాద్‌కు వచ్చి చూపించుకున్నాడు. ఎక్స్‌రే చూస్తూ డాక్టర్ పెట్టిన మొహాన్ని గమనించగానే అర్థమైపోయిందట పోతాడని. నేను కూడా ఎక్స్‌రే చూశాను. చిన్న డాట్‌లా కనిపించింది. ఒక్క నెల. డాట్ డాట్ డాట్ పెరిగిపోయి’....

ఫ్రెష్‌లైమ్ సోడా వచ్చింది. రెండు పొడవైన గ్లాసులు. లోపల కొంచెం బరువెక్కినట్టుగా కనిపిస్తున్న నీళ్లు. ముందుకు వొంగి గ్లాసు బయటకు వచ్చిన స్ట్రాలు. తెల్లవి.

‘తాగండి’ ఆమె అందుకుంది.

‘ఊ’ అన్నాను.

తగలొద్దు తగలొద్దు అనుకుంటాను ఇలాంటి కేసులకు. మళ్లీ తగులుతాను. ఏవో చెప్తుంటారు. చెప్తున్న వాళ్లందరినీ చెప్పిన వాటన్నింటినీ సరే అనం. కాని– ఏం చెప్తాం. అర్థం చేసుకోవాలి.

‘మీరు ఇంతకు ముందు వచ్చారా?’

‘లేదు ఇదే రావడం’

‘ఇది తెలీదా. ఆశ్చర్యంగా ఉంది. మోస్ట్ హ్యాపెనింగ్ ప్లేస్. మీరెక్కువగా బయట తిరగరు లాగుంది’

‘తిరగను’

‘ఇటు రండి’ లేచింది.

ఒక సిప్ కొట్టిన గ్లాసును చేతిలో పట్టుకుంది. నేను కూడా పట్టుకున్నాను. ముందుకు నడిచింది. నేను వెనుక. నల్ల జీన్స్ వేసుకుంది. ఫుల్ స్లీవ్స్ గ్రీన్ టీ షర్ట్. హైహీల్స్.

‘ఇటు చూడండి’... చూపించింది.

గోడ మీద వరుసగా పెయింటింగ్స్ ఉన్నాయి. కొన్నింటి మీద పూర్తి సంతకాలు ఉన్నాయి. కొన్నింటి మీద పొట్టి సంతకాలు. దాదాపుగా ఆ పేర్లేవీ నాకు తెలిసే అవకాశం లేదు. ‘ఆలయం’ అనే సబ్జెక్ట్ తీసుకొని ఎవరో ఒక అరడజను పెయింటింగ్స్ వేసి ఉన్నారు. ఒక పూలసజ్జ పట్టుకున్న తమిళ యువతి. కళగా అందంగా ఉంది. మధురై టెంపుల్‌ది మరొకటి. లోపల నాలుగైదు చైర్లలో ఒక్కొక్కరే కూచుని వై ఫైకి కనెక్ట్ అయ్యి ల్యాప్‌టాప్‌లు పెట్టుకొని ఏదో పని చేసుకుంటున్నారు. బయట మేము కూచున్న ఓపెన్ ప్లేస్‌లో వెదురు పొదలు... ఒకో టేబుల్‌కు ఒకోటిగా వేసిన హట్స్... నల్లటి టేబుల్స్... నల్లటి కుర్చీలు... మంచి గాలి... ఎంతసేపైనా కూచోబుద్ధయ్యే ఆంబియన్స్... జూబ్లీహిల్స్‌లో రద్దీగా ఉండే చెక్‌పోస్ట్‌కు ఫర్లాంగు దూరంలో రోడ్డు మీద అలా ఎంటర్ కాగానే లోపల అంతా మారిపోయే ఇలాంటి ఒక చోటుందని తెలియదు.

‘అందుకే దీని పేరే బియాండ్ కాఫీ. ఉత్త కాఫీ తాగడమేనా జనానికి పని? కూచోవాలి. మాట్లాడుకోవాలి. పెయింటింగ్స్ కొనుక్కోవచ్చంటే కొనుక్కోవచ్చు. బ్రౌజ్ చేసుకోవచ్చు. ఇంటర్వ్యూలు ఉంటే ఇక్కడే లాగించవచ్చు. ఉద్యోగం ఊడిపోయిందనుకోండి మళ్లీ దొరికే వరకూ ఇక్కడే ఒక నాలుగైదు వందలు ఖర్చు పెట్టుకుంటే రోజంతా గ్రీన్ టీ తాగుతూ ఉండిపోవచ్చు. సుఖంగా లేదూ? అందుకే ఇది బియాండ్ కాఫీ’

మళ్లీ వచ్చి మా టేబుల్ దగ్గర కూచున్నాం.

‘మీకెలా తెలుసు ఇది?’

‘ఎలా తెలుసా? ఒంటిగా ఉండే నా బోటి దానికి ఇలాంటివి తెలియక ఏం చేస్తాయి. వచ్చి ఇక్కడే కూలబడతాను. గ్రీన్ టీ– ఛీ... ప్రతిసారి గ్రీన్ టీ ఏంటి... నెక్స్ట్ టైమ్ మీకు ఇక్కడి స్పెషల్– అరకు కాఫీ తాగిస్తాను. అరకు నుంచి తెచ్చిన గింజలతో

అప్పటికప్పుడు చేసి ఇస్తారు. ఇంకెక్కడా దొరకదు. సూ...పర్' బొటనవేలిని చూపుడు వేలితో కలిపింది.

ఫ్రెష్ లైమ్ సోడా ముగించాను.

వాచ్ చూసుకున్నాను. ఎనిమిదిన్నర. ఇక్కడికి రావడానికి ఆఫీస్ నుంచి తొందరగా బయటపడ్డాను. ట్రాఫిక్. అడ్రస్ అర్థం కాక ఇంకో పది నిమిషాలు. ఇక్కడో అరగంట. చాలు. ఇంక బయట పడాలి.

'వెళ్దాం'

'వెళ్దామా!'

'ఏంటి?'

'ఏంటండీ... అంత టచ్ ఇచ్చారు?'

'టచ్చా?'

'మీరు నాకు ప్లాన్ చెప్పలేదు'

'ఏం ప్లాన్'

'అదే మా ఆయన్ని. వాణ్ణేసెయ్యాలి'

నాకు చల్లగా అయిపోయింది.

'మీ ఆయన్ని వేసేయడమేంటి?'

'అంటే– ఓ గాడ్– మీరనుకుంటున్నారా? మీరేసేయక్కర్లేదు. నేనేసేస్తాను. మీరు ప్లాన్ చెప్తే చాలు. అంటే ప్రాణాల్తో లేపేయడం కాదు. ఎక్స్‌పోజ్ చేయాలి. ఇలాంటి వాళ్లని ముఖానికి మసి రాసి వదిలిపెట్టాలి. అప్పుడు కరెక్ట్'

ఆమె వైపే చూశాను. ఇంతదాకా గమనించలేదు. కొంచెం తేడా ఉన్నట్టుంది. ఒళ్లో పెట్టుకున్న హ్యాండ్ బ్యాగ్ హ్యాండిల్స్‌ని పదే పదే నిమిరేస్తూ ఉంది. నిమురుత్తూ నిమురుత్తూ మాట్లాడుతూ... మాట్లాడుతూ మాట్లాడుతూ నిమురుత్తూ....

'రేపు మాట్లాడదాం'

'నో... నో... మీరు ఏదో ఒకటి చెప్పాల్సిందే. ఇంత పెద్ద రైటరూ... జర్నలిస్టూ... చేతిలో పేపర్ పెట్టుకొని... ఊ'....

పట్టుదలగా చూస్తూ ఉంది.

అభిమానులని కలవాలని ఎవరికి ఉండదు? కాని ఇలా జరిగితే ఫోన్ నంబర్ కాదు ఇక మీదట పుస్తకాల్లో ఈ మెయిల్ కూడా లేపేస్తే?

టైమ్ చూసుకున్నాను.

'సరే. ఒక అరగంట'

'ఏంటి అరగంట?'

'ఏదో చెప్పండి'

'ఈ అరగంట పావుగంట నా దగ్గర కుదర్దు. ఇన్నిసార్లు వెంటపడింది ఈ మాత్రం లింగు లిటుక్కుకా?'

అలాగే చూస్తూ ఉన్నాను.

'మనుషులంటే మీక్కూడా తేలిగ్గా ఉన్నట్టుంది మా ఆయనలాగా. ఏంటంత బిజీ. ఉండండి'

ఉత్తపుణ్యానికి సెల్ చేతిలోకి తీసుకున్నాను. ఉత్తపుణ్యానికి మెనూలోకి వెళ్లి ఇన్‌బాక్స్‌లోకి వెళ్లి చూసుకున్న మెసేజ్‌నే చూసుకుని మళ్లీ బ్యాక్‌కొచ్చి- భయం తెలియకూడదు కదా.

'చెప్పండి'

'ఫస్ట్ వాడు మా కుక్కను చంపేశాడు'

'ఎవడు?'

'మా ఆయన'

'ఎందుకు?'

'నేను సుఖంగా ఉండకూడదనీ'....

మనిషి లోగొంతుకలోకి వెళ్లిపోయింది. తల కొంచెం కిందకు దించుకుంది. ముఖం ఉదాసీనంగా మారిపోయింది. ఎదుటివాళ్లతో నిమిత్తం లేకుండా కష్టం చెప్పుకోవాలనుకునే మనిషి పెట్టే ముఖం అది.

'మా పెళ్లినాటికే మా అమ్మా నాన్నా చనిపోయారు. నాకు మిగిలిందల్లా నా తమ్ముడు. పెద్ద ఆఫీసరు. వెరీ జంటిల్‌మెన్. ఈసారి మీకు ఫోటో చూపిస్తాను. సోడా బుడ్డీ కళ్లద్దాలు పెట్టుకొని ఎప్పుడూ నవ్వుతూ ఉంటాడు. దేవుడి ముఖంవాడిది. వాడున్నాడని నాకు ధైర్యం. సరే. పెళ్లయి పోయింది. రోజులు గడుస్తున్నాయి. మా ఆయన సంగతి నాకు తెలిసి నేను సర్దుకునేలోపు వీడు పోయాడు. ఒక కొడుకు నాకు. మేనమామ పోలిక వచ్చింది వాడికి. ఐఐటి ముంబై కొట్టాడు. అక్కడికెళ్లాక వాడిలోకం వాడిది. ఆ తర్వాతైనా వాడు ఎటెటో వెళ్లిపోతాడుగాని నాకు దక్కేది ఏముంది. ఎప్పుడైనా ఫోన్లు. లేకుంటే మెయిళ్లు. లంకంత కొంప. పక్కలో బల్లెంలా మొగుడు.

నన్ను కాపాడింది సునీలే. బాస్టర్డ్... దాన్ని కూడా లేకుండా చేశాడు'...

'అంటే?'

'అంటే ఏంటి? నేను ఒంటరిగా ఉండాలి. నాకు పిచ్చెత్తాలి. నేను సంకనాకిపోవాలి. ఏం అర్థం కాలేదా?'

హ్యాండ్‌బ్యాగ్ హ్యాండిల్స్‌ని పదేపదే వేగంగా నిమిరేస్తూ ఉంది. ఇంకోటి కూడా గమనించాను. కుదురుగా కూచోలేకపోతూ ఉంది. రెప్పలు నార్మల్‌గా కొట్టుకోవడం లేదు. ఒక ధోరణి లేనట్టుగా వెంటవెంటనే ఆర్పుతోంది.

'డాక్సండ్ జాతి ఇష్టం నాకు'

'డాక్సండ్?'

'ఏం... మీకు కుక్కల గురించి ఏమీ తెలియదా?'

'ఏమీ తెలియదు'

'ఊహూ... ఇరవైనాలుగ్గంటలూ కూచుని కుయ్‌కుయ్ కుయ్‌కుయ్‌మని రాసుకోవడమేనా? మీలాంటివాళ్లు పెద్ద నసగాళ్లయి ఉంటారు. మీ ఆవిడ ఓకేనా? ఉందా ఇంకా?'

నేను మళ్లీ ఉత్తపుణ్యానికి సెల్‌ఫోన్ చేతిలోకి తీసుకున్నాను. చూస్తున్నాను.

'నడుం పొడుగ్గా ఉండి కాళ్లు నేలకు అంటుకుపోయినట్టుగా ఉంటుంది చూడండి బుజ్జి కుక్క అదీ డాక్సండ్ అంటే. అది ఇష్టం నాకు. వెతికి వెతికి కొని దానికి సునీల్ అని పేరు పెట్టుకున్నాను. ఈ వెధవ క్యాంపులని పోయేవాడు కదా. తోడుగా ఉంటుందని అనుకున్నాను. కొత్తల్లో సూట్‌కేస్ సర్దడం, బ్రష్‌లూ పేస్ట్‌లూ అండర్‌వేర్‌లూ పెట్టడం, ఒకటికి నాలుగుసార్లు బట్టలు సరిచూడటం... వీడేదో ఏలడానికి పోతున్నట్టు. తీరా వీడు ఎక్కడికిపోతున్నాడో తెలుసా?'

'ఎక్కడికి?'

'ఎవర్తోనో పోవడానికి'

పళ్లు కొరుకుతున్నట్టుగా అనిపించిందిగాని అంతకు సమానంగా రెప్పలు కూడా టకటకా కొట్టుకున్నాయి.

'నేను సరిపోనా వీడికి? నా దగ్గర లేనిది ఏముంటుంది ఎవరి దగ్గరైనా? ఏముంటుంది మీరు చెప్పండి? ఏ ఆడదాని దగ్గరైనా ఏముంటుంది ప్రత్యేకంగా?' రెట్టించింది.

చూస్తూ ఉన్నాను.

నవ్వింది.

నవ్వినప్పుడు బాగుంది. ముక్కు మీద చాలా సన్నటి పుడక ఉంది. అది కూడా బాగుంది.

'మీకో కథ చెప్పాలి'

'కథా?'

'చిన్న కథే. మా నానమ్మ మణెమ్మ చెప్పింది. మా తాత కూడా ఈ ముండమోపి పనులతోనే మమ్మల్ని బికారుల్ని చేయబోయాడులేండి. అందుకని మా నానమ్మ ఈ కథను పదే పదే చెప్పేది. ఒక రాజంట. ఉత్త ముండల ముటాకోర్ అంట. కనిపించిన ఆడదాని వెంటల్లా పడేవాడంట. అలాగే మంత్రిగారి భార్య మీద కూడా కన్నేశాడంట. ఆ మంత్రిగారి భార్య మల్లెపూల వాసనతో ఉండేదట. కళ్లల్లో నీలాలు దాచుకొని ఉండేదట. ఒంటి మీద దానిమ్మ విత్తనాల రంగు ఉండేదట. అలాంటి ఆడది కావాలని వెంటపడ్డాడంట. కాదనడానికి లేదు. భర్త తల పోతుంది. లేదనడానికి లేదు. రాజ్యంలో నుంచి నీడే పోతుంది. సరే రమ్మనమనండీ అని కబురు చేసిందంట మంత్రి భార్య. రాజు వచ్చాడంట. వచ్చేసరికి గదిలో మంచం మీద మంత్రి భార్య కూచుని ఎదురుగా బల్ల మీద ఏడురంగుల ఏడు కూజాలను మూతలు పెట్టి ఉంచిందంట. ఎడంగా ఇంకో కూజాను ఎనిమిదో కూజాగా పెట్టిందంట. రాజు రావడంతోటే రాజా– ముందు ఆ ఏడు కూజాలలోని నీళ్లు తాగండి అన్నదంట. అప్పటికే కింద పడనా మంచాన పడనా అన్నట్టుగా ఆత్రపడి ఉన్న రాజు మారు మాట్లాడకుండా ఏడు కూజాలలోని నీళ్లూ తాగాడంట. ఎలా ఉన్నాయి అని అడిగిందంట మంత్రి భార్య. బాగున్నాయి అన్నాడంట రాజు. ఏడు కూజాల్లోని నీళ్లలో తేడా ఏమైనా ఉందా అని అడిగిందంట మంత్రి భార్య. లేదు అన్ని నీళ్లూ సమానంగానే ఉన్నాయి అన్నాడంట రాజు. మరి నీళ్లన్నీ సమానమే అయినప్పుడు ఈ ఎనిమిదో కూజా కోసం ఎందుకు ఆశపడుతున్నావో చెప్పు అన్నదట. కొత్తగా నువ్వు తీర్చుకునే దాహం ఏముంటుంది అని కూడా అన్నదట. రాజు సిగ్గుపడ్డాడట. పడి వెళ్లిపోయాడట. ఈ కథను ప్రతి మగ నా బట్ట ఛాతీ మీద పచ్చబొట్టు పొడవాలని మా నానమ్మ ఎప్పుడూ అనేది'

టైమ్ చూసుకున్నాను.

తొమ్మిది దాటిపోయింది.

కాసేపు ఊరికే ఉన్నాను.

ఆమె కూడా ఊరికే ఉంది.

'వెళ్దాం'

'ఊ. వెళ్దామా'

వెయిటర్‌ని పిలిచి బిల్ తెమ్మనమని చెప్పింది.

మళ్లీ ఊరికే కూచుంది.

'ఐ యామ్ హ్యాపీ' అంది.

'ఎందుకు?'

'ఏం లేదు. కాసేపైనా మీతో కబుర్లు చెప్పాను. మామూలుగా అయితే ల్యాప్‌టాప్ తెచ్చుకొని ఏదో ఒక పుస్తకాన్ని బ్రౌజ్ చేసుకుని చదువుకుంటూ ఉంటాను. ఎప్పుడూ చదువుకుంటూ ఉండటం కూడా బోరే కదా'

'అవును'

ఏదో గుర్తొచ్చినట్టుగా సెల్‌ఫోన్ చేతిలోకి తీసుకుని టచ్ స్క్రీన్ మీద మునివేళ్లను చకచకా కదిపింది. ఏదో ఫోల్డర్ వెతికింది. తలాడించింది.

'ఊ... ఇది చూడండి' సెల్ ఇటుకి తిప్పండి.

ఏదో వీడియో క్లిప్ ప్లే అవుతోంది.

'ఓ... ఓ... ఓ'... అదిరిపోయాను.

రెండు మూడు సెకన్లు కూడా కాలేదు.

సెల్‌ని తన వైపుకు తిప్పుకొని క్లిప్‌ను స్టాప్ చేసింది.

ఎవరో వయసొచ్చిన పిల్ల. స్నానం చేస్తోంది. కీ హోల్ దగ్గర పెట్టి లేదా కీ హోల్ లాంటిది ఏర్పాటు చేసి తీసి ఉంటారు.

చెమట పట్టింది.

ఆమె హ్యాండ్ బ్యాగ్ హ్యాండిల్స్‌ని పదేపదే వేగంగా నిమిరేసింది.

'ఇది మా ఆయన సెల్‌లోనిది. ఆయనకు తెలియకుండా నా సెల్‌లోకి ఎక్కించా'

ఏం మాట్లాడాలో తోచకుండా చూస్తూ ఉన్నాను.

'ఎవరిదని అడగరేం?'

'ఎవరిది?'

'మా బంధువుల అమ్మాయిది. ఏదో ఎగ్జామ్ రాయడానికి వచ్చి పది రోజులు ఉంది మా దగ్గర. అప్పుడు తీశాడు'

బిల్ వచ్చింది. నేను నటించకుండా చూస్తూ ఉన్నాను. తనే పే చేసింది. పిలిచింది తను.

'మనం రేపొద్దున కలుద్దామా బ్రేక్‌ఫాస్ట్‌కి?'

‘బ్రేక్‌ఫాస్ట్?’

‘ఏం? మీ ఆవిడ చేస్తేనే తింటాను అని ఒట్టు పెట్టారా. బ్రేక్‌ఫాస్టే’

‘ఎక్కడా?’

‘ఇక్కడే. రోడ్ నెం. 36. జూబ్లీహిల్స్. బియాండ్ కాఫీ’

వస్తాననిగాని రాననిగాని చెప్పకుండా బయటికొచ్చి బయలుదేరాను. డ్రైవ్ చేస్తూ ఉంటే ఆ క్లిప్పింగే గుర్తుకు వచ్చింది. మహానుభావుడి అవతారం ఎత్తి మర్యాద నటిం చడం ఆత్మద్రోహమే కాని అలాగని పూర్తిగా అదే అని కాదు. మంచీ చెడూ లోపల ఒకలాగా బయట ఒకలాగా కలగాపులగం అయిపోయింది.

పొద్దున ఆరూ ఆరున్నరకి రెండు మూడు బీప్‌లతో రెండు మూడు మెసేజ్‌లు వచ్చాయి.

‘బియాండ్ కాఫీ. ఎట్ ఎయిట్ థర్టీ’...

వాకింగ్‌లాంటిది రోజూ చేస్తాను. అది చేయలేదు. పేపర్లు. అవీ చూళ్లేదు. బయలు దేరాను.

‘ఇదేం చోద్యం?’

‘ఫ్రెండ్‌ని కలవాలి’

‘ఇడ్లీ పెట్టాను. ముందే చెప్పొద్దా’

షూస్ కట్టుకున్నాను.

‘దారిలో ఎక్కడైనా నా నంబర్ రీచార్జ్ చేయించండి’

‘సరే’

బయలు దేరాను. ట్రాఫిక్ ఎక్కువగానే ఉంది. ఇంత పొద్దున్నే బయలుదేరి మనుషులు ఎక్కడికి పోతారో. సిగ్నల్ దగ్గర ఆగితే ఫోన్ మోగింది. తనే అనుకుని చూశాను. కాదు. నంబర్ కనపడటం లేదు. దాని బదులు అక్షరాలు ఉన్నాయి. ప్రయివేట్ నంబర్ అని. మా ఆఫీస్‌లో ఒకరిద్దరు డైరెక్టర్లు ఇలాంటి సౌకర్యంతో ఫోన్ వాడతారు. వాళ్లు ఫోన్ చేస్తే నంబర్ కనిపించదు. ప్రైవేట్ నంబర్ అని డిస్‌ప్లే అవు తుంది. మనం తిరిగి వాళ్లకు ఫోన్ చేయలేము. కాని నాకు ఆ డైరెక్టర్లు ఫోన్ చేసే అవకాశం లేదు. ఇది ఎవరిది?

‘హలో’

‘ఆమెను కలవడానికి వెళుతున్నారా?’

‘ఆమె ఎవరు?’

'నిన్న మీరు కలిశారే ఆవిడ'

'ఓ... ఆ.. ఆ.. అవును'

'కలవకండి'

'మీరెవరు?'

ఫోన్‌లో ఏదో కుక్క అదే పనిగా మొరుగుతూ ఉంది. అతడు 'ఏయ్ సునీల్.. ఏయ్ సునీల్' అని గదమాయించి మళ్లీ ఫోన్‌లోకి వచ్చాడు.

'నేను ఆవిడ భర్తను'

'అయితే?'

'ఆవిడ మాటలు నమ్మకండి. డేంజర్‌లో పడతారు. షీ ఈజ్ మ్యాడ్'...

ఒక చేత్తో ఫోన్ పట్టుకొని ఒక చేత్తో డ్రైవ్ చేస్తున్నాను.

'ఇంటికి పోండి'

అప్పటికీ ఏమీ తేల్చుకోకుండా నడుపుతున్నాను.

'సునీల్‌ని చంపేశానని చెప్పిందా?'

'అవును'

అతడు నవ్వాడు.

అవతలివైపు కుక్క అదే పనిగా గోలగా మొరుగుతూ ఉంది.

అతడు పెట్టేశాడు.

కారు పక్కకు తీసుకొని ఆపేశాను. చాలా గందరగోళంగా భయంగా అనిపించింది. లేనిపోని లంపటంలా అనిపించింది. వెనక్కు వెళ్లిపోతే? మళ్లీ ఫోన్ మోగింది.

'హలో'

'ఎక్కడున్నారు?'

'వ.. వచ్చేస్తున్నా. దారిలో ఉన్నా'

'తొందరగా రండి. ఆకలేసేస్తోంది బాబూ'

ఏదో లాగుతోంది నన్ను. ఏం లాగుతోంది? బయలుదేరాను.

ఈసారి నిన్న కూచున్న చోట లేదు. మూలనున్న వెదురు పొదల కింద ఉన్న టేబుల్‌లో కూచుని ఉంది. అక్కడ హట్ అక్కర్లేదు. వెదురుపొదలదే నీడ. తెల్లటి, జుబ్బా లాంటిది వేసుకుని ఉంది. బ్లూ జీన్స్ తొడుక్కుని ఉంది. జుబ్బా మీద పెద్ద పెద్ద గ్రీన్ బటన్స్ ఉన్నాయి. మెడలో ఎత్నిక్‌గా కనిపించే లేత ఆకుపచ్చ దండ ఉంది.

‘ఊ. రాత్రి బాగా నిద్ర పట్టిందా?’

‘ఎందుకు పట్టదు?’

‘నేను నిద్రపోతే కదా?’

‘ఏం నిద్ర పట్టదా?’

‘సంవత్సరాలు’

చేతిలోకి మెనూ కార్డ్ తీసుకుంది. ఒక్కో లీఫ్ తిప్పుతూ ఒక్కో పదార్థం మీద వేలు జారుస్తూ ఉంది.

‘ఓట్ మీల్... బేక్డ్ బీన్స్... పాన్ కేక్స్... చికెన్ హామ్... పోర్క్ హామ్.... ఓ... సారీ సారీ... పోర్క్ చెప్పకూడదు కదూ... సారీ’...

వెయిటర్‌ని పిలిచి చికెన్ హామ్‌బర్గర్స్ ఆర్డర్ ఇచ్చింది.

‘ఇవయ్యాక మోనేస్ సన్‌రైజ్ తాగితే ఉంటుందీ’...

‘మోనేస్ సన్‌రైజ్?’

‘అదే... నిన్న చెప్పానే అరకు కాఫీ అని. దానికి ఇక్కడ పెట్టిన పేరు. ఏంటి మనకు పెయింటింగ్ గురించి ఏమీ తెలియదా?’

‘ఏమీ తెలియదు’

‘ఊహూ... ఇరవైనాలుగ్గంటలూ కూచుని టకుం టుకుం రాసుకోవడమేనా? కళ్లు పెద్దవి చేసుకోకపోతే ఎలా? మోనే చాలా పెద్ద పెయింటర్. ఆయన గీసిన సన్‌రైజ్ చాలా ఫేమస్. ఆ పెయింటింగ్ నుంచే ఇంప్రెషనిజమ్ అనే పెద్ద ఆర్ట్ మూవ్‌మెంట్ నడిచింది’...

నేను ఆమె వైపే చూశాను.

తల స్నానం చేసి చాలా శుభ్రంగా ఉంది. నిన్నటిలా బ్యాగ్‌ను ఒళ్లో పెట్టుకోకుండా పక్కన కుర్చీలో పెట్టుకుంది. కాకుంటే టేబుల్ అంచులను మాటిమాటికి తుడుస్తోంది. కనురెప్పలు యథావిధి.

ఆమె భర్త ఫోన్ చేశాడని చెప్పాలా వద్దా అని కాసేపు ఆలోచించాను.

ఇప్పుడు కాదు.

‘మార్నింగ్స్ మీకు ఇష్టమేనా?’

‘ఎవరికి ఇష్టం ఉండదు?’

‘అలా ఊరికే ఫ్యాషన్ కోసం చెప్పడం కాదు. సన్‌రైజెస్‌ని నిజంగా ఇష్టపడాలి. ఎలా ఇష్టపడాలంటే సూర్యుడూ మనమూ ఎదురూ బొదురూ కాకపోతే ఆ రోజంతా

వెలితి ఫీలైపోవాలి. పెద్దవాళ్లు ఊరికే చెప్పారటండీ ప్రభాతమని? మనసులోని కుళ్లను కడిగేసే వెలుగు అది. ప్రయత్నించాలేగాని ఆ వెలుగులో మనం స్వచ్ఛంగా మారిపోతాం'

కళ్లలో కళ్లు పెట్టి చూసింది.

స్వచ్ఛంగా చూసింది.

మళ్లీ తల దించుకుంది. బెంగగా ముఖం పెట్టింది.

'ఇలాంటి ఒక తెల్లారే– అప్పుడు మావాడు టెన్త్‌లో ఉన్నాడు. నేను లాన్‌లో కూచుని కాఫీ తాగుతున్నాను. ఈ వెధవ నిద్రపోతున్నాడు. మావాడు చాలా డిస్టర్బ్డ్‌గా వచ్చి నా ఎదురుగా ఫోన్ పడేశాడు. ఈ వెధవదే అది. అప్పుడప్పుడు దాంతో ఆడుతుంటాడు మావాడు. చూడు మమ్మీ... డాడీ... వెరీ డర్టీ... అనేసి వెళ్లిపోయాడు. నేను ఫోన్ వైపు చూశాను. ఏదో క్లిప్పింగ్ ప్లే అవుతూ ఉంది. వీడికి తెలియక ఓపెన్ చేశాడు. జుగుప్స. కంపరం ఒళ్లంతా. టక్కున దానిని చేతుల్లోకి తీసుకొని ఒణుకుతున్న వేళ్లతో స్టాప్ చేశాను. ఏం పని ఇది? ఈ వయసులో? ఇంత దాటి వచ్చాక? యూ సీ... మనం మరీ ఎక్కువగా ఆశించి మాట్లాడుకోకూడదు. వియ్ ఆల్ నో వాట్ మెన్ ఆల్వేస్ వాంటెడ్ టు వాచ్. కొంత అర్థం చేసుకోవచ్చు. కమర్షియల్ పోర్నోగ్రఫీకి కూడా ఒక హార్మ్‌లెస్‌నెస్ ఉంటుంది. కాని ఇది అలాంటిది కాదు'.....

ఆర్డర్ వచ్చింది.

తెల్లటి అందమైన ప్లేట్లలో సర్దిన హామ్‌బర్గర్స్. సాస్. గ్లాసులు. వాటర్.

వెయిటర్ రెండు ప్లేట్లనూ ఇద్దరికీ దగ్గరగా జరిపి వెళ్లాడు.

'తీసుకోండి'

'ఊ'

ఆమె బర్గర్‌ని రెండు చేతులతోనూ తీసుకొని నోరంతా తెరిచి పెద్ద భాగాన్ని కొరికి నోట్లోకి తీసుకుంది. ఒక్కళ్లమే ఉంటే పర్లేదుగాని ఎదుటివాళ్లు చూస్తూ ఉండగా అలా తినడం నాక్కొంచెం ఇబ్బంది. పైగా చొక్కా మీద వేసుకోకుండా ఏదీ తినలేను.

'తినండి'

'సరే'

చేతిలోకి తీసుకున్నాను.

ఆమె నములుతూ మింగుతూ అంది.

'మీరు కూడా చూస్తారు కదా'

కొంచెం టంగుటంగుమంది.

'ఏంటి?'

'అర్థం కానట్టు ఆ దొంగమొకం ఎందుకూ?'

'అంటే'...

'మీరేంటి... దొరికితే మగ వెధవలంతా అంతే. అసెంబ్లీలో చూడ్డానికే రెడీ అయి పోయారు. గుళ్లో చూడ్డం ఒక్కటే బాకీ'....

మళ్లీ ఇంకో ముక్క కొరికింది.

'ఒక ప్రశ్న అడుగుతాను జవాబు చెప్పండి'

'అడగండి'

'మొబైల్‌ఫోన్‌లో వీడియో కెమెరా ఎందుకండీ?'

ఏం చెప్పాలో తెలియనట్టుగా చూశాను.

'ఫొటో అంటే నా చిన్నప్పుడు పెద్ద తతంగం. మూడు నాలుగురోజుల ముందే అనుకొని మంచి బట్టలు ఏర్పాటు చేసుకొని స్నానాలు చేసి శుభ్రంగా తయారయ్యి స్టుడియోకు వెళ్లి... లేకుంటే ఏదైనా ప్రత్యేక ఘట్టంలో... శుభకార్యంలో.... ఫొటో తీశామంటే ఆ క్షణానికో విలువుండాలి. దానికో జ్ఞాపకం ఉండాలి. మొబైల్స్ వచ్చాక చూడండి. తుమ్మినా ఫొటో. దగ్గినా ఫొటో. కింద పడ్డా ఫొటో. పైకి లేచినా ఫొటో. ఏం ఇదేమైనా జాతర? పగటి వేషగాళ్లమా మనం? అంత ఏముంటుందండీ ప్రతీ దానికీ? ఇంక వీడియో షూట్ అంటే దానిక్కూడా ఎంత పెద్ద సందర్భం ఉండాలి. ఎంత మంచి జ్ఞాపకం కావాలి. ఒక ఈవెంట్ అయితేనో... ఒక లెక్చర్‌ను రికార్డ్ చేయడానికో... ఒక మహాత్ముడో పెద్దమనిషో వచ్చాడనో... పెళ్లి క్యాసెట్టుకో... ఇప్పుడు చూడండి ఏమయ్యిందో'...

మనిషి మారుతూ ఉంది.

బర్గర్‌ను ప్లేట్‌లో ఉంచి టేబుల్ అంచుల్ని పదేపదే వేగంగా తుడవడం మొదలు పెట్టింది.

తల కొంచెం దించి పెదాలు కదిలేలా గొణిగింది.

చూస్తూ ఉన్నాను.

ముఖం మారుతూ ఉంది.

చివాలును తల ఎత్తింది.

'నేను చూశానండీ అదంతా' అరిచింది.

అదిరిపడ్డాను.

అటూ ఇటూ చూసింది.

అవతలి టేబుళ్ల వాళ్లు ఒక క్షణం గమనించి మానుకున్నారు.

సర్దుకుంది.

'ఛీ.. ఇది శిక్ష. పనిష్మెంట్. అసహ్యం. షిట్. కాని చూశాను నేను. అసలు ఏమిటా వీడి సంగతి అని మళ్లీ మొబైల్ తీసుకొని ఫోల్డర్ ఓపెన్ చేసి అన్ని క్లిప్పింగ్స్ చూశాను. ఏమిటవి? ఇక్కడివే. ఈ దేశానివే. ఇక్కడి ఆడవాళ్లవే. నమ్మకద్రోహం. మీ మగవెధవల నమ్మకద్రోహం అది. భార్యలతో, గర్ల్‌ఫ్రెండ్స్‌తో, ప్రాస్టిట్యూట్స్‌తో మీరు చేసిన దరిద్రమంతా మొబైల్స్‌లో రికార్డ్ చేసి– అదేదో సరదాగా చేస్తున్నట్టుగా నటిస్తూ– లేకుంటే వాళ్లకు తెలియకుండా తీస్తూ– గొప్ప కోసం ఫ్రెండ్స్‌కు చూపించి అక్కణ్ణుంచి అవి చేతులు మారి దేశమంతా... ప్రతి మొబైల్‌లో సిడిల్లో పెన్ డ్రైవ్స్‌లో... అక్కచెల్లెళ్లు కాదా వాళ్లు... మన ఇంటి ఆడవాళ్లు కాదా వాళ్లు.. బతుకుతారా వాళ్లు ఇది తెలిస్తే? స్టూడెంట్స్‌ని... ఆఖరికి ప్రీటీన్ పిల్లల్ని కూడా మభ్య పెట్టి.... అన్నం దొరుకుతుందా మీకు? నీళ్లు ముడతాయా? ఏం సేఫ్ మనం? నేను సేఫా? మీ వైఫ్ సేఫా? పర్వర్టెడ్ బాస్టర్డ్స్'....

ఎగశ్వాస తీసుకుంటూ ఆగింది.

ఆమె నన్ను తిడుతోంది. ఆమె భర్తను తిడుతోంది. నన్ను తిడుతున్నట్టుగా ఆమె భర్తను.

అలాగే చూస్తూ కూచున్నాను.

ఆమె కొంచెం కొంచెంగా నెమ్మదించింది. అంచుల మీద చేతుల వేగం తగ్గింది. మళ్లీ బెంగగా తల దించుకుంది.

'ఆ రోజు నుంచే కష్టాలు మొదలయ్యాయండీ నాకు. ఎప్పుడైతే అవి చూసి నేను ప్రొటెస్ట్ చేయడం మొదలుపెట్టానో అప్పట్నించే'....

ఊరికే ఉండిపోయింది.

కాఫీ వచ్చింది.

మోనేస్ సన్‌రైజ్.

ఆ పరిమళం ఆమెను ఇంకాస్త శాంతపరిచింది.

'మీ పేపర్‌లో ఒక మూవ్‌మెంట్ స్టార్ట్ చేయగలరా మీరు?'

'ఏం మూవ్‌మెంట్?'

‘అదే.. మొబైల్స్‌లో కెమెరాలు బేన్ చేయాలనే మూవ్‌మెంట్. ఇప్పుడూ... అల్లోపతి వచ్చిన కొత్తల్లో మన దేశంలో ఏం చెప్పారండీ? అల్లోపతి గొప్పది... పత్యం అక్కర్లేదు అనేగా? ఇప్పుడు పత్యం చెప్పని అల్లోపతి డాక్టర్ ఉన్నాడా? అసలు అల్లోపతే పనికిరాదని ఆల్టర్నేటివ్ మెడిసిన్ వైపు పోవడం లేదా మనం. అంతే. టెక్నాలజీ మంచిదే అని తెచ్చుకుంటాం. అది చెడ్డది అని తేలాక వద్దు అని బేన్ చేయొచ్చుగా. ఫోన్ అంటే మాట్లాడ్డానికి మాత్రమే. లేకుంటే ఏమవుతుందంటే అసలే ప్రతివాడికీ రెండు కళ్లు... మొబైల్‌తో కలిపి మూడో కన్ను. ప్రతి వెధవా ఒక ముక్కంటా? శివుడికైతే చెల్లుతుందిగాని’

ఊరికే కూచున్నాను.

వెదురు ఆకులు కూడా రాల్తాయ్.

ఆమె మరికాసేపు కాఫీ తాగింది. కప్పు వైపే చూస్తూ అడిగింది.

‘వంట చేస్తారా మీరు?’

‘ఏంటి?’

‘ఊహూ... ఎవరైనా చేస్తే మెక్కడమేనన్న మాట. ఏదో నవాబుగిరీ కదా. మంచి పులావ్ చేస్తే ఇంటికొచ్చి తిందామనుకున్నా. మీరు కూడా అంతేనన్నమాట. గెస్టులను పిలిచి ఆ తలనొప్పంతా ఆడవాళ్ల మీద వేసి. ఏం వండలేరా మీరూ?’

ఏం చేయాలో తోచక సెల్ చేతిలోకి తీసుకున్నాను.

కాఫీ తాగుతూ తాగుతూ అంది.

‘ఈ వెధవ భలే వండేవాడండి. ఇంజనీరింగ్ కాలేజ్‌లో మేం క్లాస్‌మేట్స్. ఆదివారం రూమ్‌కి వెళితే నాటుకోడి పట్టుకొచ్చి ఒక్కోసారి చింతచిగురు.. ఒకోసారి ఉత్త కరివేపాకు... ఒకోసారి మెంతి కూర.... అదరగొట్టేసేవాడు. నేనంటే చాలా ప్రేమలేండి. మనం బాగుండాలి.. బాగా బతకాలి అని... పెళ్లయ్యాక నన్ను మా గుంటూర్లో ఉంచి ఇక్కడ ఫర్మ్ ఎస్టాబ్లిష్ చేయడానికి అన్నం నీళ్లు మాని ఐదేళ్లు కష్టపడ్డాడు. పెట్టుబడి ఎక్కడిదని అడగరేం?’

‘ఎక్కడిది?’

‘నాదే. మా ముసల్ది నా మనవరాలికి ఉండాలని ఐదెకరాలు దాచి పెట్టింది ఎప్పుడో. అది అమ్మి ఇచ్చాను. ఇక్కడ మరీ అన్యాయం. మీవాడే నవాబు గారట– ఎకరా మూడు లక్షలకు– లేకే జావ్ లేకే జావ్ అని ఇచ్చాడట. నాలుగు ఎకరాలు. ఇప్పుడు ఒకో ఎకరా పద్నాలుగు కోట్లు’

నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంది.

ఇంకో నాప్‌కిన్ తీసి నాకు అందించింది.

'డివోర్సంటే ఇదొకటి తేలాలి. ఉమ్మడిగానే ఉన్నాయి అన్నీ. అందుకని వాడు కదల్డం లేదు. అదీగాక నన్ను వదులుకోవడం కూడా ఇష్టం లేదు. నేనుండాలి. వాడికి అడ్డు చెప్పకుండా ఉండాలి. వాడు తానా అంటే నేను తందానా అనాలి. నేను అనను. డివోర్సంటాను. అది వాడికి నష్టం. హత్యలూ గిత్యలూ ప్లాన్ చేసేంత ధైర్యస్తుడు కాడు. పిరికి వెధవ. కొడుకు ముందు కూడా తలెత్తుకుని ఉండాలి కదా. అందుకని ఇలా ప్లాన్ చేశాడు. నెమ్మది నెమ్మదిగా నన్ను ఒంటరిదాన్ని చేసి... పిచ్చి పట్టించి'... ఆగింది.

'ఎవరితో చెప్పుకోను... తమ్ముడు బతికుంటే... అయినవాళ్లే లేని బతుకై పోయిందే'.... కళ్లల్లో కొంచెం కన్నీళ్లు వచ్చాయి. కొంచెమే. వెంటనే నాప్‌కిన్‌తో అద్దేసింది.

'వీడు ఎప్పుడోగాని ఇంటికి రాడండి. వచ్చినా మాకు మాటల్లేవు. సునీల్ ఉంటే చాలు నాకు. ఎవరు ఉన్నా లేకున్నా డోన్ట్ కేర్. అది గమనించాడు. ఒకరోజు నేను వద్దు వద్దంటున్నా వినకుండా వ్యాక్సిన్ వేయించుకు వస్తానని తీసుకెళ్లి చంపి పారేసి ఏమీ ఎరగనట్టుగా'.....

వెక్కి వెక్కి ఏడ్చింది.

'సునీల్... ఎంత ముద్దొచ్చేదో తెలుసా అండీ. కళ్లతోనే ఎన్ని మాటలు మాట్లాడేదో తెలుసా? ఎంత ప్రేమగా నిజాయితీగా ఉండేదో తెలుసా? నీకెందుకు నేనున్నానుగా అని పులిలా ఇల్లంతా కాపలా కాసేది. లేకుంటే కాళ్ల దగ్గరే కూచుని ఉండేది. మనిషి కుక్కలా ఎప్పటికి మారగలడో కదా'.....

నాకు నోటి దాకా వచ్చింది.

ఆమె భర్త ఫోన్ చేశాడని. ఫోన్‌లో సునీల్ అరుపులు విన్నానని.

ఆమె చెప్పింది.

'వాడెంత సిస్టమేటిక్‌గా టార్చర్ ప్లాన్ చేశాడో తెలుసా అండీ. సునీల్ అరుపులు రికార్డ్ చేసి మా పిసిలో లోడ్ చేశాడు. ఉదయాన్నే కావాలని పిసి ఆన్ చేసి లౌడ్ స్పీకర్లలో దాని అరుపులు వినిపిస్తాడు. అవి వింటూ నేను వెర్రెత్తి పోవాలన్న మాట'.....

నేను నిశ్శబ్దంగా అయిపోయాను.

ఎవరు సత్యం ఏది సత్యం అర్థం కాకుండా ఉంది.

ఈమే సత్యం.

ఈమె సత్యమా?

'ఇంకో డాండక్స్‌ను కొనుక్కోకపోయారా?'

'డాండక్స్ కాదు డాక్సండ్'

'అదే అదే'

'మీకు కుక్కల గురించి తెలియనప్పుడు ఊరికే ఉండొచ్చుగా'

'సారీ... సారీ'

'అందరికీ అన్ని కుక్కలు మేచ్ కావు. అన్నిసార్లు అన్ని కుక్కలూ మేచ్ కావు.'

వెయిటర్ వచ్చి ఇంకేమైనా కావాలా బిల్లు తేవాలా అన్నట్టుగా నిలుచున్నాడు.

'ఇంకేమైనా?'

'వద్దు. వెళ్లాలి'

'ఇంకొంచెం కాఫీ?'

'వద్దు. థ్యాంక్స్'

బిల్లు వచ్చింది. కొంచెం నటించాను. ఆమె పట్టించుకోకుండా బ్యాగ్ తెరిచి బిల్లు పే చేసింది. తర్వాత చెక్‌బుక్ తీసింది.

'మీ స్పెలింగ్ చెప్పండి'

'ఎందుకు?'

'అడిగింది చేయొచ్చుగా?'

స్పెలింగ్ చెప్పాను.

రాసి సైన్ చేసి ఇచ్చింది.

'ఎందుకు?'

'ఊరికే. మీ పబ్లికేషన్స్‌కు సపోర్ట్ కోసం'

నటించాను. నటించలేదు. రెండూ చేశాను.

'సంతోషమే. కానీ...'

'జేబులో పెట్టుకోండి'

పెట్టుకున్నాను.

ముఖంలో ముఖం పెట్టి చూస్తూ అంది.

'థ్యాంక్యూ'

'ఎందుకు?'

'సమ్ ఆఫ్ యువర్ స్టోరీస్ ఆర్ యాంటీ డిప్రెసెంట్స్. మీలాంటి వాళ్లు రాయాలి'

ఊరికే ఉన్నాను.

లేచింది.

ఇద్దరం బయటకు వచ్చాం.

'మీరు ప్లాన్ చెప్పలేదు'

'ఏం ప్లాన్?'

'అదే... మా వెధవది. నన్ను లైవ్‌లో కూచోబెట్టవచ్చు కదా మీ చానెల్‌లో. బ్యాక్‌గ్రౌండ్‌లో ఈ వెధవ ఫొటో పెట్టి. నేను మొత్తం చెప్తాను కదా. ఈ అమ్మాయి క్లిప్పింగ్ సరిపోదా'

'అలా చేస్తే ఆ అమ్మాయి ఎక్స్‌పోజ్ అవుతుంది'

'అదే కదా'

'మీ అబ్బాయ్ సంగతి కూడా మీరు మర్చిపోతున్నారు'

'ఊ'...

'ఏంటంటే మీరిద్దరూ ఎలా మట్టిగొట్టుకుపోయినా పర్వాలేదు. మీ అబ్బాయ్ సఫర్ కాకుండా చూసుకోండి. మీరిద్దరూ రచ్చకెక్కితే– వాళ్ల నాన్న గురించి అమ్మ– అదీ ఏ ఫ్రాడో గీడో అంటే పర్లేదు– ఇలాంటి వ్యవహారాల్లో అంటే పిల్లలు తట్టుకోవడం కష్టం. మీ అబ్బాయికి తెలియకుండా లేదా బయట గోల జరక్కుండా ఏమైనా కరెక్ట్ చేయగలరేమో ఆలోచించండి'

ఆమె తల అడ్డంగా ఆడించింది.

'వాడేం మారతాడండి... చిత్తకార్తె వెధవ'...

చెంపలు వేసుకుంది.

'తప్పు తప్పు. కుక్కల్ని ఏమీ అనకూడదు. వాటికీ ఒక సీజన్ ఉంటుంది. వాటికీ ఒక నీతి ఉంటుంది. మగాళ్లలా కాదు'

నేనే అన్నట్టు చూసింది.

'మీకు తెలుసా?'

'ఏంటి?'

'ఈ మధ్య తాష్కెంట్‌కు చక్కర్లు కొడుతున్నాడు'

'తాష్కెంట్?'

'అవును. ఉజ్బెకిస్తాన్‌కు ఏం ఖర్మ పట్టిందో చూడండి'

ఇద్దరం పార్కింగ్ దగ్గరకు వచ్చాం.

ఇద్దరం విడిపోయాం.

ఆఫీసుకు వస్తే కాసేపు తోచలేదు. ఫేస్‌బుక్‌లో మా అబ్బాయ్... మా చెల్లాయ్... పార్క్‌లో నేను... అని ఎవరెవరో ఫొటోలు పెట్టి ఉంటే చూస్తూ కూచున్నాను.

ఫోన్ మోగింది.

ప్రయివేట్ నంబర్.

'హలో'

'నేను చెప్పినా విన్లేదు'

'అవును'

'కలవొద్దంటే కలిశావ్'

'అవును'

'పోతావ్ అంటే వినవురా'

'అవును'

'ఏయ్... పిచ్చిపిచ్చిగా ఉందా. నీ పైవాళ్లతో మాట్లాడనా?'

'మాట్లాడితే?'

'మాట్లాడితేనా? ఏం... పొగర్రా? అయిపోతావ్. మీ జగన్ బయటికొస్తాడనుకుంటున్నావా? మీ పేపర్ ఉంటుందనుకుంటున్నావా?'

'నువ్వు పెట్టు బాబాయ్'

'బాబాయా'

'పెట్రా గన్నాయ్'

పెట్టేశాడు.

మళ్లీ ఫేస్‌బుక్ చూస్తూ కూచున్నాను. ఎవరెవరివో ఏవేవో భావాలు. 'నీడలు ఎన్నయినా దూరాలు తీరాలేలే'... లాంటి కోట్స్ కొందరు పెట్టి ఉన్నారు. చూస్తూ ఉన్నాను.

మళ్లీ ఫోన్ మోగింది.

ప్రయివేట్ నంబర్.

'హలో'

'సర్. నేను చెప్పేది వినండి'

'చెప్పండి'

'షి ఈజ్ మ్యాడ్. కావాలంటే ఈసారి అడగండి. తను మెడికేషన్ మీద ఉంది. కావాలంటే అడగండి. హెల్యూసినేషన్స్ ఉంటాయి తనకు. జరిగినవి జరగలేదనుకుంటుంది. జరగనివి జరిగాయనుకుంటుంది. పెళ్లయినప్పటి నుంచి తను నన్ను వదిలింది లేదు. కొంచెం కూడా స్వేచ్ఛ ఇచ్చింది లేదు. మగాళ్లన్నాక చిన్నాచితకా ఏవో సర్దాలుంటాయి. వాటిని భూతద్దంలో నుంచి చూసి రాద్ధాంతం చేస్తూ ఉంటుంది. నన్ను ఎన్నిసార్లు కొట్టిందో మీకేం తెలుసు'....

ఆగాడు.

గొంతు నిజంలా అనిపిస్తోంది.

నిజంలాంటిదా?

'స్టిల్ ఐ లవ్ హర్. ఏవో పొరపాట్లు జరిగాయి నా వల్ల కూడా. దానికే డిప్రెసివ్ అయిపోయింది. అందుకే కంటికి రెప్పలా చూసుకుంటూ ఉంటాను. ఎవ్వర్నీ కలవనివ్వను. పిచ్చిది కదా ఏం ప్రాణం మీదకు తెచ్చుకుంటుందోనని. ఫోన్ టాప్‌లో పెట్టాను. ఇప్పుడు చెప్పండి. నేనా బాధితుణ్ణి. ఆవిడా?'

ఏం గోల ఇది నాకు.

'సరే'

'ఏం సరే'

'మీ ఖర్మ. నన్ను వదిలిపెట్టండి'

పెట్టేశాను.

ఆ తర్వాత నేను వాళ్లను పట్టించుకోలేదు. ఆఫీసులో కూడా కుదరలేదు. ఏవో మార్పుచేర్పులు. వేరే పేజీ బాధ్యతలు అప్పజెప్పారు. మళ్లీ ప్రూవ్ చేసుకోవాలి. పని ఎంత పాతదయినా ఎప్పుడూ ఒక కొత్త ఉంటుంది. దానికి అడ్జస్ట్ అయ్యేలోపు మూడు నాలుగువారాలు గడిచిపోయాయి. ఆమె ఫోన్ చేసింది.

'హలో'

'సాయంత్రం కలవకూడదూ మంచి డెవలప్‌మెంట్స్ ఉన్నాయ్. చెప్తాను'

'సాయంత్రమా?'

'ఏం... ఏంటంత బిజీ. కంప్యూటర్ ముందు కూచుని కుచుకుం కుచుకుం కీబోర్డ్ నొక్కుకోవడమేగా?'

చెక్కు తీసుకున్న విశ్వాసం ఉంది.

'ఎక్కడా?'

'అక్కడే'

వెళ్లాను.

ఈసారి ఇన్నర్ స్పేస్‌లో కూచుని వైఫైకి కనెక్ట్ అయ్యి ల్యాప్‌టాప్‌లో ఏవో పాటలు వింటున్నట్టుంది. హెడ్‌ఫోన్స్ ఉన్నాయి. నన్ను చూసి హెడ్‌ఫోన్స్ తొలగించుకుంటూ నవ్వింది.

'ఈ మధ్య మిమ్మల్ని తలుచుకుని రెండు మూడుసార్లు నవ్వుకున్నాను'

'ఎందుకు?'

'మా కుక్క ఏ జాతిదో చెప్పండి'

'డాండక్స్'

'టాన్‌టెక్స్‌లాగా భలే గుర్తుపెట్టుకున్నారండీ. అది డాక్సండ్' నవ్వింది.

కూచున్నాను.

'కోల్డ్ కాఫీ ట్రై చేస్తారా?'

'చేయొచ్చు'

'డాలీస్ డిలైట్'... రెండు చెప్పింది.

అంటే ఏంటో అడగలేదు. దాని వెనుక ఏం కథ ఉందో.

కాఫీ వచ్చింది.

తాగుతూ కూచున్నాం.

ఆమె నా వైపు నిరాశగా చూసింది.

'మీతో ఏమిటి మాట్లాడటం?'

'ఏం?'

'కుక్కల గురించి మీకేమీ తెలియదే'

చూస్తూ ఉన్నాను.

ఆమె చెప్పింది.

'ఇప్పుడూ... మీ ఇంట్లో ఫిరానా డెయిన్ ఉందనుకోండి... అంటే ఏంటని అడక్కండి... ఏనుగంత ఉండే కుక్క... అది మీతో ప్రేమగా ఉంటూ ఒకరోజు హటాత్తుగా మిమ్మల్ని చూసి కోరలు చూపించి కరుస్తా అన్నట్టు ముందుకొచ్చిం

దనుకోండి. అప్పుడు మీరేం చేస్తారు?'

'భయపడతా'

'ఉత్త భయపడ్తారా? పోసుకొని యానిమల్ ట్రైనర్‌కు ఫోన్ చేస్తారు. ఒరే బాబూ... దీని సంగతి చూసి పోరా అని. అవునా?'

'అవును'

'అదే మా డాక్సండ్ ఉందనుకోండి. బుజ్జిది. కుయ్‌కుయ్‌మంటూ ఉంటుంది. అది ఉన్నట్టుండి ఏయ్ ఏమనుకున్నావ్ అని బెదిరించిందనుకోండి. ఏం చేస్తాం?'

చూస్తూ ఉన్నాను.

'నెత్తి మీద చిన్నగా మొట్టి నీ ముఖంలే వెర్రిముండా అని ముద్దు చేస్తాం. అవునా?'

చూస్తూ ఉన్నాను.

ఆమె సీరియస్ అయిపోయింది. చాలా.

'అదే మనం చేసే తప్పు'

ఇంకా సీరియస్ అయిపోయింది. ముఖం మారిపోతూ ఉంది. రెప్పలు టపాటపా కొట్టుకుంటున్నాయి. మూత పెట్టిన ల్యాప్‌టాప్ మీద చేతులు పదే పదే కదిలిపోతున్నాయ్.

'కుక్కకేం తెలుసు. చిన్నదో పెద్దదో. అది ఒక ప్రాణం. అన్ని కుక్కల ప్రాణాలతో పాటు దాని ప్రాణం కూడా సమానం. పెద్ద కుక్కయితే ఒకలాగా చిన్నకుక్కయితే ఒకలాగా ఏంటిది? సైజ్‌ను బట్టి డిసైడ్ చేస్తావా? జెండర్‌ను బట్టి డిసైడ్ చేస్తావా? ఆడవాళ్లు ప్రొటెస్ట్ చేస్తే... ఆ ఏముందిలే అనుకుంటే ఎట్లా? నీ కంటే బలహీనమనా నీ పొగరు. నీ మీద డిపెండెంట్ అయ్యిందనా నీ పొగరు. ఆ... ఇద్దరు ముగ్గుర్ని కని పడేశాము ఎక్కడికిపోతుంది పడి ఉంటుందనా నీ పొగరు. ఏం పొగరు అది? నువ్వు సేమ్ అయితే నేనూ సేమే. నువ్వు ఎవరితోనో పోతానంటే నేనూ పోనా. వద్దనుకుంటున్నానే. పశువులమా మనం? అర్థం కాదా? భార్యల ప్రొటెస్ట్‌ను సీరియస్‌గా తీసుకోకనే– అది ఏ విషయానికైనా– అనర్థాలు. ఆమె ఏదో ఒక అఘాయిత్యం చేస్తే తప్ప వాడు మేల్కోడు. అప్పటికి అంతా అయిపోయి ఉంటుంది. ఈ ఆడవాళ్లంతా ఇంతే అని ఇంకా ఎంతకాలం కూస్తూ ఉంటారు. మేం ప్రొటెస్ట్ చేస్తున్నామంటే ప్రొటెస్ట్ చేస్తున్నట్టే.'

ఆగింది.

నేను కాఫీ తాగుతూ చూస్తూ ఉన్నాను.

'మా వెధవకు చెప్పి చూశాను. ఒరే వద్దురా కనిపించినదాన్నల్లా తగులుకోవద్దురా

అని చెప్పి చెప్పి చూశాను. విన్నాడా. మీరంతా ఏమనుకుంటారంటే ఆ... దానికేం తెలుస్తుంది మన చాటు మాటు వ్యవహారం అనుకుంటారు. ఆడవాళ్లు గుడ్డివాళ్లట్రా. మీ ముకం నీడను చూసి కనిపెట్టగలరు మీరేం తప్పుడు పనులు చేసి ఇళ్లకు చేరు తున్నారో. కాని వింటార్రా మీరు'...

నన్నే అంటోంది.

చూస్తూ ఉన్నాను.

ఒక గుక్కతాగి స్థిమిత పడుతూ అంది.

'అందుకేలేండి. మీ సలహా పాటించి చేయాల్సిన శాస్తి చేశాను'

నేను చల్లగా అయిపోయాను.

'ఏం చేశారు?'

'ఏంటలా బిగుసుకుపోయారు?'

మామూలుగా కూచున్నాను.

'అంటే శాస్తి చేసేంత పని చేశాను. కొంచెంలో మిస్సయ్యాడు. ఏం లేదండి. వాడు తాగి నిద్ర పోతుంటే కొంచెం క్లోరోఫామ్ వాసన చూపించడానికి ట్రైయ్ చేశాను. అది సరిగ్గా నాకు చేతకాలేదు. బాగానే మత్తెక్కి ఉంటుందనుకున్నాను. కత్తి తీసుకొని వాడి చేతివేళ్లు కోసేశాను'

ఇప్పుడు నిజంగా నిలువెల్లా బిగుసుకుపోయాను.

'ఏంటలా చూస్తున్నారు? మీరేగా చెప్పారు'

'నేనేం చెప్పాను'

'గుట్టు చప్పుడు కాకుండా చేయండన్నారుగా'

'అయితే'

'ముందు వాడి ఎడమ చేయి బొటనవేలూ చూపుడువేలూ కోసేశాను. రక్తమే రక్తం. నా వల్ల కాలేదు. చాలా సాఫెస్టికేటెడ్ కిచెన్ వేర్ ఉంది మా ఇంట్లో. అలాంటి కత్తికి కూడా వేళ్లు తీసేయడమంటే కష్టమే అయ్యింది. మొత్తం పది వేళ్లూ తీసేద్దామ నుకున్నాను. కాని నిజంగానే నా వల్ల కాలేదు. రెండు తీసే సరికి జాలి వేసింది. అదీగాక, వాడు అసాధ్యుడు కదా, అంత మత్తులో కూడా లేచి గగ్గోలు పెట్టి వేళ్లు వెతుక్కుని హాస్పిటల్‌కు పరిగెత్తాడు'

ఇక నేను చేయగలిగింది ఏమీలేదు.

కళ్లప్పగించి చూస్తూ ఉన్నాను.

'కారు డోర్‌లో పడ్డాయని చెప్పాడంట. వాళ్లకు తెలియకనా? కాని డబ్బిస్తే లొంగనిది ఎవరు? హుషప్ చేశాడు. నేను కూడా చూశాను. కేసు గీసూ అని గోల చేస్తాడేమో గొడవ చేసి బండారం బయటపడేద్దామని. కాని తేలు కుట్టినట్టు ఉండి పోయాడు'

చూస్తూ ఉన్నాను.

కాఫీ చాలా చల్లగా ఉంది.

'వేళ్లే ఎందుకు అని అడగరేం?'

'ఎందుకు?'

'ఎందుకు అనంటే– దెన్ వోన్లీ హి కాంట్ హోల్డ్ ది బ్రెస్ట్ ఆఫ్ అదర్ ఉమన్. హి కాంట్ ఫీల్ ది బాడీ ఆఫ్ అదర్ ఉమన్. ఈవెన్ హి కాంట్ హోల్డ్ హిజ్ థింగ్ వైల్'....

వినలేక ఎటో చూశాను.

ఆమె మళ్లీ బెంగగా అయిపోయింది.

తల కిందకు దించుకుంది.

కప్‌ను సాసర్ మీద మెల్లిగా రుద్దుతూ అంతలోనే ఎదురుగా దెయ్యాన్ని చూసినట్టుగా బిగుసుకుపోయింది. ఏమిటన్నట్టు చూశాను. ఒక్క ఉదుటున లేచి ఇన్నర్ స్పేస్‌లో నుంచి గ్లాస్‌డోర్ తీసుకొని ఓపెన్ ప్లేస్‌లోకి పరిగెత్తింది. తల తిప్పి కంగారుగా చూశాను. ఎవరో ఒకతను బ్లాక్ ప్యాంట్ బ్లాక్ షర్ట్ వేసుకొని ఇన్ చేసి ఉన్నాడు. అతడు రావడానికి చూస్తున్నాడు. ఆమె నిరోధిస్తూ ఉంది.

లేచి వేగంగా బయటికి వచ్చాను.

ఓపెన్ ప్లేస్‌లో హట్స్ ఉన్నాయి. టేబుల్సూ. కూచుని కాఫీలు తాగుతున్నవాళ్లూ. డిమ్ లైటింగ్.

ఇద్దరూ నన్ను చూశారు.

'ఏరా... ఎన్నిసార్లు చెప్పాను. కలవొద్దన్నాగా'

ఆమెను లాక్కుపోతున్నాడు.

ఆమె నిరోధిస్తోంది.

'వదులు... వదులు... ఇక్కడే ఉండనీ'

'ఏం చేస్తావ్... ఇరవైనాలుగ్గంటలూ... ఇలాంటివాళ్లతో'

లాగుతున్నాడు.

‘వద్దు... నేన్రాను... నువ్వెళ్లు... చంపుకు’

‘రా’

‘నేన్రాను... ఉండనీ... ఇంట్లో పిచ్చెక్కుతోంది’

అందరూ చూస్తున్నారు. ఎవరూ అడ్డుపడే అమర్యాదకు పాల్పడ్డం లేదు.

‘ఏయ్.. వదులు’

‘నువ్వెవడివిరా?’

‘వదులు’

కోపంగా, హితవు చెప్తున్నవాడిలా చూశాడు.

‘దీన్తో పెట్టుకుంటే పోతావురా ఫూల్’

‘నువ్వు హరాస్ చేస్తున్నావ్’

‘నేను హరాస్ చేస్తున్నానా?’

తలాడించాడు.

‘అలా చెప్పిందా? ఇంకా ఏమేం చెప్పింది. నా ఎడమ చేతి వేళ్లు కోసేశానని చెప్పి ఉంటుందే’

చూస్తూ ఉన్నాను.

లాగుతున్నాడు.

ఆమె ఏడుస్తూ విడిపించుకోవడానికి పెనుగులాడుతూ ఉంది.

‘ఇదిగో చూడు’

చేయి చూపించాడు.

‘నా ఎడమ చేయి. కోసేసిందా? చూడు. నా వేళ్లు చూడు’ చూపించాడు.

అదిరిపోయి నిలబడ్డాను.

లాక్కుని పోతూ, బయటకి వచ్చి, పార్కింగ్ దాకా తీసుకువెళ్లి డోర్ తీసి ఆమెను లోపలికి తోశాడు.

బయటకు వచ్చాను.

స్ట్రీట్ లైట్స్ వెలుగుతున్నాయి.

ట్రాఫిక్.

చుట్టూ తిరిగి డ్రైవింగ్ సీట్ వైపు వెళుతూ ఉన్నాడు.

ఆమె కారులో తల కొట్టుకుంటూ ఏడుస్తూ ఉంది.

గమనించాను.

ఏంటది?

పరిగెత్తుకుంటూ వెళ్లి గమనించబోయాను.

అతడు గమనించి వేగంగా కారుతీసి పరిగెత్తిస్తున్నాడు.

స్టీరింగ్ మీద చేతులు.

కుడి చేతికి స్కిన్ కలర్ గ్లవ్ ఉంది.

వెతికాను.

బొటనవేలూ చూపుడువేలూ కనిపించలేదు.

జూన్ 7, 2013

కృతజ్ఞతలు

**కోడూరి విజయకుమార్** గారికి

**జంపాల చౌదరి** గారికి

**జి.ఆర్.మహర్షి** గారికి

**అన్వర్** గారికి

ఈ కథలు ముందు చదివినందుకు...